శుక్రవారం
18•08•2017

హైదరాబాద్
• వెల.5 రూ.

• సంపుటి 7 • సంచిక 72
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

డ్రాగన్ యుద్ధభాష

సమరానికి సన్నాహాలు చేస్తున్న చైనా!

- డోక్లామ్ సమీపప్రాంతాలకు రక్త నిల్వ కేంద్రాలు
- భారత్‌పై అంతర్జాతీయంగా చైనా దుష్ప్రచారం
- అవహేళన చేస్తూ ట్విట్టర్‌లో వీడియో



బీజింగ్, ఆగస్టు 17:

డోక్లామ్ ప్రతిష్టంభనపై చైనా వ్యవహారం రోజురోజుకూ శ్రుతిమించుతున్నది. తన యుద్ధభాషను మరింత ఉన్మాదస్థాయిలో ప్రదర్శిస్తున్నది. సైన్యాన్ని వెనుకకు తీసుకోకపోతే యుద్ధానికి సిద్ధం కావాల్సిందేనంటూ ప్రభుత్వ మీడియా ద్వారా భారత్‌కు హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చిన చైనా.. తాజాగా, యుద్ధానికి అవసరమైన సన్నాహాలు కూడా చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. యుద్ధమే జరిగితే రణరంగంలో గాయపడే సైనికులకు ఎక్కించటానికి అవసరమైన రక్తాన్ని ముందుగానే సేకరిస్తున్నది. ఈ మేరకు డోక్లామ్ సమీపప్రాంతాల్లో రక్తదాన శిబిరాలను, రక్తనిల్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా వార్తలు వెలువడ్డాయి. తమ దేశంలో వివిధ రాష్ట్రాల్లోని దవాఖానల్లో ఉన్న రక్తనిల్వ కేంద్రాలను (బ్లడ్‌బ్యాంకులను) తరలించాలని సైన్యం ఆదేశించిందని, ఈ మేరకు తరలింపు కార్యక్రమం జరుగుతున్నదని చైనా అధికార పత్రిక గ్లోబల్‌టైమ్స్ తెలిపింది. హ్యూనాన్, హ్యూబీ రాష్ట్రాలతోపాటు గుయాంషి జువాంగ్ స్వయంప్రతిపత్తి ప్రాంతం నుంచి బ్లడ్‌బ్యాంకులను తరలిస్తున్నారని పేర్కొంది. సిచియాన్ రాష్ట్రం నుంచి ఇప్పటికే రక్తనిల్వ కేంద్రాలను తరలించారని, ఈ నెల 8న ఆ రాష్ట్రంలోని జియుజాంగ్యూ ప్రాంతంలో భూకంపం సంభవించకముందే ఇది జరిగిందని వెల్లడించింది. మొత్తమ్మీద ఈ విధంగా సేకరిస్తున్న రక్తాన్ని టిబెట్‌కు తరలించనున్నట్లు గ్లోబల్‌టైమ్స్ తెలియజేసింది. భారత్-చైనా మధ్య వివాదానికి కారణమైన డోక్లామ్ ప్రాంతం ఉన్నది టిబెట్‌కు సమీపంలోనే. అంటే, భారత్‌తో యుద్ధానికి సిద్ధమవటంలో భాగంగానే.. యుద్ధానికి అవసరమైన నిల్వలను

మిగతా 5వ పేజీలో

- మనలో మార్పు.. దేశమంతటికీ వినిపించాలి
- రంగులుండని 'మట్టి'మనుషులమవుదాం
- ఎకో గణేశా అవగాహన కార్యక్రమంలో కేటీఆర్
- కోలాహలంగా వినాయక మట్టి ప్రతిమల పంపిణీ



గణేశ్ ప్రతిమలను విద్యార్థినులకు పంపిణీ చేస్తున్న మంత్రి కేటీఆర్

ఎకోదంతుడే ఆదర్శం

పర్యావరణహితంగా గణేశ్ ఉత్సవం

హైదర్‌నగర్, ఆగస్టు 17:

పర్యావరణహితమైన మట్టి విగ్రహాలతో వినాయకుడిని భక్తితో పూజించుకుందామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కే తారక రామారావు పిలుపునిచ్చారు. 'ఎకో'దంతుడి రూపంలో ఉండే ఏకదంతుడే మనకు ఆదర్శం కావాలని అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రంగులతో తయారుచేసిన ప్రతిమలను ప్రతిష్ఠించడంద్వారా ప్రకృతిని కలుషితం చేయవద్దని కోరారు. భక్తితో చేపట్టే వినాయక ఉత్సవాలు పర్యావరణ పరిరక్షణకు నాంది పలుకాలని అన్నారు. ఈ దిశగా ప్రజలందరిలో చైతన్యం తీసుకొచ్చేందుకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టిందని, ఈ మార్పు దేశమంతటికీ వినిపించాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పర్యావరణహిత గణేశ్ విగ్రహాలపై అవగాహన, మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం శిల్పారామంలోని శిల్పకళావేదికలో కోలాహలంగా నిర్వహించారు. బల్దియా మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కోటిమంది జీవించే మహానగరంలో ప్రతి గల్లీలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తుంటారని, అన్నివర్గాలవారూ కలిసే ఈ ఉత్సవం పర్యావరణహితం కావాలని కోరారు. జీహెచ్‌ఎంసీ కృషికి కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అభినందనీయమన్నారు. మట్టి గణపతులను మరింతగా ప్రోత్సహించేందుకు నగరంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రెండు లక్షలకు పైగా మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీచేస్తున్నారని, ఆయా సంస్థల సహకారంతో ఈ సంఖ్యను మరింతగా పెంచేందుకు కృషి జరుగుతున్నదని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడే విషయంలో మట్టి గణపతులపై చిన్ననాటి నుంచే అవగాహన అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇందుకోసమే విద్యార్థుల ద్వారా ఈ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ కృషిచేస్తున్నదని తెలిపారు. నగరంలోని

మిగతా 2వ పేజీలో

వీడిన చిక్కుముళ్లు

కిన్నెరసాని కిలకిలలు.. పాలెంవాగులో పరవళ్లు

పాత ఖమ్మంజిల్లాలో ప్రాజెక్టుల పరుగులు ■ తెలంగాణ రాష్ట్రంలో నీరందిన ఆయకట్టు
ఉమ్మడి రాష్ట్రంలో జేబుల్లోనే జలయజ్ఞం ■ కాంగ్రెస్ నిర్వాకానికి నిదర్శనంగా ఖమ్మం ప్రాజెక్టులు
వరుస సమీక్షలతో గతి మార్చిన హరీశ్‌రావు ■ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు, శంకుస్థాపన ఫలకాలకు కొబ్బరికాయలు కొట్టి ప్రాజెక్టులు కట్టేశామని గొప్పలు చెప్పుకొన్నారు కాంగ్రెస్ నాయకులు. తొమ్మిదేండ్ల ధర్మప్రభువుల పాలనలో ఆ పార్టీ చెప్పుకొన్న జలయజ్ఞం నేతల జేబులకే పరిమితమైంది తప్ప పొలాలకు నీరందలేదు. పాత ఖమ్మంజిల్లా పరిధిలోని కిన్నెరసాని, పాలెంవాగు ప్రాజెక్టుల నత్తనడుకలే దానికి ఉదాహరణ. కాంగ్రెస్ హయాంలో ముందుకుసాగని ఆ ప్రాజెక్టులు తెలంగాణ వచ్చాక శరవేగంతో నిర్మాణాలు పూర్తిచేసుకుంటున్నాయి. ప్రారంభించిన 12 ఏండ్ల తర్వాత తొలిసారి కిన్నెరసాని పూర్తి ఆయకట్టుకు నీరందుతున్నది. పాలెంవాగు దాదాపు పూర్తిదశకు చేరుకున్నది. దార్శనికుడైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వం, మంత్రి హరీశ్‌రావు నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యపడింది. ఈ ప్రాజెక్టులు పూర్తికావని ఆశలు వదులుకున్న ఆ ప్రాంత రైతులు.. ఇపుడు తెలంగాణ ప్రభుత్వం మాకు మొగులుకు మోహం పెట్టాల్సిన అవసరం లేకుండా చేసిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కిన్నెరసాని, పాలెంవాగు ప్రాజెక్టుల ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే..



పాలెంవాగు ప్రాజెక్టు



కిన్నెరసాని ప్రాజెక్టు

కిన్నెరసానికి కళ వచ్చింది..

పాత ఖమ్మం జిల్లా(ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం) లోని పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని 10 వేల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా కిన్నెరసాని కెనాల్ ప్రాజెక్టును జలయజ్ఞంలో భాగంగా చేపట్టారు. జెన్‌కోకు నీరిచ్చేందుకు 8.4 టీఎంసీల సామర్థ్యంతో కట్టిన కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా నీటిని తరలించాలన్నది డిజైన్. ఇందుకోసం ఎడమ, కుడి కాల్వ, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలి. కానీ డిజైన్‌లోనే లోపాలు..అనేకచోట్ల భూసేకరణ జరుగకపోవడం, మధ్యలో అటవీ భూముల అనుమతులు రాకపోవటం.. ఇలా అనేక చిక్కుముళ్ల మధ్య నామమాత్రపు పనులతో మ..మ అనిపించారు. పనులు ప్రారంభించిన ఏండేండ్లకు ముక్కుతూ మూల్గుతూ 3 వేల ఎకరాలకు నీరిచ్చి చేతులెత్తేశారు. దీనితో ఈ ప్రాజెక్టు గతి ఇంతేనని రైతులు కూడా ఆశలు వదులుకున్నారు.

ప్రతి వారం సమీక్ష..

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు మీద దృష్టి సారించింది. మంత్రి హరీశ్‌రావు ప్రతి వారం ఈ ప్రాజెక్టు భూసేకరణ, ఇతర

మిగతా 12వ పేజీలో

జయ మృతిపై
విచారణ



అమ్మ స్మారకకేంద్రంగా పోయెస్‌గార్డెన్
తమిళనాడు సీఎం పళనిస్వామి కీలక ప్రకటన
దినకరన్‌కు చెక్.. విలీనం దిశగా అన్నాడీఎంకే గ్రూపులు

చెన్నై, ఆగస్టు 17:

అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళకు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం వర్గాలు ఒక్కటయ్యేందుకు మరో ముందడుగు పడింది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతికి దారితీసిన పరిస్థితులపై విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ పళనిస్వామి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 'ఆరాధ్య దైవమైన అమ్మ మరణంపై నిజానిజాలు తేల్చేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నాం' అని సీఎం పళనిస్వామి గురువారం ప్రకటించారు. ఏకసభ్య కమిషన్‌లోని న్యాయమూర్తి పేరును త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. జయలలిత మృతిపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తేనే తాము విలీనానికి సహకరిస్తామని కొన్నాళ్లుగా ఏఐఏడీఎంకే చీలికవర్గమైన పన్నీర్‌సెల్వం గ్రూప్ డిమాండ్ చేస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి తాజా ప్రకటనతో షరతులన్నింటినీ అధిగమించినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే జయలలిత నివసించిన పోయెస్‌గార్డెన్‌లోని

మిగతా 5వ పేజీలో

కొత్త కలెక్టరేట్లకు టెండర్లు

రూ.1032 కోట్లతో సమీకృత జిల్లా కార్యాలయ భవనాలు ■ ఒక్కో కలెక్టరేట్‌కు రూ.30 నుంచి రూ.35 కోట్లు
26 జిల్లాల్లో కలెక్టరేట్లు, 21 చోట్ల నివాస సముదాయాలకు ప్రతిపాదన
14 జిల్లాల్లో స్థల సేకరణ పూర్తి, 12 జిల్లాల్లో శరవేగంగా సేకరణ ■ సిరిసిల్లలో అత్యధికంగా 93 ఎకరాల్లో నిర్మాణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూసేకరణ పూర్తయిన జిల్లాల్లో కొత్త కలెక్టరేట్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో నూతన కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 31 జిల్లాలకు ఐదు జిల్లాలు మినహా మిగతా కలెక్టరేట్లను నిర్మిస్తున్నది. ఇప్పటికే సొంత భవనాలున్న వరంగల్ (గ్రామీణం), ఆదిలాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల కలెక్టరేట్లు మినహా మిగతా 26 జిల్లాల్లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 21 జిల్లాల్లో నివాస భవనాలు నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రాల్లో కొత్తగా నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ల భవన నిర్మాణానికి రూ.1032 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఒక్కో కార్యాలయానికి రూ.30 నుంచి రూ.35 కోట్ల వరకు కేటాయించనున్నారు. నూతన కలెక్టరేట్లను 1.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇప్పటికే 14 జిలాల్లో సేకరణ పూర్తయ్యింది. మిగతా 12 జిల్లాలకు సంబంధించి భూసేకరణ వేగంగా కొనసాగుతున్నది. ఇందులో



మిగతా 12వ పేజీలో



బార్సిలోనాలో జనంపైకి దూసుకొచ్చిన వ్యాన్ ఢీ కొని మృతిచెందిన పౌరుడు

బార్సిలోనాలో
ఉగ్రదాడి

జనంలోకి దూసుకెళ్లిన వ్యాన్
బార్‌లో చొరబడి టెర్రరిస్టుల కాల్పులు
స్పెయిన్‌లో 13మంది మృతి.. 50మందికి పైగా గాయాలు

మాడ్రిడ్, ఆగస్టు 17: స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఉగ్రవాదులు తెగబడ్డారు. గురువారం నగరం నడిబొడ్డున ఓ వ్యాన్‌తో జనంపైకి దూసుకెళ్లిన టెర్రరిస్టులు విచ్చలవిడిగా కాల్పులు జరుపడంతో 13మంది మృతిచెందారు. ఈ ఘటనలో 50మందికి పైగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఘటనాస్థలం భీతావహంగా మారింది. గాయపడినవారికి రోడ్డు పక్కనే చికిత్స అందిస్తున్నారు. దాడి జరిగిన ప్రదేశంలో చిన్నారులు, మహిళలే ఎక్కువమంది ఉన్నారని తెలుస్తున్నది. జనసమ్మర్దం అధికంగా ఉండే లాస్ రాంబ్లాస్ బోల్‌వర్డ్ వీధిలో పాదచారులు తిరుగాడే ప్రాంతంలోకి ఆగంతకులు మొదట వ్యాన్‌తో దూసుకెళ్లడంతో ఇద్దరు పౌరులు మృతిచెందారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దాడి తర్వాత సాయుధులైన ఇద్దరు వ్యాన్ దిగి కాల్పులు జరుపుతూ సమీపంలోని బార్‌లో చొరబడ్డారు. అక్కడ

మిగతా 5వ పేజీలో

రాష్ట్రంలో నాలుగురోజులపాటు
భారీ నుంచి అతిభారీ వర్షాలు 2

బీహార్, యూపీ, బెంగాల్, అసోంలో వరద బీభత్సం
91 మంది మృతి 10

మరింత పటిష్ఠంగా జిల్లా పోలీస్

అన్ని జిల్లాల్లోనూ 'హైదరాబాద్ తరహా పోలీసింగ్' ■ పౌరసేవల్లో మరింత సాంకేతికత
సీఎం కేసీఆర్ సూచనతో అంకురార్పణ ■ డిస్ట్రిక్ట్ పోలీస్ స్టెబిలైజేషన్ ప్లాన్-2017 సిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జిల్లాల్లో పోలీస్ వ్యవస్థను పటిష్ఠ పరుచడం మీద ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దిశగా 'జిల్లా పోలీస్ స్థిరీకరణ ప్రణాళిక -2017' సిద్ధమైంది. పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం, పారదర్శకత, స్టేషన్లకు వచ్చే పౌరులకు మెరుగైన సేవలు, దర్యాప్తు కాలవ్యవధి తగ్గించడం, నేరస్థుల గుర్తింపునకు సాంకేతికత వినియోగం, ట్రాఫిక్ మరణాలను తగ్గించడం, పోలీసుల్లో వృత్తి నైపుణ్యం పెంపు తదితర అంశాలతో కూడిన ఈ ప్రణాళికను త్వరలోనే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యుత్తమ పౌరసేవలకు తెలంగాణ పోలీసుశాఖకు ఇప్పటికే దేశవ్యాప్త గుర్తింపు లభించింది. ప్రధానంగా రాజధాని హైదరాబాద్‌లో పోలీసింగ్ విధానాలకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఈ తరహా సేవలతోపాటు మరింత పటిష్ఠమైన పోలీస్ సేవలను జిల్లాల్లోనూ అందించాలన్న సీఎం కే చంద్రశేఖర్‌రావు సూచనలతో ఉన్నతాధికారులు డిస్ట్రిక్ట్ పోలీస్ స్టెబిలైజేషన్ ప్లాన్(డీపీఎస్‌పీ)ను సిద్ధం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా దీని అమలుకు వెస్ట్‌జోన్ పోలీసులు జిల్లాల వారీగా ప్రణాళికలు తయారు చేశారు. నార్త్‌జోన్ పరిధిలోని జిల్లాల్లోనూ నివేదికల రూపకల్పన జరుగుతున్నది.

సీఎం సభలో అంకురార్పణ..

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన పోలీస్ అధికారుల సమావేశంలో దీనికి అంకురార్పణ జరిగింది. రాష్ట్ర ప్రజలకు ఉత్తమ పోలీస్ సేవలు

మిగతా 12వ పేజీలో

ఇవీ ప్రధాన లక్ష్యాలు..

- పోలీస్ విధులు మరింత సరళతరం.. సత్వర న్యాయ సహాయానికి అందుబాటులోకి ఐటీ అప్లికేషన్లు
- కేసుల దర్యాప్తు మూడు నెలల్లోనే ముగించడం
- నేరస్థులకు కఠినశిక్షలు పడేలా దర్యాప్తులో ఫోరెన్సిక్ వంటి సేవలు
- నేరస్థులను గుర్తించేందుకు సైబర్ ఫోరెన్సిక్ టూల్స్ వినియోగం
- రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాదాల్లో మరణాలను తగ్గించేలా ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు
- ఫిర్యాదుదారుడికి సేవల కోసం ప్రతి స్టేషన్‌లో సిబ్బందికి బాధ్యతలు
- ఫిర్యాదు అందగానే గ్రామీణ పోలీస్ స్టేషన్ల పరిధిలో 30 నిమిషాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఐదు నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలానికి చేరేలా చర్యలు
- నిరంతర శిక్షణతో వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చడం. సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మెరుగుపర్చేలా మార్పులు

విద్యుత్ ఇంజినీర్ల భర్తీకి
సుప్రీం అనుమతి

హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన ధర్మాసనం
మళ్లీ నోటిఫికేషన్, ప్రవేశపరీక్ష అవసరం లేదని తీర్పు 3

లోకం పోకడ



నేను నాటిన మొక్కకు మార్కులు కాశాయి!



గురువారం ప్రగతిభవన్‌లో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్


చందూలాల్, సుభాష్‌రెడ్డిలకు సీఎం కేసీఆర్ బర్త్‌డే గ్రీటింగ్స్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పర్యాటక, గిరిజనశాఖల మంత్రి చందూలాల్, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డిల జన్మదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి, తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, గిరిజనసంక్షేమ శాఖ అధికారులు మంత్రి చందూలాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. నియోజకవర్గ పర్యటనలో ఉన్న సీఎం వద్దకు టీఎస్ఎండీసీ చైర్మన్ సుభాష్‌రెడ్డి వెళ్లి ఆయన దీవెనలు తీసుకున్నారు.

సారూ.. మీకు టన్నులకొద్దీ కృతజ్ఞతలు

మీ ప్రోత్సాహంతోనే చేతినిండా పని.. మీకు కొత్త బట్టలు పెడుతాం.. మంత్రి కేటీఆర్‌కు యాదాద్రి నేతన్న ఫోన్ మెసేజ్

ట్విట్టర్‌లో షేర్‌చేసి సంతోషం వ్యక్తంచేసిన మంత్రి





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేతకు ప్రోత్సాహం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. సర్కారు నిర్ణయాలతో నేతన్నలకు చేతినిండా పని దొరుకుతున్నది. తాజాగా ఓ నేతన్న ఈ ఆనందాన్ని మంత్రి కేటీఆర్‌తో పంచుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి సమీపంలో కొయ్యలగూడెంకు చెందిన మాధవ్ అనే వ్యక్తి మంత్రి కేటీఆర్‌కు ఫోన్ ద్వారా మెసేజ్ చేశారు. 'చేనేతకు మీరు అందిస్తున్న ప్రోత్సాహానికి టన్నులకొద్దీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. మీ ప్రోత్సాహం వల్ల మాకు పెద్దఎత్తున పని దొరుకుతున్నది. నా చిన్నతనంలో నేతన్నలకు చేతినిండా పనిఉన్న రోజులను గుర్తుచేసుకుంటున్నాను. నా విషయానికి వస్తే.. హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్‌తో బ్రాండెడ్ ఔట్ ఫిట్ అంగీలను తయారుచేస్తున్నా. ఇక్కత్ నేషన్ పేరుతో దీనికి బ్రాండ్ నేమ్ నమోదు చేశాను. ప్రతి సోమవారం చేనేత చొక్కాలు ధరించాలనే మీ ఆశయం అమోఘం. ఇందుకు కృతజ్ఞతగా మీకు కొన్ని అంగీలు ఇవ్వాలనుకుంటున్నా. మీ సైజ్ ఎంతో చెప్పండి' అని మంత్రి కేటీఆర్‌కు ఆయన విన్నవించారు. దీన్ని మంత్రి ట్విట్టర్‌లో షేర్ చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు.

చేనేత అంగీలు పంపిస్తామని సైజ్ ఇవ్వాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌కు కొయ్యలగూడెం చేనేత కార్మికుడు మాధవ్ పంపిన మెసేజ్

అంబేద్కర్ వర్సిటీ ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన అర్హత పరీక్ష -2017 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ నెల ఆరున నిర్వహించిన రెండోవిడుత అర్హత పరీక్షకు 14,512 మంది హాజరు కాగా వారిలో 12,018 మంది అర్హత సాధించారు. వీరిలో 8,345 మంది పురుషులు, 6,826 మంది మహిళలు ఉన్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. మార్కుల వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని, అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 26లోగా ఫీజు చెల్లించి కోర్సుల్లో చేరాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల ప్రాస్పెక్టస్ విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2017-18 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని సార్వత్రిక విద్యాపీఠం (టీఎస్ ఓపెన్ స్కూల్ సొసైటీ)లో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల ప్రాస్పెక్టర్‌ను విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య గురువారం విడుదల చేశారు. కోర్సుల దరఖాస్తు ఫారాలను కూడా విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చేనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని చెప్పారు.

డిగ్రీ మూడో విడుత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు

ఎస్సెమ్మెస్‌ల ద్వారా విద్యార్థులకు సమాచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన మూడో విడుత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు గురువారం పూర్తిచేశారు. సీట్ల కేటాయింపు వివరాలను విద్యార్థులకు సంక్షిప్త సందేశాలతో సెల్‌ఫోన్లకు నేరుగా పంపుతున్నారు. సీజీజీ ఆధ్వర్యంలో డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ (దోస్త్-2017) నిర్వహించారు. సీజీజీలో సాంకేతిక సమస్యల వల్ల సీట్ల కేటాయింపు ప్రక్రియ వారం ఆలస్యమైందని దోస్త్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ కాలేజీల్లో స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా మిగిలిన సీట్ల భర్తీకి తమకు అనుమతి ఇవ్వాలని కళాశాలల యాజమాన్యాలు కోరుతున్నాయి.

రాష్ట్రంలో నాలుగురోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో వచ్చే 48 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో వచ్చే నాలుగురోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు కురిశాయని పేర్కొన్నది. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలుచోట్ల భారీగా వానలు పడే అవకాశాలున్నాయని అన్నారు. గత 24 గంటల్లో బయ్యారంలో 4 సెంటీమీటర్లు, మహబూబాబాద్, బోనకల్‌లో 3 సెం.మీ., పాల్వంచ, మణుగూరు, టేకులపల్లి, భీమదేవరపల్లి, పాలకుర్తి, మహేశ్వరంలో 2సెం.మీ., కొత్తగూడెం, ఇల్లందు, మధిర, కొల్లాపూర్, హసన్‌పర్తి, ఆత్మకూరు, ఆర్మూర్‌లలో 1సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ప్రజలకు ఫలితాలు కనిపించాలి

గడువులోగా పనులు పూర్తిచేయాలి

మూడునెలలకోసారి టార్గెట్లు నిర్ణయించుకోవాలి

లక్ష్యసాధనకు కృషిచేయని అధికారులపై కఠినచర్యలు

ఐటీ, పరిశ్రమలశాఖ సమీక్షలో మంత్రి కేటీఆర్ హెచ్చరిక



ఐటీ, పరిశ్రమలశాఖపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మూడేండ్లలో హామీ ఇచ్చిన అంశాలపై ప్రజలకు ఫలితాలు వచ్చేలా పనులను గడువులోగా మరింత వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విధానాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని, ఇందుకు రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులే నిదర్శనంగా నిలుస్తాయన్నారు. గురువారం ఐటీ, పరిశ్రమలశాఖపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సమగ్ర సమీక్షా సమావేశమై అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఇకపై ప్రతి మూడు నెలలకు లక్ష్యాలను ముందే నిర్ణయించుకోవాలని చెప్తూ, ఆ మేరకు పనిచేయని అధికారులపై కఠినంగా వ్యవహరించేందుకు వెనుకాడబోమని మంత్రి హెచ్చరించారు. సులభవాణిజ్యవిధానంలో నిరుడు మాదిరిగా ఈ ఏడాదీ తొలి స్థానంలో కొనసాగేలా పనిచేయాలని సూచించారు. ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కులపై తాజా స్థితిగతులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిటీ తొలిదశకు 8500 ఎకరాల డిమాండ్ ఉందని, త్వరలోనే పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫార్మాసిటీ ద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కాలుష్యప్రభావం లేకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానం అమలుపై ప్రజలకు వివరించాలని చెప్పారు. ఏరోస్పేస్ రంగంలో మరిన్ని పెట్టుబడులు తీసుకుని వచ్చేలా ప్రయత్నాలు చేయాలన్నారు. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలు నగరంలో ఉన్నాయని, వీటికి తోడు మరిన్ని అంతర్జాతీయ కంపెనీలను నగరానికి తీసుకురావాలన్నారు. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టుతో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి తెలిపారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుతోపాటే తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కూడా పూర్తవుతుందన్నారు. టాస్క్ ద్వారా ఇప్పటిదాకా ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, త్వరలో శిక్షణ కార్యక్రమాలను మెడికల్, ఫార్మా, ఆటోమోటివ్స్‌రంగాలకు విస్తరిస్తామని చెప్పారు. టాస్క్ కేంద్రాలను జిల్లాలకు విస్తరించేందుకు దశల వారీగా ప్రయత్నాలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పరిశ్రమల కమిషనర్ నదీమ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.





గురువారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జీహెచ్‌ఎంజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టిగణపతి విగ్రహాల పంపిణీ, అవగాహన కార్యక్రమంలో ఆహూతులతో ప్రమాణం చేయిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి.. మట్టివిగ్రహాలనే వినియోగిస్తామని ప్రమాణం చేస్తున్న మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఆరికెపూడి గాంధీ, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తదితరులు

ఎకోదంతుడే ఆదర్శం

మొదటిపేజీ తరువాయి...

చెరువులు, కొలనులను పరిరక్షించడంతోపాటు, వాటిని కాలుష్యరహితంగా తీర్చిదిద్ది.. భావితరాలకు అందించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారన్నారు. నగరంలో ఇప్పటికే రూ.25 కోట్లతో 25 మినీ పాండ్లను ఏర్పాటుచేయించామని తెలిపారు. పర్యావరణమంటే గణేశుడికి ఎంతో ఇష్టమని, ప్రజలు, ఉత్సవ కమిటీలు సైతం అందుకు అనుగుణంగా పూజాదికాలను కొనసాగించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించేలా గణేశుడి ఉత్సవాలు నగరంలో కొనసాగుతున్నాయని, ఇదే స్ఫూర్తిని పూర్తి స్థాయిలో మట్టి విగ్రహాలనే వినియోగించి చాటాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ప్రోత్సహించి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు జీహెచ్‌ఎంసీ ఆయా కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్నదని తెలిపారు. వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేస్తూ, చెరువులను, కుంటలను మురికికూపాలుగా తయారు చేయవద్దని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. తన వంతు బాధ్యతగా రెండు చెరువులను దత్తత తీసుకుని వాటి పూర్తిస్థాయి సంస్కరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి ముందు ఓ గుంత తీసి, మట్టి గణపతిని అందులోనే నిమజ్జనం చేయాలని, అనంతరం అక్కడో మెక్క నాటి ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎమ్మెల్యే గోవర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, నగర డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, వెస్ట్ జోనల్ కమిషనర్ హరిచందన, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, రోటరీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి విజయరాములు, దైవజ్ఞశర్మ, డీసీలు మమత, వెంకన్న, మనోహర్, దశరథ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, జానకిరామరాజు, దొడ్ల వెంకటేశ్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, సాయిబాబా, నవతారెడ్డి, కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద సంఖ్యలో గణేశుడి మట్టి ప్రతిమలతోపాటు మొక్కలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మట్టి వినాయకులనే ఉత్సవాలకు వినియోగించి పర్యావరణాన్ని కాపాడుతామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అందరితో ప్రతిన చేయించారు.

24న దేవులపల్లి శతజయంతి సభలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీవేత్త, ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు దేవులపల్లి రామానుజరావు శతజయంతి సభలను ఈ నెల 24వ తేదీన వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం రవీంద్రభారతిలో, సాయంత్రం సారస్వత పరిషత్తులో భాషా సాంస్కృతికశాఖ సారథ్యంలో అధికారికంగా ఈ సభలను నిర్వహించనున్నారు. హైదరాబాద్ విముక్తి ఉద్యమంలో కీలకభూమిక పోషించిన ఈ మహనీయుడి శతజయంతి సభను ఘనంగా నిర్వహించడంతోపాటు ఆయన రాసిన పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తెచ్చేందుకు పరిషత్తు కృషిచేస్తున్నది. రామానుజరావు రచించిన 'సారస్వత నవనీతం', 'మన కళా సంపద' పుస్తకాలను సారస్వత పరిషత్తులో.. 'భక్తితత్వకవులు', 'హైదరాబాద్‌లో స్వాతంత్ర్యోద్యమం', ఖండకావ్యం 'పచ్చతోరణం' పుస్తకాలను రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా శతజయంతి సంచికను తీసుకువస్తున్నారు. రామానుజరావు పేరిట ఒక సాహితీ ప్రముఖుడికి అవార్డు ఇచ్చి సత్కరించనున్నారు. ఆయన విగ్రహాన్ని ఎంపీ కవిత సారస్వత పరిషత్తు ఆవరణలో ఆవిష్కరించనున్నారు. 1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడిన నాటినుంచి 1993 వరకు రామానుజరావు పరిషత్తుకు సేవలు అందించారు. తన తర్వాత సినారె పరిషత్తు అధ్యక్షత బాధ్యతలు చేపట్టాలని వీలునామా రాశారు.

వ్యవసాయశాఖలో పదోన్నతులకు డీపీసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో గ్రేడ్-1, గ్రేడ్-2 స్థాయి గెజిటెడ్ అధికారులకు పదోన్నతులను కల్పించేందుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని ప్రభుత్వం నియమించింది. కో-ఆపరేటివ్ కమిషనర్, కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ మెంబర్, కన్వీనర్‌గా ఉన్న ఈ ప్యానెల్‌లో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనర్, జీఏడీ అడిషనల్ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రెండేండ్లు కొనసాగుతుంది. గురువారం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

భూముల కబ్జాపై కఠినచర్యలు

దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదాయశాఖకు చెందిన భూములను కబ్జాచేస్తే కఠినచర్యలు తప్పవని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హెచ్చరించారు. అన్యాక్రాంతమైన దేవాలయాల భూములన్నింటినీ స్వాధీనం చేసుకుంటామని అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో శ్రీ అనంతపద్మనాభ ఆలయ భూములను మంత్రి పరిశీలించారు. పద్మనాభస్వామి ఆలయ భూముల కబ్జాకు గురైనట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ కొందరు కబ్జాదారులు కోర్టులను ఆశ్రయించారని మంత్రి తెలిపారు. ఈ భూముల ఆక్రమణ అంశంపై త్వరలో జిల్లా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.



జర్నలిస్టుల హెల్త్ స్కీంపై అవగాహన కల్పిస్తున్న పథకం సీఈవో డాక్టర్ కే పద్మ

తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శం

హెల్త్‌కార్డుల ద్వారా జర్నలిస్టులకు మెరుగైన వైద్యసేవలు

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు


హెల్త్‌కార్డుల అవగాహన సదస్సులో ఈజేహెచ్‌ఎస్ సీఈవో డాక్టర్ పద్మ

త్యాగరాయగానసభ: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్‌కార్డుల ద్వారా నాణ్యమైన ఆరోగ్యసేవలు, కార్పొరేట్ వైద్యం అందించడం గొప్ప విషయమని ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీం (ఈజేహెచ్‌ఎస్) సీఈవో డాక్టర్ కే పద్మ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టు ఆరోగ్యసంక్షేమంపై శ్రద్ధ చూపుతున్నదని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జరిగిన జర్నలిస్టుల హెల్త్‌కార్డులు-అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఖైరతాబాద్, వనస్థలిపురంలో రెండు వెల్‌నెస్ సెంటర్లు పనిచేస్తున్నాయని, మరో నాలుగుకేంద్రాలకు అనుమతి వచ్చిందని, త్వరలో మరో రెండుసెంటర్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వెల్‌నెస్ సెంటర్లలో ఓపీ సేవలను ముందుగా వినియోగించుకోవాలని, అవసరమైతే పేషంట్లను కార్పొరేట్ వైద్యానికి రిఫర్ చేస్తారని ఆమె తెలిపారు. జిల్లాకేంద్రాల్లో, గ్రామాల్లో ఉన్న జర్నలిస్టులు సైతం ఆన్‌లైన్ సేవల ద్వారా హైదరాబాద్‌లోనూ వైద్యం చేయించుకోవచ్చునని ఆమె తెలిపారు. వివరాలకు వెల్‌సెంటర్ల ఫోన్‌నంబర్ 23300989 (ఖైరతాబాద్), 24242989(వనస్థలిపురం)లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే విరాహత్ అలీ, హెచ్‌యూజే అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పీ బాలకృష్ణ, ఐజేయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాస్‌రెడ్డి, వై నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


అంబేద్కర్ విదేశీ విద్యానిధికి 31మంది ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంబేద్కర్ (ఓవర్సీస్) విదేశీ విద్యానిధి పథకానికి 37 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 31 మంది ఎంపికయ్యారు. మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో గురువారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎస్సీ అభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించింది. హాజరైన 31 మంది విద్యార్థులను ఈ పథకానికి ఎంపిక చేసినట్లు ఎస్సీ అభివృద్ధిశాఖ సంచాలకులు పీ కరుణాకర్ తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ తదితర దేశాల్లో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ అగ్రికల్చరల్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లలో పోస్టు గ్రాడ్యుయేషన్, ఆపై కోర్సులు చదవడానికి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనున్నది. విమాన ప్రయాణానికి, వీసా ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తున్నది. విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరుణాకర్ సూచించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.03 గంటలకు



సూర్యాస్తమయం: 6.36 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, ఏకాదశి ఉదయం 10.03 వరకు. తదుపరి ద్వాదశి. నక్షత్రం: ఆరుద్ర రాత్రి 9.04 వరకు తదుపరి పునర్వసు. అమృతఘడియలు: ఉదయం 11.53 నుంచి మధ్యాహ్నం 1.29 వరకు. రాహుకాలం: ఉదయం 10.46 నుంచి మధ్యాహ్నం 12.20 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి ఉదయం 9.24 వరకు తిరిగి మధ్యాహ్నం 12.45 నుంచి 1.35 వరకు, వర్జ్యం: ఉదయం 6.44 నుంచి ఉదయం 8.20 వరకు.

ఇక జెట్ స్పీడ్‌తో ఉద్యోగాల భర్తీ

- నియామకాల్లో జాప్యం నివారణకు స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ
- కోర్టు కేసులకు కారణాలపై లోతైన పరిశోధన
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- అదనంగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చేందుకు రంగంసిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగ నియామకాల ప్రక్రియలో జాప్యం లేకుండా దూసుకుపోయేలా రాష్ట్ర యంత్రాం గం చర్యలకు దిగింది. జెట్ స్పీడ్‌తో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు తెలంగాణ సర్కార్ సర్వంసిద్ధం చేస్తున్నది. టీఎస్‌పీఎస్సీతోపాటు నేరుగా చేపట్టే ఇతర విభాగాల నియామకాలకు అడ్డంకుల నివారణకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన అధికారి నేతృత్వంలో కమిటీని వేయాలని డిప్యూటీ సీఎం నేతృత్వంలో నిర్వహించిన సమావేశం లో నిర్ణయించినట్టు తెలిసింది. సీఎం కేసీఆర్‌తో చర్చించి కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఈ కమిటీ ప్రతివారం ఉద్యోగ నియామక ప్రగతిని సమీక్షించి, తగిన కార్యాచరణ రూపొందిస్తుంది. ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం అనుమతిచ్చి, నోటిఫికేషన్లు ఇచ్చిన తర్వాత కూడా వివిధ కారణాలతో ఆగిపోయిన నియామక ప్రక్రియను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవడం, శాఖలవారీ ఖాళీలను గుర్తించి వాటిలో ఉద్యోగుల నియామకానికి వెంటనే అనుమతులు వచ్చేలా ఎప్పటికప్పుడు పరిష్కారాలను కనుగొనాలని నిర్ణయించినట్టు సమాచారం. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నేతృత్వంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ తదితరులతో నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది.

సమస్య ఎక్కడ.. పరిష్కారం ఎలా?

ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చినా ఈ ప్రక్రియ ఎందుకు ఆలస్యం అవుతున్నది? ఆటంకాలు ఎందుకు వస్తున్నాయి? నియామకాల్లో జాప్యానికి కారణాలపై లోతుగా చర్చించినట్టు తెలిసింది. అత్యధిక శాఖల ఉద్యోగాల విభజనలో స్పష్టత రాలేదని సమాచారం. సిలబస్, అర్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై స్పష్టతలేదన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. ఉద్యోగ నియామకాలు చేపడుతామంటే కోర్టుల్లో కేసులు ఎందుకు వేస్తున్నారు? ఏ కారణం వల్ల స్టేలు వస్తున్నాయి? అన్నదానిపై లోతైన పరిశోధన చేయాల్సి ఉన్నదని భావించినట్టు తెలిసింది. చిన్నచిన్న సాంకేతిక అంశాల సాకుగా కొన్ని ప్రతిపక్షాలు కోర్టులను ఆశ్రయిస్తున్నాయని, ఇలాంటి వాటికి అవకాశం లేకుండా చూడాలని నిర్ణయించారు.

49,570 ఉద్యోగాల భర్తీకి అనుమతి.. కోర్టు కేసులతో జాప్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 22 శాఖల్లోని ఖాళీల భర్తీ కోసం 49,570 ఉద్యోగ నియామకాలకు అనుమతిచ్చింది. ఇందులో టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకానికి 34,039 పోస్టులకు, ఇంధనశాఖ వంటివాటిల్లో డిపార్ట్‌మెంట్ సెలక్షన్ కమిటీ ద్వారా నియామకానికి 3,177 పోస్టులకు, తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 12,354 పోస్టుల భర్తీకి అనుమతిచ్చింది. వీటి నియామకాలకు నోటిఫికేషన్లు కూడా విడుదలయ్యాయి. కొంతమంది కావాలని అడ్డుకోవడంతో నియామకాల్లో జాప్యం జరుగుతున్నదని గుర్తించారు. ఎన్నో ఆటంకాలను అధిగమించి ప్రభుత్వం ఇప్పటికే వేలసంఖ్యలో ఉద్యోగాల నియమకాలు చేపట్టింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 10,442, ఎనర్జీ డిపార్ట్‌మెంట్ ద్వారా 1,040 టీఎస్‌పీఎస్సీ ద్వారా 4,309 మంది ఉద్యోగులను నియమించారు. వేలసంఖ్యలో ఉద్యోగుల నియామకం చేపట్టారు. ముఖ్యంగా గ్రూప్-2 నియామకాలు చేపట్టడానికి పరీక్షలు నిర్వహించగా, దీనిపై కొందరు న్యాయస్థానంలో కేసులు వేయడంతో ఈ ప్రక్రియ నిలిచింది. జాప్యం కోసం కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలను ఎలా అధిగమించాలన్నదానిపై న్యాయశాఖతో నిత్యం సమాలోచనలు చేయాలని నిర్ణయించారు. ప్రతి నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చే ముందే న్యాయశాఖ టెక్నికల్‌గా, పాలసీగా ప్రతి అంశాన్ని పరిశీలించి ముందడుగు వేయాలని అభిప్రాయానికి వచ్చారు. ఈ కమిటీని సీఎం కేసీఆర్‌తో చర్చించి ఏర్పాటుచేయనున్నట్టు సమాచారం.

నియామక ప్రక్రియలో మరింత వేగం

టీఎస్‌పీఎస్సీ సభ్యులతో ప్రత్యేక సమావేశంలో చైర్మన్ ఘంటా చక్రపాణి

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతంగా ముందుకు తీసుకుపోతున్నది. ఇందుకోసం మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదని, ఈ దిశగా ఉద్యోగులు పునరంకితం కావాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కోరారు. సీఎం కేసీఆర్ ఉద్యోగాల భర్తీ రోడ్ మ్యాప్ విడుదల చేయడం, డిప్యూటీ కడియం శ్రీహరి ప్రత్యేక సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ సభ్యులు, కార్యదర్శితో చైర్మన్ చక్రపాణి గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు కమిషన్ వద్ద ఉన్న నియామకాలు, భర్తీ ప్రక్రియ సాగుతున్న తీరుపై చర్చించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అటవీ, వైద్యశాఖలోని విడుదలచేసిన తొమ్మిది నోటిఫికేషన్లకు సంబంధించి ప్రాథమిక అర్హత పరీక్షలో భాగంగా ఒకే జనరల్ స్టడీస్ పరీక్ష నిర్వహించే అంశం సమావేశంలో చర్చకొచ్చినట్టు తెలిసింది. ఇటీవల తెలంగాణ గురుకులాల్లోని టీజీటీ, పీజీటీ పోస్టులకు ఉమ్మడి అర్హత పరీక్ష విజయవంతంగా నిర్వహించినందున అదే రీతిలో ఈ కొలువుల పరీక్షను సైతం నిర్వహించాలని చర్చించినట్టు సమాచారం.

మహిళల రక్షణకు 'సఖి' కేంద్రాలు

పాత జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుకు మహిళా, శిశు సంక్షేమశాఖ కసరత్తు

నాలుగు జిల్లాల్లో ఎన్జీవోలతో ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మారుమూల ప్రాంతాల్లోని మహిళలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారంకోసం మహిళా, శిశు సంక్షేమశాఖ మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలకు భద్రత, రక్షణ కల్పించేందుకు పాత జిల్లాకేంద్రాల్లో 'సఖి' కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు ఆ శాఖ కసరత్తు చేస్తున్నది. కేంద్రప్రభుత్వ ఆర్థిక సహకారంతో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ మినహా తొమ్మిది జిల్లా కేంద్రాల్లో సఖి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెలాఖరుకు వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు ఎన్జీవో సంస్థలతో ఒప్పందాలు పూర్తయ్యాయి. భూమిక, దళిత్ స్త్రీశక్తి, అంకురం, గ్రామ్య, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, కమిట్‌మెంట్స్ అనే స్వచ్ఛంద సంస్థలు వీటి నిర్వహణకు ముందుకు వచ్చాయి. 11 మంది సిబ్బంది సేవలు అందించనున్నారు. ఆత్మహత్యలకు పాల్పడటం, గృహహింస, లైంగిక వేధింపులు, హత్యాప్రయత్నం, ఇవ్‌టీజింగ్ తదితర సమస్యలపై ఫిర్యాదు అందిన వెంటనే ఈ కేంద్రానికి చెందిన సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకొని బాధితులను రక్షిస్తారు. అనంతరం వారికి సఖి కేంద్రంలో అవసరమైన న్యాయ, సామాజిక, ఆర్థిక సహకారాన్ని అందిస్తారు. అవసరమైతే వైద్య సహాయాన్ని సైతం బాధితులకు అందిస్తారు. బాధితులు తీవ్ర భయాందోళనకు లోనైనప్పుడు బాధితులకు వసతి సౌకర్యం కూడా కల్పిస్తారు. ఇందుకోసం సఖి కేంద్రాల్లో ఐదు పడకలను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుత్ ఇంజినీర్ల భర్తీకి సుప్రీం అనుమతి

హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన ధర్మాసనం

మళ్లీ నోటిఫికేషన్, ప్రవేశపరీక్ష అవసరం లేదని తీర్పు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ల (సివిల్, ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థలు మెరిట్ లిస్టు ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. గతంలో ఉమ్మడి హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్‌లు ఇచ్చిన తీర్పుల్ని పక్కకు పెడుతూ, మళ్లీ ప్రవేశపరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పునిచ్చింది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మెరిట్‌తో అర్హత పొందిన అభ్యర్థుల రిట్ పిటిషన్లలో వారు వ్యక్తంచేసిన ఆవేదన సహేతుకమేనని స్పష్టంచేసిన ధర్మాసనం హైకోరు తీర్పుల్ని పక్కకుపెట్టింది.

ఇవీ పూర్వాపరాలు

తెలంగాణ ట్రాన్స్‌కో (206 పోస్టులు), జెన్‌కో (856 పోస్టులు), ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్- 164 పోస్టులు), దక్షిణ డిస్కమ్ (201 పోస్టులు) సంస్థలు ఖాళీగా ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల్ని భర్తీ చేయడానికి 2015 నవంబరులో నాలుగు విడుతలుగా ప్రవేశపరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులై మెరిట్ ఆధారంగా అర్హత పొందినవారిని ఇంటర్వ్యూలకు పిలిచారు. చాలామంది అభ్యర్థులు మెరిట్ సాధించడంతో ఒకటికంటే ఎక్కువ సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి అర్హత సాధించారు. దీంతో వారికి ఇష్టమైన సంస్థలో మాత్రమే చేరడానికి ఆసక్తి చూపారు. ఫలితంగా నాలుగు సంస్థల్లో పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి.



విచిత్రమైన ఈ పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి ఖాళీ పోస్టుల్ని ఏ విధంగా భర్తీ చేయాలనే అంశమై విద్యుత్ సంస్థలు వివరణ కోరాయి. తెలంగాణ ప్రభుత్వం దీనికి స్పష్టమైన సమాధానం ఇస్తూ, మెరిట్ ఆధారంగా అర్హత సాధించినవారిని వారి మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూలకు పిలిచి భర్తీ చేయాలని పేర్కొంది. దీనితో అసంతృప్తికి గురైన కొద్దిమంది హైకోర్టును ఆశ్రయించారు. భర్తీకాని సీట్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించి భర్తీ చేయాలే తప్ప మెరిట్ ఆధారంగా తదుపరి క్యూలో ఉన్న అభ్యర్థులతో భర్తీ చేయరాదని కోరారు. వీటిని విచారించిన సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్‌లు నోటిఫికేషన్‌లోని అంశాలను, ప్రభుత్వ ఉత్తర్వులోని అంశాలను పరిశీలించి పిటిషనర్ల వాదనను సమర్థించాయి. ఈ తీర్పుతో అన్యాయానికి గురైన మెరి ట్ అభ్యర్థులు తొలుత హైకోర్టును, తదుపరి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు జరిగాయి. రాష్ట్ర ప్రభు త్వ న్యాయవాది వెంకట్‌రెడ్డి వాదించారు. విద్యుత్ విషయంలో ప్రభుత్వ కృషిని వివరించారు. మళ్లీ నోటిఫికేషన్, పరీక్షలు అంటే చాలా సమయం వృథా అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన వేగవంతమైన ఫలితాల సాధనకు ఆటంకం ఎదురవుతుందన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం ఇంటర్వ్యూలకు పిలిచి, నియామకాలు జరుగకుండా ఖాళీ పోసుల (నియామక పత్రాలు ఇవ్వనిపక్షంలో) భర్తీకి మరోసారి నోటిఫికేషన్, ప్రవేశపరీక్ష తదితరాలను నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

మరుగుదొడ్ల వాడకంలో
తెలంగాణ టాప్

పైప్ వాటర్ సరఫరాలోనూ రాష్ట్రమే ముందు

కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బహిరంగ మల విసర్జన రహిత (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ – ఓడీఎఫ్) గ్రామాలు, పట్టణాల విషయంలో దేశంలోని మిగితా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం మెరుగైన స్థితిలో ఉన్నదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ పేర్కొంది. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించడంతోపాటు వాటిని వినియోగించడంలో తెలంగాణలోని గ్రామాలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని కేంద్రం స్పష్టం చేసింది. ఈ పరిస్థితులు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో దేశ సగటుతో పోలిస్తే తెలంగాణ సగటు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో 2,200 గ్రామాలు ఓడీఎఫ్ గ్రామాలుగా గుర్తింపు పొందాయి. మరో 15 రోజుల్లో మరో 1500 గ్రామాలు ఓడీఎఫ్ గ్రామాలుగా గుర్తింపు పొందనున్నాయి. దేశవ్యాప్తంగా ఓడీఎఫ్‌లుగా గుర్తింపు పొందిన గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ అవసరమైన నీటి సరఫరా సక్రమంగా లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ గుర్తించింది. ఓడీఎఫ్ గ్రామాలు, పట్టణాల్లో మరుగుదొడ్లకు విధిగా నీటి సరఫరా వ్యవస్థ ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో ఈ వ్యవస్థ మెరుగ్గా ఉన్నదని అభిప్రాయపడింది. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం ప్రకటించిన సమయంలోనే పైప్‌తో వాటర్ సరఫరా (పీడబ్ల్యూఎస్) మరుగుదొడ్లకు తప్పనిసరి అని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఓడీఎఫ్‌గా ప్రకటించుకుంటున్న రాష్ట్రాలు పీడబ్ల్యూఎస్‌ను మాత్రం పట్టించుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఇటీవల నిర్వహించిన సమీక్షలో దేశవ్యాప్తంగా 52 శాతం ప్రాంతాల్లోనే పీడబ్ల్యూఎఫ్ ఉన్నాయని తేలింది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ మెరుగ్గా ఉన్నదని వెల్లడించింది. ఓడీఎఫ్‌గా ప్రకటించిన 2,200 ఆవాసాల్లో సుమారు 2 వేల చోట్ల పీడబ్ల్యూఎఫ్‌లు ఉన్నట్లు తెలిపింది. మరుగుదొడ్లు కట్టుకున్నా అవసరమైనంత నీటి సరఫరా లేనిపక్షంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి, స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యం దెబ్బతింటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు పైప్‌ల ద్వారా నీటి సరఫరాపై దృష్టి సారించాలని కేంద్రం సూచించింది. తెలంగాణలో పీడబ్ల్యూఎస్ సమస్య డిసెంబర్ నాటికి పరిష్కారం అయ్యే అవకాశాలున్నాయి. డిసెంబర్ చివరినాటికి మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా కానుండటంతో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సూచనలు పూర్తిస్థాయిలో అమలుకానున్నాయి.

రూబెల్లా టీకాతో రక్ష

కోటి వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉంచాం

వ్యాక్సినేషన్ ప్రారంభోత్సవంలో వైద్య మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడి

9 నెలల నుంచి 15 ఏండ్లలోపు పిల్లలకు టీకాలు

ఐదువారాలపాటు కొనసాగనున్న కార్యక్రమం

హైదరాబాద్/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్లలోపు పిల్లలందరికీ మీజిల్స్–రూబెల్లా టీకాలు వేయించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి ప్రజలకు విజ్ఞప్తిచేశారు. గతంలో వాడిన పిల్లలకూ తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అక్షిత అనే బాలికకు స్వయంగా టీకా వేసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రి లక్ష్మారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా టీకాల వ్యాక్సినేషన్ ఐదు వారాలు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో 90,01,117 మంది పిల్లలకు టీకాలు వేయడానికి కోటి వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్కూళ్లలో 60 లక్షలు, బడిబయట 10 లక్షలు, అంగన్‌వాడీకేంద్రాల్లో 20 లక్షల మంది పిల్లలున్నారని, వీరికి 839 యూనిట్ల ద్వారా 43,523 సెషన్స్‌వారీగా టీకాలు వేయనున్నామని మంత్రి వివరించారు. అంగన్‌వాడీకేంద్రాల్లో 30,123 సెషన్లు, దవాఖానల్లో 13,674 సెషన్లు, మొబైల్ సెషన్లు 1500 సిద్ధంగా ఉంచామని, 88,909 మంది సిబ్బంది టీకాలు వేయడానికి సంసిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. మీజిల్స్–రూబెల్లా టీకాల ద్వారా పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉండబోవని మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టంచేశారు.



గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినికి టీకా వేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ టీకాలు వేస్తున్నారని, వీటిని వేయించుకోవడం వల్ల పిల్లల్లో బుద్ధిమాంద్యం వంటి లక్షణాలు రాకుండా ఉంటాయని అన్నారు. ఇప్పటికే దేశంలో పోలియోను నివారించగలిగామని, అదే తరహాలో ఈ టీకాలు వేయించుకోవడంతో ఆరోగ్యవంతమైన పిల్లలను దేశానికి ఇచ్చిన వారమవుతామని చెప్పారు. ఐదు నెలల వ్యవధిలో వేసే ఈ టీకాలు మొదటి నాలుగు వారాలపాటు వేస్తారని, మిగతా వారంలో అప్పటికీ ఇంకా మిగిలి ఉన్న పిల్లలకు వేస్తామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన క్రమంలో 65 శాతం ఉన్న వ్యాక్సినేషన్లను నేడు 95 శాతానికి తీసుకొచ్చామన్నారు. మిషన్ ఇంద్రధనస్సు పథకం అమలులో దేశంలోనే మన రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. వాక్సినేషన్‌ను వందశాతం సక్సెస్ చేసి పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా నిలువాలని, అనుకున్న సమయానికంటే ముందే లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమశాఖ ప్రచురిస్తున్న ఆరోగ్య పత్రికను మంత్రి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజీవ్ తివారీ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, హైదరాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రశాంతి, స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు, ఇండియన్ పిడియాట్రీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రాజ్‌భవన్ ఉన్న త, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు దేవరాజ్, మంజులత, వైద్యాధికారిని డాక్టర్ నిర్మల కరుణ, పంజాగుట్ట పీహెచ్‌ఎసీ వైద్యాధికారి డాక్టర్ అమీర్ పాల్గొన్నారు.

14 స్కూళ్లకు స్వచ్ఛవిద్యాలయ పురస్కారాలు

దేశవ్యాప్తంగా 172 స్కూళ్లలో రాష్ట్రం నుంచి 14 ఎంపిక

సెప్టెంబర్ ఒకటిన ఢిల్లీలో పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయస్థాయి స్వచ్ఛవిద్యాలయాల పురస్కారాలకు రాష్ట్రంలోని 14 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ అవార్డుల కింద ప్రతి స్కూల్‌కు రూ.50,000 నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. సెప్టెంబర్ ఒకటిన న్యూఢిల్లీలో ఈ పురస్కారాలను అందించనున్నట్టు సర్వశిక్షా అభియాన్ ఏఎస్పీడీ భాస్కర్‌రావు తెలిపారు. దేశవ్యాప్తంగా 172 పాఠశాలలు స్వచ్ఛవిద్యాలయ పురస్కారాలకు ఎంపిక కాగా.. అందులో రాష్ట్రం నుంచి 14 స్కూళ్లు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన 40 స్కూళ్లలో ఈ 14 కూడా ఉన్నాయన్నారు. జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైనందుకు ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు, ఉపాధ్యాయులకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ అభినందనలు తెలిపారు.

స్వచ్ఛవిద్యాలయ పురస్కారాలకు ఎంపికైన 14 స్కూళ్లు ఇవే

జిల్లాపేరు	కొత్త జిల్లా	స్కూల్ పేరు	ప్రాంతం
ఆదిలాబాద్	ఆదిలాబాద్	ఎంపీయూపీఎస్ బండల్‌నాగాపూర్	రూరల్
ఆదిలాబాద్	మంచిర్యాల	టీఎస్‌ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలురు, బెల్లంపల్లి	అర్బన్
కరీంనగర్	జగిత్యాల	జెడ్పీహెచ్‌ఎస్, అంబారిపేట	రూరల్
కరీంనగర్	కరీంనగర్	టీఎస్‌ఎంఎస్, గంగాధర	రూరల్
కరీంనగర్	కరీంనగర్	ఎంపీయూపీఎస్, కొత్తపల్లి (పీఎన్)	రూరల్
మెదక్	సిద్దిపేట	ఎంపీయూపీఎస్, ఇబ్రహీంపూర్	రూరల్
రంగారెడ్డి	వికారాబాద్	ఎంపీపీఎస్, బుద్దారం	రూరల్
మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	ఎంపీపీఎస్ చౌటగడ్డతాండ	రూరల్
నల్లగొండ	సూర్యాపేట	జెడ్పీహెచ్‌ఎస్, అనంతారం	రూరల్
వరంగల్	జయశంకర్ భూపాల్‌పల్లి	జెడ్పీహెచ్‌ఎస్ తిమ్మాపేట	రూరల్
ఖమ్మం	ఖమ్మం	టీఎస్‌ఎంఎస్, కారేపల్లి	రూరల్
ఖమ్మం	ఖమ్మం	ఎంపీపీఎస్, మల్లారం	రూరల్
ఖమ్మం	ఖమ్మం	టీఎస్‌ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, సింగారెడ్డిపాలెం	రూరల్
ఖమ్మం	ఖమ్మం	ఎంపీయూపీఎస్, గండగలపాడు	రూరల్

ఆధునిక సాగువిధానాలపై అధ్యయనం

నేటినుంచి కర్ణాటకలో ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్ల బృందం పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక వ్యవసాయంపై అధ్యయనానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లతో కూడిన ప్రత్యేక బృందం శుక్రవారం నుంచి కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించనుంది. నీటిపారుదల అభివద్ధి సంస్థ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, గృహనిర్మాణసంస్థ చైర్మన్ భూమారెడ్డితోపాటు వ్యవసాయ నీటిపారుదలశాఖ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సాగులో ఆధునిక యంత్రాల వినియోగం, నీసాగు పద్ధతులు, తక్కువ నీరు/పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, కొద్ది సంఖ్యలో వ్యవసాయ కూలీల వినియోగం తదితర అంశాలను పరిశీలించి సీఎం కేసీఆర్‌కు సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఈద శంకర్‌రెడ్డి తెలిపారు.

సీఎం ప్రోత్సాహంతోనే సక్సెస్!

కఠిన నిర్ణయాలు, చర్యలు తీసుకోక తప్పలేదు

ఉద్యోగుల సహకారంతో రూ.1150 కోట్ల ప్రజాధనాన్ని కాపాడాను

'నమస్తే తెలంగాణ'తో పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉమ్మడి రాష్ట్రంలో కునారిల్లిన వ్యవస్థల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ ఒకటి. అవినీతి వేళ్లూనుకుపోయి అస్తవ్యస్తంగా మారి తెలంగాణకు వారసత్వంగా వచ్చిన ఈ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని సంకల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. తొలిసారి ఓ ప్రయోగానికి నాంది పలికారు. అప్పటి వరకు ఖాకీ దుస్తుల్లో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న పోలీస్ ఉన్నతాధికారి సీవీ ఆనంద్‌పై నమ్మకం ఉంచి ఆయనను పరిపాలన విభాగంలోకి తీసుకొచ్చారు. ఆ నమ్మకాన్ని ఆనంద్ నిలబెట్టుకున్నారు. విధానాల్లో మార్పులు, కఠిన చర్యలతో ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిన పెట్టారు. తద్వారా వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాపాడారు. ఈ విధంగా ఉత్తమ పరిపాలన అందించినందుకు ఐఏఎస్ అధికారులకు ఇచ్చే ఎక్సలెన్స్ అవార్డును సైతం తొలిసారిగా ఈ ఐపీఎస్ సొంతం చేసుకున్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకొని ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సీవీ ఆనంద్ ఆ వివరాలు తెలిపారు.

ఒక ఐపీఎస్.. పరిపాలన విభాగంలోకి రావటం.. విజయవంతంగా విధులు నిర్వర్తించటం ఎలా సాధ్యమైంది?

పోలీసు ఆఫీసర్‌గా పని చేస్తున్న నన్ను అడ్మినిస్ట్రేషన్‌లోకి ఆహ్వానించటం అదృష్టం. మొదట నేనూ ఆశ్చర్యపోయి ఎలా న్యాయం చేస్తానో అనుకున్నాను. సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహంతో నేను చేయగలననే నమ్మకం కలిగింది. రెండు నెలల పాటు కష్టపడి మొదట పూర్తిగా అధ్యయనం చేశాను. వ్యవస్థపై స్పష్టత వచ్చాక హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి గ్రామాల్లో ఉండే రేషన్ షాపు వరకు అవినీతి జరిగేందుకు ఎక్కడ అవకాశం ఉంటుందో గుర్తించి సరిదిద్దటం ప్రారంభించాను. ఉద్యోగులు పూర్తిగా సహకరించారు.



అప్పటి పరిస్థితి.. మీ కృషి గురించి వివరిస్తారా?

నేను బాధ్యతలు తీసుకునే నాటికి పౌరసఫరాలశాఖ సమస్యల వలయంలో చిక్కుకొని ఉంది. కార్పొరేషన్ రూ. 8000 కోట్ల అప్పుల్లో ఉంది. రైస్ మిల్లర్లు అరాచకంగా ప్రవర్తించేవారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణలో చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. బియ్యాన్ని కాకినాడ కేంద్రంగా విదేశాలకు తరలించేవారు. రేషన్ సరుకులు అనర్హులకు చేరేవి. బినామీ డీలర్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తించేవారు. పంపిణీ, సరఫరాలో అనేక అక్రమాలు జరిగేవి. రాజకీయ జోక్యం, కొందరు అధికారుల మద్దతు వల్ల ఇదంతా జరిగేది. దీనికి చెక్ పెట్టడానికి అక్రమార్కులపై తొలిసారిగా పీడీ యాక్ట్ నమోదు చేయించాను. లంచాలు మరిగిన ఉద్యోగులను తొలిగించాను.

ఎంతమేరకు ప్రజాధనాన్ని వృథా కాకుండా కాపాడారు?

అప్పటి వ్యవస్థ ఎంత దారుణంగా ఉందంటే. 2009 నుంచి గన్నీ సంచుల సేకరణ జరుగలేదు. పది సంవత్సరాల పాటు మిల్లర్లు సంచులను తిరిగి ఇవ్వలేదు. వీటి విలువ కోట్లలో ఉంది. మేము మిల్లర్లును హెచ్చరిస్తూ గన్నీ సంచులు సేకరించడం ద్వారా రూ. 64 కోట్ల ఆదా చేశాం. గ్రేటర్ పరిధిలో ఈ పాస్ అమలుతో 30శాతం వరకు బియ్యం ఆదా అయ్యాయి. మిల్లర్ల పాత బకాయిలు రూ. 400 కోట్లు, బకాయిల రికవరీ ద్వారా మరో రూ. 10 కోట్లు, గన్నీ సంచుల రవాణా మార్చటం ద్వారా ఏటా 8 కోట్లు, ఎఫ్‌సీఐ రవాణా చార్జీల కింద రూ. 70 కోట్లు ఆదా చేయగలిగాం. ఇతర పొదుపు చర్యల ద్వారా మరో రూ. 10 కోట్లు వృథా కాకుండా అడ్డుకున్నాం. అన్ని రకాల చర్యల వల్ల రూ. 1150 కోట మేరక్లు ప్రజాధనం ఆదా అయ్యింది. ప్రస్తుతం మరొక రూ. 4000 కోట్లు ధనం కాపాడటం టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఇందుకు నిజాయితీ గల విశ్రాంత పోలీసులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేశాం.

ఏ అంశాలపై ఎక్కువగా దృష్టి సారించారు.?

సాంకేతికను ఎక్కువగా నమ్మాను.సరుకుల సేకరణ, పంపిణీ, సరఫరా ప్రక్రియలన్నీ ఆన్‌లైన్ చేయించాను. గోదాముల వద్ద సీసీ కెమెరాలు, రేషన్ పోర్టబులిటి, రేషన్ దుకాణాల్లో ఈ పాస్, ఎలక్ట్రానిక్ తూకాలు వంటివి తీసుకొచ్చాం. 100 శాతం క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్లు జరిగేలా చర్యలు తీసుకున్నాం. 15 వాట్సప్ గ్రూప్‌లతో నిత్యం క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడుతున్నాను. దీంతో పారదర్శకత పెరిగింది. ఫలితంగా అవినీతికి అవకాశం లేకుండా పోయింది.

సీఎం ప్రశంసలు.. అవార్డులు పొందడంపై మీ అభిప్రాయం?

ప్రభుత్వాధికారులను రాజకీయ నాయకులు, అందులోనూ సీఎంస్థాయి వారు మెచ్చుకోవటం అరుదు. ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో నన్ను మెచ్చుకున్నారు. ఆయన ప్రశంసించిన ప్రతిసారి నా బాధ్యత మరింత పెరిగింది. నిద్ర మానేసి పలు అంశాలపై అధ్యయనం చేశాను. ఎక్సలెన్స్ అవార్డు వచ్చిందంటే మొదట నమ్మలేదు. ఇందుకు ముఖ్యమంత్రికి కృజ్ఞతలు.

సెంట్రల్ సర్వీసుల్లోకి వెళ్లే ఆలోచన ఉందా?

భవిష్యత్‌లో మరింత పెద్ద హోదాలో పని చేయాలంటే కనీసం మూడేండ్లు సెంట్రల్ సర్వీసుల్లో పని చేయాలనే నిబంధన ఉంది. కాబట్టి నేను వెళ్లాలి. అయితే తెలంగాణను వదిలి వెళ్లడం చాలా కష్టమైన పని. మూడేండ్లు పూర్తయిన రోజు రాత్రే మళ్లీ హైదరాబాద్‌కు వస్తాను. ఎంతటి క్లిష్టపరిస్థితులనైనా ఎదుర్కొనే తత్వం గల ఒక మంచి ముఖ్యమంత్రి వద్ద పని చేసే అవకాశం రావటం నా అదృష్టం.

లిఫ్టుల కింద 3.40 లక్షల ఎకరాలకు నీరు

పనులన్నీ యాసంగికల్లా పూర్తికావాలి

కరీంనగర్‌లో ఆరు లిఫ్టు పథకాలు త్వరలో ప్రారంభం

ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

లిఫ్టు పథకాల పురోగతిపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది యాసంగికల్లా లిఫ్టు పథకాల కింద 3.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ (ఐడీసీ) చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అధికారులకు లక్ష్యం విధించారు. ఈ మేరకు ఆయా పథకాల పనులను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని చెప్పారు. కరీంనగర్ జిల్లా పరిధిలో ఆరు పథకాలను మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గురువారం ఐడీసీ కార్యాలయంలో నీటిపారుదల ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ తదితర అధికారులతో లిఫ్టు పథకాల పనుల పురోగతి, పునరుద్ధరణపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణ పరిధిలో 582 లిఫ్టుల కింద 3.90 లక్షల ఆయకట్టుకు నీరిస్తున్నట్టు రికార్డుల్లో ఉన్నా వాస్తవంగా ఇందులో 404 పథకాలు నిలిచిపోవడమో లేదా పాక్షికంగా పనిచేయడమో జరిగేదని అధికారులు తెలిపారు. గతేడాది వరకు 57 పథకాలు పునరుద్ధరించి 20వేల ఎకరాలకు నీరిచ్చామని, ఈ ఏడాది మరో 87 పథకాలను పునరుద్ధరించి ఇంకో 70వేల ఎకరాలకు ఇస్తామని చెప్పారు. టెండర్లు పూర్తయినా పనులు మొదలుకాని 74 కొత్త లిఫ్టుల్లో 45 లిఫ్టులను ఈ ఏడాదిలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. పులిచింతల, టెయిల్‌పాండ్‌లో ముంపునకు గురవుతున్న 12 లిఫ్టు పథకాలను తరలించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ నుంచి నిధులు రాగా ఆ పనులకు టెండర్లు కూడా పిలిచామని వివరించారు. కాగా లిఫ్టు పథకాలకు వాడే సిమెంటు పైపుల్లో నాణ్యత లోపించడం, పొడవు తక్కువగా ఉండటం వల్ల లీకేజీలు అధికమయ్యాయని అధికారులు చెప్పగా.. ఎంఎస్ పైపులను వినియోగించాలని ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో ఐడీసీ ఎండీ సురేశ్‌కుమార్, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.



గురువారం ఐడీసీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు



బెంగాల్‌లో అధికార, పాలక పక్షాలపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. గతంతో పోలిస్తే పుంజుకున్నాం. 2019లో మరింత మెరుగవుతాం. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగితే ఫలితాలు వేరుగా ఉండేవి. అయినా మేం 'నంబర్ టూ'గా నిలిచాం.

కైలాశ్ విజయ్‌వర్గీయ, బీజేపీ పశ్చిమబెంగాల్ నేత

బెంగాల్‌లో ఏడు స్థానిక సంస్థల పరిధిలో జరిగిన ఎన్నికల్లో 148కి గాను 140 వార్డులు తృణమూల్ గెల్చుకున్నది. బీజేపీ ఆరు, ఫార్వర్డ్ బ్లాక్ ఒకటి గెల్చుకోగా, కాంగ్రెస్, సీపీఎం ఖాతా తెరువలేదు. బీజేపీ తనది ద్వితీయ స్థానమని మురిసిపోతున్నది. తరగతిలో మొదటి స్థానం వానికి 95 మార్కులు వస్తే, 5 మార్కులు వచ్చిన వాడిది రెండో స్థానం అన్నట్లు ఉన్నది బీజేపీ వాదన.

పార్థా చటర్జీ, పశ్చిమ బెంగాల్ మంత్రి



చరిత్రలో నేడు



1858
నెదర్లాండ్స్, జపాన్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం.

1945
ఇండొనేషియా తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన సుకర్ణో.





2008
ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగా పాకిస్థాన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన పర్వేజ్ ముషారఫ్.

అసాధారణ స్థాయిలో భారీ వర్షం పడటంతో బెంగళూరులోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరాన్ని సుస్థిర జీవనానికి అనుగుణంగా నిర్మించకపోవడం వల్ల ఏర్పడిన మానవ కల్పిత బీభత్సమిది. ఏవైతే అభివృద్ధి పథకాలు అంటూ నిర్మించామో, అవే నీటి సహజ ప్రవాహానికి అడ్డుకట్టలుగా మారాయి. 2015లో చెన్నై వరదలకు కూడా సముద్రంలోకి వెళ్లాల్సిన నీటికి అడ్డంకులు ఎదురవ్వడమే కారణం. ఇప్పటికైనా నగరాన్ని కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలె.

హిందుస్థాన్ టైమ్స్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ కశ్మీరీలకు చర్చల ప్రాముఖ్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు. న గోలీ సె, న గాలి సె, కశ్మీర్ కి సమస్య సుల్జేగీ గలే లగానే సె (కశ్మీర్ సమస్య పరిష్కారం తూటాలతో కాదు, దుర్భాషలతో కాదు, చర్చల ద్వారానే సాధ్యం) అన్నారు. ప్రధాని స్వరం మార్చడాన్ని కశ్మీరీలు స్వాగతించారు. వాజపేయి మానవతా సూత్రాన్ని మళ్లా ప్రవేశ పెడుతాననే హామీతో మోదీ 2014లో అధికారంలోకి వచ్చారు. పీడీపీ-బీజేపీ కూటమి వినూత్న పరిష్కారం సాధిస్తామని హామీ ఇచ్చింది. భద్రతా దళాలు పైచేయి సాధించాయి. ప్రజల్లోని పరాయితనం పోలేదు.

ది ట్రిబ్యూన్

సాంకేతికత వెర్రితలలు

ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతం చేయవలసిన సాంకేతిక పరిజ్ఞానం వెర్రితలలు వేస్తున్నది. మెత్తని కత్తితో మానవుల కుత్తుకలను కోస్తున్నది! కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్లు మనిషి జీవితంలోకి ప్రవేశించి అరచేతిలో వైకుంఠాన్ని చూపించాయి. అంతులేని సమాచారం, విస్తృతమైన మానవ సంబంధాలు మనిషిని మరింత చైతన్యవంతుడిని చేయాల్సింది. కానీ ఉద్వేగాలు లేని, సృజనాత్మకత కొరవడిన మొద్దులుగా మారుస్తున్నాయి. బేలతనంతో బ్ల్యూ వేల్ క్రీడలో ప్రాణాలను బలిపెట్టుకునే స్థాయికి దిగజారుస్తున్నాయి. ఎక్కడో ఉండి సోషల్ మీడియాలో నిర్వాహకుడు చెప్పే కొద్దీ పిల్లలు స్వీయ హింసకు పాల్పడుతూ, చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. బ్ల్యూవేల్ గేమ్ అనేది సోషల్ మీడియా గ్రూప్‌లలో సాగే ఒక ప్రాణాంతక క్రీడ. నిర్వాహకులు అందులో పాల్గొన్న వారి చేత తమ శరీరాన్ని బాధించుకునే పని రోజుకొకటి చేయిస్తుంటారు. యాభై రోజుల పాటు ఈ వికృత క్రీడ సాగిన తరువాత, ఆత్మహత్య వైపు పురికొల్పుతారు. బ్ల్యూవేల్ గేమ్‌తోనే ఈ సమస్య మొదలు కాలేదు. సోషల్ మీడియాలో ఇటువంటి క్రీడలు ఉన్నాయి. ఈ ప్రాణాంతక క్రీడను నిరోధించినా పిల్లల జీవితాన్ని ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎక్కడికి తీసుకుపోతున్నదనేది చర్చించాల్సిన అంశమే. పిల్లల ఆలోచనా శక్తిని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దవలసిన పరిజ్ఞానం వారిని జీవ రహితంగా మార్చివేయడం ప్రమాదకర పోకడ. విస్తృతమవుతున్న డిజిటల్ ప్రపంచంలో అవకాశాలను అంది పుచ్చుకోవడం, అవాంఛనీయ పోకడలకు దూరంగా ఉండటం ఎట్లా అనేది పిల్లలకు నేర్పడంలో సమాజం విఫలమవుతున్నది. పిల్లలను వేధిస్తున్న సామాజిక ఆర్థిక సమస్యలకు సాంకేతికత వికృత పోకడలు తోడైనప్పుడు విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి.

మానసికంగా బలహీనులమైన పిల్లలే సోషల్ మీడియాలో బ్ల్యూ వేల్ వంటి ప్రాణాంతక క్రీడలకు బలవుతున్నారు. దీనిలో తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉన్నది. ఎదిగీఎదగని మనస్తత్వం గల టీనేజ్ పిల్లలు విస్తారమైన డిజిటల్ ప్రపంచంలో అడుగుపెడుతున్నారు. వీరు రోజంతా కంప్యూటర్ దగ్గరే గడుపుతున్నారు. ఎదిగీఎదగని వయసులో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ఉండాలె. తల్లిదండ్రులు తమ పిల్లలను మరీ నిర్బంధం చేయనప్పటికీ, గమనిస్తూ ఉండాలె. కానీ స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు అప్పగించి వదిలిపెడుతున్నారు. తల్లిదండ్రులు రోజుకు గంటసేపు కూడా పిల్లలతో గడుపడం లేదు.


బ్ల్యూ వేల్ గేమ్ పిల్లల ఉసురు తీసుకుంటున్నది కనుక ఇటువంటి ప్రాణాంతక క్రీడలను అరికట్టవలసిందే. కానీ పిల్లల ఆత్మహత్యలకు కారణం ఈ క్రీడలు మాత్రమే అనే తప్పుడు నిర్ధారణకు రాకూడదు. ఈ ప్రాణాంతక క్రీడలతో నిమిత్తం లేకుండా దేశంలో పిల్లల ఆత్మహత్యలు సాగుతున్నాయి. వాటిలో కొన్నింటికి ఈ క్రీడలు ఊతంగా మారాయి. మన దేశంలో సగటున ప్రతి గంటకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. 15 నుంచి 29 ఏండ్ల మధ్యన గల వారి ఆత్మహత్యలలో ప్రపంచంలోనే దేశం మొదటి స్థానంలో ఉన్నదని కొన్నాళ్ళ కిందట ఒక నివేదిక వెల్లడించింది. దేశంలోని ఆత్మహత్యలలో మూడో వంతు యువత పాల్పడినవే. 2015లో దాదాపు తొమ్మిది వేల మంది యువతీయువకులు ఆత్మహత్యకు పాల్పడినట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. అయినా దీనినొక సమస్యగా సమాజం, ప్రభుత్వం గుర్తించడం లేదు. ఆర్థిక పరిస్థితులు, చదువులు యువత మీద తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. కోచింగ్ వ్యాపార కేంద్రాలకు నిలయమైన రాజస్థాన్‌లోని కోటాలో ఆత్మహత్యలు అనేకం జరుగడం గమనార్హం. వాస్తవదూరమైన లక్ష్యాలు నిర్దేశించడం వల్ల పిల్లలపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కొన్ని పేరు పొందిన విద్యా సంస్థలలో సీటు రాకపోతే ఇక జీవితమే లేదన్నట్టుగా ప్రచారం సాగుతున్నది. దీంతో సీటు తెచ్చుకోలేని విద్యార్థులు తాము విఫలమయ్యామనే ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కొందరు పరీక్ష రాయకముందే ఒత్తిడి భరించలేక ప్రాణాలు బలితీసుకుంటున్నారు. జీవితంలో నిలదొక్కుకోలేని యువకులు, ఆర్థికంగా దుర్భర పరిస్థితుల నుంచి బయటపడలేనివారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మానసికంగా బలహీనులమైన పిల్లలే సోషల్ మీడియాలో బ్ల్యూ వేల్ వంటి ప్రాణాంతక క్రీడలకు బలవుతున్నారు. దీనిలో తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉన్నది. ఎదిగీఎదగని మనస్తత్వం గల టీనేజ్ పిల్లలు విస్తారమైన డిజిటల్ ప్రపంచంలో అడుగుపెడుతున్నారు. వీరు రోజంతా కంప్యూటర్ దగ్గరే గడుపుతున్నారు. ఎదిగీఎదగని వయసులో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ఉండాలె. తల్లిదండ్రులు తమ పిల్లలను మరీ నిర్బంధం చేయనప్పటికీ, గమనిస్తూ ఉండాలె. కానీ స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు అప్పగించి వదిలిపెడుతున్నారు. తల్లిదండ్రులు రోజుకు గంటసేపు కూడా పిల్లలతో గడుపడం లేదు. కుటుంబ సంబంధాలు తగ్గి పోతున్నాయి. ఉమ్మడి కుటుంబాల మాటే లేదు. సామాజిక సంబంధాలు కూడా అంతంత మాత్రం. దీనికి తోడు పోటీ పరీక్షల కోసం ఒత్తిడులు. ఈ కారణాలన్నీ పిల్లలను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. వారికి కావలసిన సొమ్ము ఇస్తూ, సౌకర్యాలు కల్పించడం మాత్రమే తమ బాధ్యతగా భావిస్తున్నారు. సామాజిక పోకడ, చదువుల ఒత్తిడి, తల్లిదండ్రుల నిర్లక్ష్యం మొదలైనవన్నీ పిల్లలను కబళించే తిమింగలాల మాదిరిగా మారాయి. పిల్లల పెంపకం తమ బాధ్యతనే విషయాన్ని తల్లిదండ్రులు మొదట గుర్తించాలె.

సందర్భం

మట్టిలో మాణిక్యం

తెలంగాణలో ఆత్మగౌరవ స్వయంపాలన ఉద్యమం 367 ఏండ్ల కిందనే సర్వాయి పాపన్నగౌడ్ నాయకత్వంలోనే ప్రారంభమైంది. మొఘల్ పాలనకు సమాంతరంగా స్వయంపాలన చేసి బహుజన కులాల వీరుడిగా చరిత్ర సృష్టించాడు. వరంగల్ జిల్లా జనగామ తాలుక, ఖిలాషాపూర్‌లో గౌడ కులంలో పుట్టిన పాపన్న గౌడ్ గీత వృత్తి చేపట్టి జీవనం వెళ్లదీసేవాడు. నాటి అసాధారణ పరిస్థితులు, దోపిడీ, పీడనలకు, వ్యతిరేకంగా మొఘల్ సామ్రాజ్య పాలకులకు చెమటలు పట్టించాడు. ఖిలాషాపూర్‌లో పుట్టిన స్వయంపాలన ఉద్యమం గోల్కొండను చుట్టుముట్టింది. ఈ ఉద్యమం వెనుక అనేక కోణాలున్నాయి. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక తిరుగుబాటుగా మొదలైన ఈ పోరాటం ఢిల్లీ నవాబు బహదూర్‌షా హయాంలో సర్వాయి పాపన్నగౌడ్‌ను స్వయంపాలకుడిగా గుర్తించాడు. ఆ తర్వాత గోల్కొండ సింహాసనంపై ఆసీనుడిని చేసి ఖరీదైన దుస్తులతో పాపన్నను సన్మానించాడు.



పాపన్న జీవిత చరిత్రను అనేక కోణాల్లో విశ్లేషించవచ్చు. బహుజన కులాలను ఏకం చేయడంలో ఆయన విజయవంతమయ్యాడు. పాపన్న జీవితాన్ని, వీరత్వాన్ని, గొప్పతనాన్ని ఇంతవరకు జానపద కళాకారులు, గ్రామీణ సాంస్కృతిక జీవనంలో పెనవేసుకునే విధంగా తమ కళల ద్వారా కాపాడగలిగారు. పాపన్నను పల్లె జానపదులు ఇంతగా ఆదరించడానికి అనేక మానవీయ కోణాలున్నాయి. అతనిలో ఒక సామ్యవాది, సంస్కరణవాది, మంచి పరిపాలకుడున్నాడు.


పాపన్న గౌడ కులస్థుల రక్షణ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. తాటికొండ, ఖిలాషాపూర్ కోటలు గమనించినప్పుడు ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజల కష్టాలు తెలిసినవాడు కాబట్టి సామ్రాజ్యవాదులకు శత్రువుగా, తెలంగాణ ప్రజలకు ఆరాధ్యుడిగా ఆయన నిలిచాడు. అనేక కష్టాల మధ్య తన జీవనం గడిచింది. జన్మతః గౌడ కులంలో పుట్టిన ఒక సాధారణ వ్యక్తి, రాజ్యాధికార కాంక్ష అతన్ని అంత గొప్ప వ్యక్తిగా, శక్తిగా మార్చగలిగింది.

– అంబాల నారాయణ గౌడ్

(నేడు సర్వాయి పాపన్న జయంతి)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



మిహిర్ స్వరూప్ శర్మ

డోక్లాం ఉద్రిక్తతలు సడలేనా?

జమ్ముకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంట రాళ్లు విసురడాలు ఇప్పుడు వార్తగా ప్రాముఖ్యాన్ని పొందటం లేదు. మన సైన్యంపై రాళ్లు విసురుతున్న వారు సాధారణ దుస్తుల్లో ఉన్న పౌరులు కాదు. భారత ఉత్తరభాగాన ఉన్న చైనా సరిహద్దు సమీపంలోని డోక్లాంలో ఉన్న పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉన్నది. లడఖ్ ప్రాంతంలోని డోక్లాం ఇప్పుడు చైనా-భారత్‌ల మధ్య వివాదాస్పద సరిహద్దు ప్రాంతంగా కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్నది. ఈ విషయంలో ఇరు దేశాలూ మెట్టు దిగకుండా పంతానికి పోతున్నాయి.

ఆ ప్రాంతం తమదంటే తమదని సేనల మోహరింపులతో కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. ఈ క్రమంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ చైనాతో సరిహద్దు వివాదం గురించి శాంతియుత పరిష్కారం కోసం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారా? అంటే జరుగుతున్న పరిణామాలు లేదనే చెబుతున్నాయి.

చైనా విషయంలో జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖకు ఆవల పాకిస్థాన్ సృష్టిస్తున్న సమస్యల్లాంటివి కావు. కానీ దశాబ్దాలుగా భారత్-చైనాల మధ్య సరిహద్దు వివాదం రాజుకుంటూనే ఉన్నది. ఈ నేపథ్యంలో కశ్మీర్‌లో జరుగుతున్నదానికి భిన్నంగా ఇక్కడ ఇరుదేశాల సైనికులే ఎదురెదురుగా నిలుస్తున్నారు. ఆయుధాలతో బలప్రదర్శనకు దిగుతున్నారు. తమ వాదనలకు బలం చేకూర్చే ప్లకార్డులను ప్రదర్శిస్తున్నారు. సైన్యం మోహరింపుతో ఉద్దేశాలను చాటుతున్నారు. రాళ్లు విసురుకున్నా సవాళ్లు విసురుకుంటున్నారు. చైనాతో సరిహద్దు వెంట ఎక్కడ ఏ ఘటన జరిగినా ఇరుదేశాల మధ్య వైరుధ్యాలకు కారణమవుతున్నది. సాధారణ పరిస్థితుల్లో అయినా ఇరుదేశాల సైనికులు ఎదురెదురు పడినప్పుడు తప్పనిసరిగా ఉద్రిక్తతలు తలెత్తడం సహజం. ఇలాంటి సందర్భాల్లోనే ఇరువైపుల నుంచి సంయమనంగా వ్యవహరించే నేర్పు, ఓర్పు అవసరం. కానీ గత రెండు నెలలుగా డోక్లాం ప్రాంతంలో తలెత్తిన పరిస్థితులు దీనికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. సంయమనంతో, శాంతియుతంగా వ్యవహరించాలన్న ధోరణి ఇరువైపులా లోపిస్తున్నట్లు కనిపిస్తున్నది. చైనా అధికార మీడియా పూర్తిగా ఏకపక్షంగా చైనాకు వత్తాసు పలుకుతూ భారత్‌ను తెగనాడుతున్నది. సాధారణ పరిస్థితులను కూడా అసాధారణంగా చూపెడుతున్నది.

దేశంలో ఏ ఒక్కరూ దేశ ఉత్తర భాగాన చైనా సరిహద్దులోని డోక్లాం ప్రాముఖ్యం గురించి అనుమానాలేవీ లేవు, అలాగే ప్రశ్నించటం లేదు. చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ డోక్లాం ప్రాంతంలో పరిస్థితులను ఉన్నపళంగా మార్చివేయలేదు. అలాగే భారతదేశ భద్రత విషయంలో డోక్లాం ప్రాముఖ్యాన్ని కొట్టిపారేయలేం. ఉన్న స్థితిని యథావిధిగా కొనసాగించటంలో తప్పులేదు. కానీ చైనా భూటాన్‌ను బెదిరింపులతో లొంగదీసుకోవటానికి ప్రయత్నించటం అనుమతించదగింది కాదు. థింపూ ఒప్పందం కొనసాగించటంలో భారత్‌కు ఇబ్బందేమీ లేదు. కానీ దేశాల భద్రత విషయంలో రాజీ పడటానికి ఆస్కారం లేదు.

కానీ ఈ నేపథ్యంలోనే మన దేశం ఉన్న అవకాశాలను వినియోగించుకోకుండా పక్కదారులు పడుతున్నట్లు కనిపిస్తున్నది. అలాగే చైనాలో కూడా వారి అంతర్గత విషయాల నేపథ్యంలో లేని ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్న తీరు కనిపిస్తున్నది. ఉద్రిక్తతలను ఎగదోస్తున్న తీరే సర్వత్రా కనిపిస్తున్నది. ఈ క్రమంలో ఏడాది కిందటే చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ చైనాలో జరిగిన పంతొమ్మిదవ పీపుల్స్ కాంగ్రెస్ జరిగిన సమయంలోనే ఈ ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారు. అలాగే భారత్ కూడా పూర్తిగా స్నేహపూర్వక వాతావరణంలో చేయాల్సినంతగా ప్రయత్నాలన్నీ చేస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. చైనా ఏయే సందర్భాల్లో ఉల్లంఘనలకు పాల్పడిందో భారత్ ఎత్తి చూపుతున్నది. వివాదాస్పద ప్రాంతాల నుంచి వెనక్కి తగ్గాలని భారత్ వాదిస్తున్నది. కానీ చైనా వైపు నుంచి ఏ విషయంలోనూ సానుకూల స్పందన రావటం లేదు. చైనా దృష్టిలో– భారత్ మేలుకోసమే వివాదాస్పద స్థలాల నుంచి వెనక్కితగ్గాలి. అది భారత్‌కే మేలు చేస్తుందని చైనా అంటున్నది. అలా భారత్ సైన్యాలను వెనక్కి పిలిచినప్పుడే సరిహద్దు వివాదాల గురించిన చర్చలు జరుగుతాయని సూచిస్తున్నది. భారత్ చర్యలకు న్యాయబద్ధత ఉన్నా ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలు ఉండటం లేదు.

ఈ పరిస్థితుల్లో ప్రధాని మోదీ అంతిమ పరిష్కారంగా ఏమి ఆలోచిస్తున్నారు? ఈ క్రమంలో డోక్లాం సంక్షోభ పరిష్కారానికి ఏదో ఒక పరిష్కారం ఉన్నదా? మనం ఇప్పుడు ఏ పరిస్థితిలో ఉన్నామో, దాన్ని నిలుపుకోవటానికి కావలసిన శక్తి సామర్థ్యాలు మనవద్ద ఉన్నాయా? ఒకవేళ చైనానే ముందుకు దూసుకువస్తే మనకు మనం నిలదొక్కుకొని నిలువగలమా? అన్న భయాలు చుట్టుముడుతున్నాయి. లడఖ్ విషయంలో సంఘర్షణ అనివార్యమైతే, అయితే వ్యూహాత్మకంగా సరైనదే అవుతుందా అన్నది ఉండనే ఉన్నది. యుద్ధమే అనివార్యమైతే నష్ట తీవ్రత తీవ్రంగా ఉంటుందన్నది వాస్తవం. ఆ నష్టానికి పరిమితులు, అవధులు అంటూ ఉండని స్థితి తలెత్తుతుంది. కాబట్టి డోక్లాం నుంచి వెనక్కి తగ్గటమే పరిష్కారం అని చెప్పలేం. ఆ ప్రాంతంలో చైనా చేసే చర్యలపై ఆ ప్రాంత పరిస్థితి ఆధారపడి ఉంటుంది. కాబట్టి భూటాన్, చైనాల మధ్య సంబంధాలు, భద్రతా చర్యలు మొత్తం దక్షిణాసియా ప్రాంత శాంతికి సంబంధించినవిగా ప్రాధాన్యం కలిగి ఉంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో భారత్ బ్రిక్స్ సమావేశాలను బహిష్కరించే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో రాబోయే కొన్ని వారాల్లో చైనాలో జరిగే బ్రిక్స్ సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవచ్చు. ఇది చైనా అధ్యక్షునికి మింగుడుపడని విషయంగా మారే అవకాశం ఉన్నది. ఇదే నిజమైతే, బ్రిక్స్ సమావేశంలో ఇండోనేషియాతో ఇండియా స్థానాన్ని పూరించే ప్రయత్నం జరుగవచ్చు. అయితే దీంతో చైనా సాధించేదేమీ ఉండదు. ఇప్పుడు భారత్‌ను కాదని బ్రిక్స్ సమావేశాన్ని నిర్వహించామని చెప్పుకున్నా చైనాకు దన్నుగా నిలిచిన దేశాలకు ఒరిగేదేమీ ఉండదు.

ఇక చైనాతో విభేదాల విషయంలో ముందుకువచ్చేది వ్యాపార సమస్యనే. దీన్ని భారత ప్రభుత్వం ఎలా ఎదుర్కోబోతున్నదో చూడాలి. చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న 22 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతిని నిలుపుదల చేయవచ్చు. ఇది ఒక సాధ్యమయ్యే పనే. కానీ ఇక్కడే మనం ఆలోచించుకోవాలి. మనదేశమేమీ అమెరికా కాదు. ఒక దేశం నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులన్నింటినీ కాదని ఎలా అవసరాలను తీర్చుకుంటామన్నది పెద్ద ప్రశ్న. చైనా ఎగుమతి చేస్తున్న దాంట్లో భారత్ దిగుమతి చేసుకుంటున్నది సముద్రంలో నీటి బొట్టు అంత మాత్రమే. కాబట్టి వ్యాపార లావాదేవీలు, ఎగుమతి, దిగుమతులతో చైనాను లొంగదీసుకొని, కట్టడి చేయటమనేది హాస్యాస్పదమే.

చివరగా ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో ఇక మిగిలింది ఒకటే. ఒకదేశ సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించాలి. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉద్రిక్తతలను సడలించేందుకు సాధ్యమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. చైనా నిర్మిస్తున్న 'వన్ బెల్ట్-వన్ రోడ్' విషయంలో పంతాలకు పోవాల్సిన అవసరం లేదు. దీని విషయంలో భారత్ అనుసరిస్తున్న విధానం ముందస్తు అభిప్రాయంతో నిర్మించుకున్న దురభిప్రాయంలా ఉండకూడదు. అయితే ఈ విషయంలో భారత్ అభిప్రాయం నిశ్చితంగా ఉన్నది. ఎలాంటి దురాక్రమణలైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నది. ఈ క్రమంలో చైనా ఇప్పటికే అనేక చర్యలకు తెరలేపింది. ఇప్పటికే ఉత్తర కొరియా సమస్య ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో చైనా ఆలోచనలను అర్థం చేసుకోలేనివేమీ కావు. చైనా అధ్యక్షుడు తీసుకునే రాజకీయ చర్యలపై అంతా ఆధారపడి ఉంటుంది. ఈక్రమంలో మనం చైనా ఎటువైపు వెళుతుంది, ఏ అడుగులు వేస్తుందని ఊహించలేం. అయితే లడక్, డోక్లాం ప్రాంతంలో ఇరుదేశాల బల ప్రదర్శన ఒక దురదృష్టకరమైనది. ఈ నేపథ్యంలో మనం అడుగాల్సింది ఒకటే.. శాంతియుత వాతావరణానికి తీసుకోవాల్సిన, తీసుకోదగిన చర్యలన్నీ తీసుకుంటున్నారా? అని. ఇప్పుడు మోదీ ఏం చేయదల్చుకున్నారు? అంతిమ పరిష్కారంగా ఏదైనా ఉన్నదా?

చైనా అధ్యక్షుడు తీసుకునే రాజకీయ చర్యలపై అంతా ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో మనం చైనా ఎటువైపు వెళుతుంది, ఏ అడుగులు వేస్తుందని ఊహించలేం. అయితే లడఖ్, డోక్లాం ప్రాంతంలో ఇరుదేశాల బల ప్రదర్శన ఒక దురదృష్టకరమైనది. ఈ నేపథ్యంలో మనం అడుగాల్సింది ఒకటే.. శాంతియుత వాతావరణానికి తీసుకోవాల్సిన, తీసుకోదగిన చర్యలన్నీ తీసుకుంటున్నారా? అని. ఇప్పుడు మోదీ ఏం చేయదల్చుకున్నారు?

(రచయిత: ప్రముఖ ఆర్థిక, రాజకీయ శాస్త్రవేత్త)

ఇంటర్ విద్యలో వికాసం

విద్య



ఆస్నాల శ్రీనివాస్

'ప్రజలందరూ నా పిల్లలే. ఈ ప్రపంచంలో విద్య కోసం నా సొంత పిల్లలకు ఏ రకమైన సదుపాయాలు కల్పించబడాలని భావిస్తానో అదే విధమైన సదుపాయాలు నా ప్రజలందరికీ ఉండాలని భావిస్తాను.' **కళింగ శాసనంలో అశోక చక్రవర్తి**

'బాలబాలికలు జాతి సంపద. వీరందరూ విద్యను పొందడం హక్కు. అందరికీ సమాన, గుణాత్మక విద్య అందివ్వడం ఆయా ప్రభుత్వాల బాధ్యత.' **యూఎన్‌ఓ మానవ హక్కుల ప్రకటన**

తెలంగాణ వస్తే ఏమొస్తదని ఎగతాళి చేసిన పరాయి పాలకులకు, అభివృద్ధి నిరోధకులకు గత మూడేండ్లుగా ఈ తెలంగాణ స్వర్ణమేదినిపై వ్యవసాయ, పారిశ్రామిక, సామాజిక విద్యారంగాల్లో వస్తున్న విప్లవాత్మక సమ్మిళిత ఫలితాలే సరైన సమాధానాన్ని చెబుతున్నాయి. జయాపజయాలతో సంబంధం లేకుండా, అరువై ఏండ్లు కొనసాగిన రాష్ట్ర సాధన పోరాట క్రమంలో అంతిమ విజయం సాధించాం. మలి దశ ఉద్యమకాలంలో వెల్లువెత్తిన ప్రజా ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు, ఉచిత వైద్యం, ఉచిత విద్యకు తొలి ప్రభుత్వం పట్టంకట్టి అమలుచేస్తున్నది. 2014 నుంచి ఉద్యమకాల నిబద్ధత, ఉత్సాహంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను పునరుజ్జీవింపజేసే అనేక ఉద్దీపనలను ప్రకటించింది. ప్రత్యేకంగా ప్రభుత్వ ఇంటర్ విద్య అభివృద్ధి వికాసాలకు భారతీయ విద్యా చరిత్రలోనే ఎన్నడూలేని సదుపాయాలను కల్పిస్తున్నది. సరళీకరణ, ప్రవేటీకరణ సంస్కరణలు ప్రారంభమైన తొంభయవ దశకం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏటా 10–15 శాతం విద్యార్థుల నమోదు పడిపోవడం ప్రారంభమైంది. 2013 నాటికి 404 జూనియర్ కళాశాలల్లో అరువై వేలకు పడిపోయింది. పరాయి పాలకులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, సరైన సమయంలో అధ్యాపక ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నిర్వీర్యం చేశారు.

ఈ క్రమంలో దేశ ప్రగతికి అవసరమైన శాస్త్ర సాంకేతిక నిపుణులను, సృజనకారులను, సామాజిక శాస్త్రవేత్తలను అందించిన ప్రభుత్వ ఇంటర్ విద్య అంతరించే స్థాయికి చేరుకున్నది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం 404 కళాశాలలకు 310 కోట్లతో అవస్థాపనా సౌకర్యాలను కల్పించింది. ఒక నమూనాగా కళాశాలకు ఉండే పక్కాభవనం, విశాలమైన తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, తాగునీరు కోసం నీటి శుద్ధీకరణ ప్లాంట్లు, నిరంతర నీటి సరఫరాతో విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక మూత్రశాలలు, డిజిటల్ బోధన కోసం కంప్యూటర్లను, ప్రొజెక్టర్లను ఏర్పాటుచేసింది. అన్ని కళాశాలలో ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేసింది. ఎలాంటి రుసుం లేకుండా విద్యార్థులకు ఉచిత విద్యను కల్పించింది. ఏటా 20 కోట్లతో విద్యార్థులందరికి ఉచిత పుస్తకాలను, క్రీడా సామాగ్రిని అందజేస్తున్నది. విద్యార్థులలో, అధ్యాపకులలో బాధ్యతాయుతమైన సమయపాలన కోసం సీసీ కెమెరాలు, బయోమెట్రిక్‌లను ఏర్పాటు చేసింది. ఈ చర్యలతో సామాజిక విద్య సాధికారత దిశగా విప్లవాత్మకంగా ముందుడుగు వేస్తున్నది. పరాయి పాలకుల కాలంలో జడప్రాయంగా ఉన్న విద్యా పరిశోధన, వృత్యంతర శిక్షణా విభాగాన్ని ఆచార్య జయశంకర్ శిక్షణ కేంద్రంగా మార్చి చలనశీలంగా మార్చింది. 2014 నుంచి ఏటా అధ్యాపకులకు వారి సబ్జెక్టులలో విస్తృత పరిజ్ఞానం పొందడం కోసం సమకాలీన మార్పులపై అవగాహన పెంచడం కోసం పాఠ్యాంశాల పట్ల ప్రేమను, విద్యార్థులు సమగ్ర మూర్తిమత్వంతో ఎదుగడానికి కావలసిన నైపుణ్యాలను కల్పించే విధంగా శిక్షణా కార్యక్రమాలను అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్నది.

2002లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం ఇంటర్ విద్య సంస్కరణల కోసం ప్రొఫెసర్ నీరదారెడ్డి కమిషన్‌ను వేసింది. ఈ కమిషన్ ప్రభుత్వ విద్య పటిష్ఠతకు, ప్రైవేట్ విద్య నియంత్రణకు అర్థవంతమైన సిఫార్సులను సూచించింది. ప్రైవేటు కళాశాలలకు అనుమతులివ్వడంలో, అదనపు సెక్షన్లను మంజూరు చేయడంలో, ఫీజుల నియంత్రణ కోసం కఠిన నిబంధనలు అమలుచేయాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ ఉమ్మడి పాలకులు ఈ సిఫార్సులను బుట్టదాఖలు చేశారు. పైగా ప్రభుత్వ ఇంటర్ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి కుట్రపూరితంగా 2005లో ప్రొఫెసర్ దయారత్నం కమిటీని వేశారు. ఈ కమిటీ సిఫార్సుల్లో ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసే ప్రతిపాదనలకు ప్రాముఖ్యం లేదు. పైగా ఎంసెట్‌లో ఇంటర్ మార్కులను 25 శాతం వెయిటేటజీని ప్రతిపాదించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కార్పొరేట్‌శక్తులు ఇంటర్ విద్యను, ఎంసెట్ శిక్షణను పూర్తిస్థాయిలో వ్యాపారమయం చేశాయి. తత్ఫలితంగా ప్రభుత్వ ఇంటర్ విద్య ప్రాభవం శీఘ్రగతిలో క్షీణించింది.

స్వరాష్ట్రంలో ఆధునిక అశోకుడిగా పాలిస్తున్న సీఎం కేసీఆర్ దార్శనికతతో, అంబేద్కర్, పూలేల విద్యా దృక్పథం కలిగి ఉన్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పర్యవేక్షణలో నిబంధనలను పాటించని 850 ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల అనుమతిని నిరాకరించారు. 2014 నుంచి ప్రైవేట్ రంగంలో నూతన కళాశాలలకు అనుమతిని ఇవ్వడంలేదు. ఈ చర్యలన్నీ ప్రభుత్వ ఇంటర్ విద్య వికాసం కోసం దోహదం చేస్తున్నాయి. ఈ విధంగా తెలంగాణ పునర్నిర్మాణంలో క్రియాశీలంగా, సామాజిక విద్యను సృజనశీల సామాజిక బాధ్యతతో, మానవ వనరులు రూపొందడానికి మార్గం సుగమమవుతున్నది. ఈ సాహసోపేత ప్రజానుకూల సంస్కరణ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మూడేండ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అడ్మిషన్లలో 85 శాతం పైగా పెరుగుదలను నమోదు చేశాయి.

2017–18 విద్యా సంవత్సరంలో 2.80 లక్షల విద్యార్థుల సామర్థ్యం కలిగి ఉన్న 404 కళాశాలల్లో 1.90 లక్షలు విద్యార్థులు చదుకుంటున్నారు. 30కి పైగా జనరల్ కోర్సులు, 40కి పైగా వృత్తివిద్యా కోర్సులను అభ్యసిస్తున్నారు. ఇవే కాకుండా 6, 8 నెలల స్వల్ప వ్యవధి వృత్తి విద్యా కోర్సుల్లో వేలాదిమంది విద్యార్థులు చేరారు. ఇదొక అపూర్వ ఘట్టం.

ఈ విజయంలో అధ్యాపకుల కృషి ప్రశంసనీయం. సామాజిక హోదాకు, జీవన భద్రతకు కారణమైన ఇంటర్ విద్యా వ్యవస్థ పరిరక్షణ, వికాసాలకు మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలోనే అంకితభావంతో పనిచేయడం ప్రారంభించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. నిర్దేశించిన పనిగంటల కంటే అదనంగా పనిచేస్తున్నారు. రెమిడియల్ క్లాసులను నిర్వహిస్తున్నారు. ఈ పనివిధానంతో నిరుపేద విద్యార్థులే కాకుండా, మధ్యతరగతి విద్యార్థులు కూడా ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు.

ఈ ప్రస్థానం మరింత పరిపూర్ణత వైపు సాగడానికి ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను, సౌకర్యాలను కల్పించడంలో నిమగ్నమైంది. మధ్యాహ్న భోజనం లేదా అనుబంధ వసతి గృహాలను ఏర్పాటుచేయడం, నూతన మండలాల్లో కళాశాలలను స్థాపించడం, వ్యాయామ అధ్యాపకులను నియమించడం, ఆచార్య జయశంకర్ అధ్యాపక శిక్షణా కేంద్రాన్ని అకడమిక్ స్టాఫ్ కళాశాలగా మార్చడం, స్థానిక వనరులు, అవసరాలకనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టడం లాంటివి చేస్తున్నది.

గుణాత్మక ఉచిత విద్యను అందరికీ అందించి జ్ఞాన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. మానవీయ పౌరులుగా తీర్చిదిద్ది, అభివృద్ధి ఫలాలు అందరికీ అందే నవ్య మానవ తెలంగాణ సృష్టిలో విద్యారంగం యావత్ దేశానికి మార్గదర్శకంగా, దిక్సూచిగా మారుతున్నది.

గుణాత్మక ఉచిత విద్యను అందరికీ అందించి జ్ఞాన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. మానవీయ పౌరులుగా తీర్చిదిద్ది, అభివృద్ధి ఫలాలు అందరికీ అందే నవ్య మానవ తెలంగాణ సృష్టిలో విద్యారంగం యావత్ దేశానికి మార్గదర్శకంగా, దిక్సూచిగా మారుతున్నది.

(వ్యాసకర్త: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షులు, వరంగల్ అర్బన్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పాపకు జన్మనిచ్చిన పదేండ్ల బాలిక

- లైంగికదాడితో అమ్మయిన అభంశుభం తెలియని చిన్నారి



చండీగఢ్, ఆగస్టు 17: అభంశుభం ఎరుగని పదేండ్ల బాలిక తల్లయ్యింది. కొన్ని నెలలపాటు సమీప బంధువు చేతిలో లైంగికదాడికి గురయిన చిన్నారి ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తన కడుపులో పెరుగుతున్నది బిడ్డ అని ఇప్పటివరకు బాలికకు తెలియని అమానవీయ స్థితిలో ప్రభుత్వ దవాఖానలో పురుడుపోసుకున్నది. చండీగఢ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల, దవాఖాన (జీఎంసీహెచ్)లో రెండుగంటలపాటు చికిత్సలు నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. పాప 2.2 కేజీల బరువుతో పుట్టిందని, చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేదని చెప్పారు. దగ్గరి బంధువు కొన్ని నెలలుగా ఆ బాలికపై లైంగికదాడికి పాల్పడటం.. చిన్నారి కడుపునొప్పితో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు గతనెలలో ఆమెను దవాఖానకు తీసుకెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే చిన్నారి 30 వారాల గర్భవతి అని వైద్యులు తెలిపారు. అబార్షన్ చేయాలని తల్లిదండ్రులు తొలుత దిగువ కోర్టులో తరువాత సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. చట్టం ప్రకారం 20 వారాలకు మించి ఉన్న గర్భాన్ని తొలిగించేందుకు వీలులేదని కోర్టులు వారి విజ్ఞప్తి తోసిపుచ్చాయి. ఇప్పటివరకు బిడ్డకు జన్మనిచ్చినట్టు ఆ బాలికకు తెలియకపోవడం గమనార్హం. కడుపులో రాయి ఉన్నదని, దాన్ని తొలిగించేందుకు శస్త్రచికిత్స చేయాలని తల్లిదండ్రులు.. బాలికకు చెప్తూ వచ్చారు.

బ్లూవేల్ ఆత్మహత్యలు ఆందోళనకరం: ఢిల్లీ హైకోర్టు

చెన్నై, ఆగస్టు 17: ప్రమాదకర ఆన్‌లైన్ గేమ్ బ్లూవేల్ కారణంగా చిన్నారులు ప్రాణాలు కోల్పోతుండటంపై ఢిల్లీ హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఇది చాలా సీరియస్ విషయమని పేర్కొన్నది. చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 'పిల్లలు, టీనేజర్లు సున్నితమనస్కులు. వారి ఆత్మహత్య చేసుకుంటున్నారంటే అర్థం చేసుకోవచ్చు. యువకులు కూడా ఆ గేమ్ ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడటం ఏంటి? భవనం పైనుంచి దూకమని ఎవరో టాస్క్ ఇస్తే, వెళ్లి దూకడమేనా..?' అని కోర్టు విస్మయం వ్యక్తంచేసింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం ఉందని, పూర్తి వివరాలు అందుకున్నాక బ్లూవేల్ గేమ్ లింకుల తొలగింపు లేదా నిషేధంపై ఆదేశాలు జారీ చేస్తామని బెంచ్ పేర్కొన్నది. విచారణను 22కు వాయిదా వేసింది.

'బ్లూవేల్'పై హాట్‌లైన్ ఏర్పాటు చేయండి

బ్లూవేల్ గేమ్‌కు సంబంధించిన సూచనలు, ఇతరత్ర సమాచారం స్వీకరించేందుకు ప్రత్యేక హాట్‌లైన్‌ను లేదా వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని నాస్కామ్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్సీఐ) సూచించాయి. లింకులు, వాటి సోర్స్‌ను గుర్తించేందుకు వీలుగా దీనిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించాయి. మరోవైపు బ్లూవేల్ గేమ్‌పై విస్తరిస్తున్న వేళ.. తల్లిదండ్రులు జాగ్రత్త వ్యవహరించాలని జాతీయ బాలల హక్కుల సంస్థ (ఎన్సీపీసీఆర్) సూచించింది. 'మీ పిల్లలపై కన్నేయండి. అసాధారణంగా ప్రవర్తిస్తున్నారని అనిపిస్తే కౌన్సెలింగ్ చేయించండి' అని కోరింది.



ఇరోమ్ షర్మిల పెండ్లయ్యిందోచ్

కొడైకెనాల్, ఆగస్టు 17: ఉక్కుమహిళ, మణిపూర్ పౌరహక్కుల నాయకురాలు ఇరోమ్ షర్మిల పెండ్లయ్యింది. ఎన్నో అవాంతరాలు, పెండ్లిని జరుపొద్దంటూ దాఖలయిన పిటిషన్‌ను దాటుకుంటూ.. ఎట్టకేలకు షర్మిల, బ్రిటన్ జాతీయుడు డెస్మండ్ కౌటినో గురువారం ఒక్కటయ్యారు. తమిళనాడులోని కొడైకెనాల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహచట్టం ప్రకారం వీరు పెండ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ రాధాకృష్ణన్ సమక్షంలో షర్మిల వేలికి కౌటినో రింగు తొడిగారు. నిరాడంబరంగా నిర్వహించిన పెండ్లి వేడుకకు వధూవరుల కుటుంబసభ్యులు హాజరుకాలేదు. ముందుగా హిందూవివాహ చట్టం ప్రకారం పెండ్లిచేసుకుని, ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం రిజిస్టర్ చేయించుకున్నారు.

బీజేపీపై పోరుకు ఏకమైన విపక్షం



ఢిల్లీలో గురువారం జరిగిన సభలో పాల్గొన్న మన్మోహన్ సింగ్, రాహుల్, శరద్‌యాదవ్, సీతారాం ఏచూరి

- శరద్‌యాదవ్ సమావేశానికి 12కు పైగా పార్టీల నేతలు హాజరు
- దేశంలో సమ్మిళిత సంస్కృతిని కాపాడేందుకు పోరాడాలని పిలుపు
- ప్రజలు 'సచ్ భారత్' కోరుతున్నారు : రాహుల్
- కలిసికట్టుగా పోరాడితే హిట్లర్‌లాంటివాడూ మట్టికరువక తప్పదు : శరద్‌యాదవ్
- దేశాన్ని హిందూరాష్ట్రం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నేతల విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: బీజేపీపై ఉమ్మడి పోరాటం చేయాలని విపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఈమేరకు జేడీయూ తిరుగుబాటు నేత శరద్‌యాదవ్ గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'సాంఝీ విరాసత్ బచావో' సమావేశానికి 12కు పైగా పార్టీల నాయకులు హాజరయ్యారు. సమ్మిళిత సంస్కృతిని కాపాడేందుకు ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని ప్రతిపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, ఎస్పీ, బీఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ, ఎన్సీ, జేడీ(యూ), జేడీ(ఎస్), ఆర్‌ఎల్‌డీ తదితర పార్టీల నేతలు హాజరయ్యారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ నేత డీ రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీపైనా, ప్రధాని మోదీపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'స్వచ్ఛభారత్ సృష్టిస్తానని మోదీ చెప్తున్నారు. మేమంతా సచ్ భారత్ (నిజాల భారత్)ను కోరుకుంటున్నాం' అని చెప్పారు. మోదీ ఎక్కడికెళ్లినా అబద్ధాలే చెప్తున్నారని, ప్రజలు నిజాలు కోరుకుంటున్నారని అన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నల్లధనాన్ని వెనక్కి తెస్తామని, యువతకు ఉద్యోగాలిస్తామని చెప్పి మాట తప్పారని రాహుల్ పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలనుద్దేశించి.. 'మనం కలిసికట్టుగా పోరాడితే.. వారు ఎక్కడా మిగులరు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. నేరుగా ఎన్నికల్లో గెలువలేమని ఆర్‌ఎస్‌ఎస్‌కు తెలుసు. అందువల్లే ప్రతీ సంస్థలో, ప్రతీ విభాగంలో తన మనుషుల్ని చొప్పిస్తున్నది' అని రాహుల్ ఆరోపించారు. 'అధికారంలోకి రానంతవరకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు జాతీయ జెండాకు వందనం కూడా చేయరు' అని అన్నారు. 'దేశాన్ని మీరు రెండు రకాలుగా చూడొచ్చు. ఈ దేశం నాది అనే భావన ఒకరిదైతే, నేను ఈ దేశానికి చెందినవాడిని అనే భావన మరొకరిది. అదే ఆర్‌ఎస్‌ఎస్‌కూ మనకూ తేడా' అని రాహుల్ వివరించారు.

'సమ్మిళిత సంస్కృతి ప్రమాదంలో పడింది'

సమావేశంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ అన్నివర్గాలు, హిందూ ముస్లింలు ఏకమై బ్రిటిష్‌వారిని కూడా తరిమివేయగలిగాయని, కానీ ప్రస్తుతం ఆ సమ్మిళిత సంస్కృతే ప్రమాదంలో పడిందని చెప్పారు. దేశ విభజన సందర్భంగా అత్యధిక ముస్లింలు ఇక్కడే ఉండిపోయారని, అలాంటి భిన్నసంస్కృతిని దెబ్బతీస్తూ ఇప్పుడు దేశాన్ని 'హిందూరాష్ట్రం'గా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు శరద్ యాదవ్‌కు మద్దతిస్తున్నామని ఏచూరి చెప్పారు. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఇచ్చిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ప్రసారం చేసేందుకు దూరదర్శన్ అభ్యంతరం తెలుపడాన్ని ఏచూరి ఈ సమావేశంలో ప్రస్తావించారు. 2019లో ఇలాంటి ప్రమాదకర శక్తుల్ని ఓడించేందుకు అందరం ఏకమవుదామని కోరారు. ఇక జేడీ(యూ) తిరుగుబాటు నేత, బీజేపీతో పార్టీ జతకట్టడాన్ని వ్యతిరేకించిన శరద్‌యాదవ్ మాట్లాడుతూ 'మనందరం ఏకమైతే హిట్లర్ లాంటోడు కూడా మట్టికరువక తప్పదు' అని అన్నారు. శరద్‌యాదవ్‌దే నిజమైన జేడీ(యూ) అని, మంత్రిపదవిని తిరస్కరించి సెక్యులర్ మార్గాన్ని ఎంచుకున్నారని రాజ్యసభ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ ప్రశంసించారు. 'ఏం చేసైనా ఎన్నికలు గెలువాలన్నదే వారి లక్ష్యం' అంటూ బీజేపీనుద్దేశించి ఆజాద్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాల వ్యవహారాల్లోనూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బలవంతంగా జోక్యం చేసుకుంటున్నదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూఖ్ అబ్దుల్లా విమర్శించారు. కాగా, విపక్షాల సమావేశం కపటనాటకమని బీజేపీ విమర్శించింది. భిన్నత్వం గురించి మాట్లాడుతున్న వారు, కేరళలో సీపీఎం నాయకుల చేతిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు హత్యకు గురవుతుంటే మౌనం ఎందుకు వహిస్తున్నారని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ ప్రశ్నించారు.



957 కోట్ల విరాళం

- జాతీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన మొత్తం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: నాలుగేండ్లలో జాతీయ పార్టీలకు దేశంలోని కార్పొరేట్ సంస్థలు రూ.956.77 కోట్లు విరాళంగా అందజేశాయని అసోసియేషన ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. 2012-13 ఆర్థిక సంవత్సరం నుంచి 2015-16 ఆర్థిక సంవత్సరం వరకు నాలుగేండ్ల కాలంలో రాజకీయ పక్షాలకు మొత్తం రూ1070.68కోట్లు విరాళాల రూపంలో రాగా, అందులో 89శాతం కార్పొరేట్ సంస్థలదేనని తెలిపింది. వీటిలో బీజేపీ అత్యధికంగా 2,987మంది కార్పొరేట్ దాతల నుంచి రూ.705.81 కోట్లు విరాళంగా పొందింది. ఇక కాంగ్రెస్‌కు 167మంది కార్పొరేట్ దాతలు 198.16 కోట్లు విరాళంగా అందించారు. ఎన్నికల సంఘానికి ఆయా పార్టీలు అందజేసిన అఫిడవిట్ల ఆధారంగా ఈ వివరాలు సేకరించామని ఏడీఆర్ సంస్థ స్పష్టంచేసింది. రూ50.73 కోట్లతో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మూడోస్థానంలో, సీపీఎం రూ1.89కోట్లతో నాలుగోస్థానంలో నిలిచింది. సీపీఐ 18లక్షలు విరాళాలను అందుకున్నది. 20వేలకు మించి స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాల వివరాలనే రాజకీయపక్షాలు ఎన్నికల సంఘానికి సమర్పించాయి. దీంతో 20వేలకు లోబడి తక్కువ మొత్తాల్లో వచ్చిన విరాళాల వివరాలేవీ దొరుకలేదని ఏడీఆర్ సంస్థ ప్రకటించింది. అలాగే 2004 నుంచి 2011 మధ్య ఎనిమిది ఏండ్లలో జాతీయ పార్టీలకు 378.89 కోట్లు కార్పొరేట్ దాతల నుంచి విరాళంగా అందాయని, మొత్తం రాజకీయ విరాళాల్లో ఇది 85శాతమని ఏడీఆర్ గత నివేదికల్లో వెల్లడించింది. మైనింగ్, రియల్‌ఎస్టేట్ సంస్థలు, వార్తాపత్రికలు, విద్యుత్ సంస్థలు అధికంగా విరాళాలిస్తున్నాయని ఏడీఆర్ పేర్కొంది.



ఢిల్లీలో గురువారం యువ పారిశ్రామికవేత్తల సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

అవినీతిని కూకటివేళ్లతో పెకిలిస్తాం

- గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల్లో ఇంటర్వ్యూలను రద్దుచేశాం
- యువ పారిశ్రామికవేత్తల సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: వ్యవస్థీకృతమైన అవినీతిని కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సామాన్యుడి సమస్యలను తగ్గించేందుకు ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు. గురువారం ఢిల్లీలో 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్' పేరిట నీతి ఆయోగ్ నిర్వహించిన సమావేశానికి సుమారు 200మంది యువ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. వారినుద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ఉద్యోగాల భర్తీలో దళారీ వ్యవస్థను ప్రోత్సహించవద్దని ప్రభుత్వం భావిస్తున్నదని, గ్రూప్-3, గ్రూప్-4 పోస్టులకు జరిగే ఇంటర్వ్యూలను ఇప్పటికే రద్దు చేశామని చెప్పారు. చిన్న చిన్న ఉద్యోగాల భర్తీలో సర్టిఫికెట్ల స్వీయ ధ్రువీకరణ పద్ధతిని ప్రవేశ పెట్టామని వెల్లడించారు. కొలువుల్లో దళారీ వ్యవస్థను రూపుమాపేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆ దళారులే ఇప్పుడు నిరుద్యోగం పేరుతో నినాదాలు చేస్తున్నారని విమర్శించారు. 'దేశంలో అవినీతి వ్యవస్థీకృతమైంది. ప్రతి వ్యవస్థను తయారు చేయకుండా దానిని నిరోధించలేము' అని మోదీ తెలిపారు. అంతకుముందు సమావేశంలో యువ పారిశ్రామిక వేత్తలు పలు అంశాలపై తమ ఆలోచనలను పంచుకున్నారు. ఇంక్రెడిబుల్ ఇండియా 2.0, విద్య-నైపుణ్యవృద్ధి, ఆరోగ్యం-పోషకాహారం, డిజిటల్ ఇండియా, 2022నాటికి నవభారత్ వంటి అంశాలపై ప్రజెంటేషన్ అందించారు. వీటిని ఆసక్తిగా తెలుసుకున్న ప్రధాని.. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో యువ పారిశ్రామిక వేత్తలు ఇచ్చే వినూత్న ఆలోచనలను ఆయా శాఖలకు పంపుతామని హామీ ఇచ్చారు.

పద్మ అవార్డుల్లో సంస్కరణలు తెచ్చాం

పద్మ అవార్డుల్లో తాము సంస్కరణలు తీసుకువచ్చామని ప్రధాని మోదీ తెలిపారు. అవార్డుల కోసం ఇప్పుడే ఏవ్యక్తి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

జమ్ములో ఇద్దరు ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: జమ్ముకశ్మీర్‌లోని బండిపార జిల్లా గురేజ్ సెక్టార్‌లో గురువారం ఉగ్రవాదులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కుందల్వాన్‌లోని ధుర్ముత్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారంపై బుధవారం సాయంత్రం భద్రతాబలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.

యూపీ ప్రభుత్వ దవాఖానలో దాష్టీకం

- అర్ధరాత్రి గర్భిణీని బయటకు వెళ్లగొట్టిన సిబ్బంది

సహరన్‌పూర్, ఆగస్టు 17: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ దవాఖానలో మరో దారుణం జరిగింది. గోరఖ్‌పూర్‌లోని బీఆర్డీ వైద్యకళాశాలలో ఆక్సిజన్ అందక వారంలో 70 మందికిపైగా చిన్నారులు మృతిచెందిన ఘటన మరువకముందే ఇదేరాష్ట్రంలోని సహరన్‌పూర్ జిల్లాకేంద్ర దవాఖానలో నిండు గర్భిణీని అర్ధరాత్రి వేళ సిబ్బంది బయటకు పంపించేశారు. ఆమె ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్తుండగా మార్గ మధ్యంలో రిక్షాలోనే ప్రసవించింది. ఆగస్టు 14న రాత్రివేళ నొప్పులు రావడంతో మునావర్ అనే గర్భిణీని కుటుంబసభ్యులు ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. అక్కడి సిబ్బంది ఎలాంటి వైద్యపరీక్షలు చేయకుండానే వెళ్లగొట్టారు. బాధితురాలి భర్త జనపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జయ మృతిపై విచారణ

మొదటిపేజీ తరువాయి

వేదనిలయాన్ని ప్రభుత్వ స్మారక కేంద్రంగా మారుస్తామని ఆయన స్పష్టంచేశారు. వేద నిలయం ప్రస్తుతం శశికళ ఆధీనంలోనే ఉన్నందున సీఎం తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అన్నాడీఎంకే లోని చీలిక వర్గాలు ఒక్కటయ్యే ప్రయత్నాలు జోరుగా సాగుతున్న వేళ ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీగా టీటీవీ దినకరన్ నియామకం జరిగిన కొద్దిరోజులకే పళనిస్వామి ప్రభుత్వం జయలలిత మృతిపై విచారణకు నిర్ణయించడం ఆసక్తికరంగా మారింది.

దీర్ఘకాల అనారోగ్యంతో చెన్నై అపోలో దవాఖానలో చికిత్స పొందుతూ జయలలిత గతేడాది డిసెంబర్ 5న ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జయలలిత మరణానంతరం పార్టీలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆమె అత్యంత నమ్మకస్తుడు పన్నీర్ సెల్వం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే అమ్మ మృతితో పార్టీ పగ్గాలు చేపట్టిన ఆమె నెచ్చెలి శశికళ.. పన్నీర్‌ను తప్పించి తాను సీఎం కావాలని ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పార్టీ రెండుగా చీలిపోయింది. అయితే అక్రమాస్తుల కేసులో శశికళ దోషిగా తేలడంతో ఆమె సీఎం ఆశలు గల్లంతయ్యాయి. దీంతో పళనిస్వామిని సీఎంను చేసి శశికళ జైలుకెళ్లారు. అయితే పార్టీ నుంచి వీడిపోయిన పన్నీర్ సెల్వం.. జయలలిత మృతిపై తనకు అనుమానాలున్నాయని ఆరోపించారు. చనిపోవడానికి కొద్దిరోజుల ముందు దవాఖానలో ఉండగా, జయలలితను చూసేందుకు అప్పటి ముఖ్యమంత్రినైన తనతో సహా ఎవరినీ అనుమతించకపోవడంతో తమ అనుమానాలు బలపడ్డాయని ఆయన చెప్పున్నారు. జయలలిత మృతిపై జ్యుడీషియల్ విచారణకు పన్నీర్ వర్గం డిమాండ్ చేస్తూ వచ్చింది. దీనిని శశికళ వర్గం మొదటి నుంచీ వ్యతిరేకించింది. విచారణ జరిపితే ముందు అప్పటి ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంనే తొలుత ప్రశ్నించాల్సి ఉంటుందని ఎదురుదాడికి దిగింది. ఇటీవల అనేక నాటకీయ పరిణామాల అనంతరం అన్నాడీఎంకేలో ఓపీఎస్ (ఓ పన్నీర్‌సెల్వం), ఈపీఎస్ (ఎడప్పాడి పళనిస్వామి) వర్గాల మధ్య మళ్లీ విలీనం దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మ మృతిపై విచారణ జరిపించాలని, శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలని పన్నీర్ వర్గం ప్రధాన షరతులు విధించింది. అయితే జయలలిత మృతిపై జ్యుడీషియల్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీఎం పళనిస్వామి తీసుకున్న తాజా నిర్ణయంతో చీలిక గ్రూపులు ఒక్కటయ్యేందుకు కీలకఅడుగు పడినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



సత్యనాదెళ్ల



డొనాల్డ్ ట్రంప్

- ట్రంప్ వైఖరిని ఖండించిన సత్యనాదెళ్ల, జుకర్‌బర్గ్
- శ్వేతజాతి ఉన్మాదాన్ని వ్యతిరేకిస్తూ ఐదుగురు సీనియర్ సైన్యాధికారుల బహిరంగ వ్యాఖ్యలు
- నిరసన వెల్లువెత్తుతున్నా మారని ట్రంప్
- రెండు వ్యాపార మండళ్లను రద్దు చేస్తూ నిర్ణయం

జాత్యహంకారానికి అమెరికాలో చోటులేదు

న్యూయార్క్, ఆగస్టు 17: శ్వేతజాతి దురహంకారానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తం చేస్తున్న పరోక్ష మద్దతుపై ఆ దేశంలో నిరసన రోజురోజుకీ పెరుగుతున్నది. తాజాగా ఈ జాబితాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్, సోషల్ నెట్‌వర్కింగ్ సంస్థలు మైక్రోసాఫ్ట్, యాపిల్, ఫేస్‌బుక్‌ల సీఈఓలు జత కలిశారు. గత వారం వర్జీనియాలోని చార్లొట్స్‌విల్లెలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వారిపైకి కారు దూసుకురావటం, ఆ ఘటనలో ఒక మహిళ మరణించటాన్ని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల గురువారం తీవ్రంగా ఖండించారు. భయానకమైన ఘటనగా దానిని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు తమ సంస్థ ఉద్యోగులకు ఒక నోట్ పంపారు. 'వర్జీనియాలో ఇటీవల శ్వేతజాతీయులు రెచ్చగొట్టిన పక్షపాతానికి, అంధవిశ్వాసాలకు, విచక్షణారహిత హింసకు మన సమాజంలో తావు లేదు. వైవిధ్యతకు మైక్రోసాఫ్ట్ అత్యంత విలువనిస్తుంది. ఈ సమయంలో ప్రజలతో మనం కలిసి ఉండాల్సిన అవసరం ఉంది. అందరికీ అవకాశాలను కల్పించే, గౌరవాన్ని ఇచ్చే, అందరిపట్లా సానుభూతిని చూపే సమున్నత సమాజాన్ని నిర్మించటానికి సమిష్టిగా పని చేద్దాం' అని చెప్పారు. ట్రంప్ తీరును యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ కూడా ఖండించారు. ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో 'శ్వేతజాతి దురహంకారులను, వారిని వ్యతిరేకిస్తూ మానవ హక్కుల కోసం పోరాడేవారిని ఒకే గాటన కట్టాలన్న అధ్యక్షుడి అభిప్రాయంతో నేను విభేదిస్తున్నా' అని పేర్కొన్నారు. ఫేస్‌బుక్ సీఈఓ మార్క్‌జుకెర్‌బర్గ్ కూడా.. తన అభిప్రాయాల్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. 'మన (ఫేస్‌బుక్) వేదికలో విద్వేషానికి స్థానం లేదు. కాబట్టే, ద్వేషపూరితమైన నేరాలను, ఉగ్రవాద చర్యలను ప్రోత్సహించే పోస్టులకు ఫేస్‌బుక్‌లో స్థానం కల్పించటం లేదు. ప్రతిఒక్కరూ సురక్షితంగా భావించే వేదికగా ఫేస్‌బుక్‌ను నిలుపటానికి జరుగుతున్న కృషిని కొనసాగిస్తాం' అని చెప్పారు. ట్రంప్ వైఖరిని అమెరికా మాజీ అధ్యక్షులు తండ్రీ కొడుకులు జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్, జార్జ్ డబ్ల్యూ బుష్ కూడా ఒక ప్రకటనలో ఖండించారు. 'జాతిపరమైన అంధవిశ్వాసాలను, వివక్షను, విద్వేషాన్ని అమెరికా ఎల్లప్పుడూ తిరస్కరిస్తూ ఉండాలి' అని పిలుపునిచ్చారు.

మారని ట్రంప్ ధోరణి

తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతున్నా కూడా ట్రంప్ తన ధోరణిని మార్చుకోవటం లేదు. రెండు వ్యాపార సలహా మండళ్లను ఆయన రద్దు చేశారు. వీటిలో 'స్ట్రాటెజిక్ అండ్ పాలసీ ఫోరం', 'వైట్‌హౌస్ మాన్యుఫాక్చరింగ్ జాబ్స్ ఇన్షియేటివ్' ఉన్నాయి. ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ ఈ మండలుల నుంచి ఇంద్రానూయి (పెప్సీ), మేరీ బారా (జనరల్ మోటార్స్) తదితర ప్రముఖ వ్యాపారసంస్థల అధిపతులు రాజీనామా చేసిన నేపథ్యంలో, వీటిని పూర్తిగా రద్దు చేయాలని ట్రంప్ నిర్ణయించారు.

ఈ ధోరణిని సైన్యం సహించదు

అమెరికాలో పెరుగుతున్న శ్వేతజాతి దురంహకారాన్ని అమెరికా సైన్యానికి చెందిన ఐదుగురు అత్యంత సీనియర్ అధికారులు ఖండించారు. 'అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్'కు చెందిన జనరల్ రాబర్ట్ నెల్లర్ (కమాండెంట్ ఆఫ్ అమెరికా మెరైన్‌కార్ప్స్), అడ్మిరల్ జాన్ రిచర్డ్‌సన్ (చీఫ్ ఆఫ్ నావల్ ఆపరేషన్స్), జనరల్ మార్క్ మిల్లే (చీఫ్ ఆఫ్ ది స్టాఫ్ ఆఫ్ ది ఆర్మీ), జనరల్ డేవ్ గోల్డ్‌ఫీన్ (ఎయిర్‌ఫోర్స్), జోసెఫ్ లెంగ్యెల్ (నేషనల్ డార్డ్ బ్యూరో అధిపతి) శ్వేతజాతీయుల చర్యలను వ్యతిరేకిస్తూ బహిరంగంగా వ్యాఖ్యానించారు. దేశంలో జాతివివక్ష, తీవ్రవాదం వంటివి పెరుగటం 1775 నుంచీ అమెరికా పాటిస్తున్న విలువలకు వ్యతిరేకమని, దీనిని అమెరికా సైన్యం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించదని పేర్కొన్నారు. ఈ విధంగా సైన్యానికి చెందిన అత్యంత సీనియర్ అధికారులు అధ్యక్షుడి వైఖరిపై స్పష్టంగా వ్యతిరేకతను ప్రదర్శించటం అమెరికా చరిత్రలోనే అరుదైన విషయం.

బార్సిలోనాలో ఉగ్రదాడి

మొదటిపేజీ తరువాయి

దుండగుల కాల్పుల్లో 11మంది చనిపోయినట్లు తెలిసింది. ఉగ్రవాదులు ప్రస్తుతం అందులోనే ఉండగా, పోలీసులు బార్‌ను చుట్టుముట్టారు. కాల్పులు కొనసాగుతున్నాయి. 2004 తర్వాత స్పెయిన్‌లో ఉగ్రవాదుల దాడులేవీ జరుగలేదు. 2004 మార్చ్ నెలలో జిహాదీలు మాడ్రిడ్‌లోని ఓ లోకల్ రైలుపై జరిపిన బాంబుదాడిలో 191మంది ప్రాణాలు కోల్పోయారు. 2015లో ఓ వ్యక్తి లాస్ రాంబ్లాస్ వీధిలోనే కాల్పులు జరుపగా ఒకరు మృతిచెందారు. అతడిని పట్టుకునే క్రమంలో మరొకరు చనిపోయారు. అయితే, ఆ కాల్పుల ఘటన వెనుక ఉగ్రవాదుల హస్తమేదీ లేదని పోలీసులు తేల్చారు. ఇటీవలి కాలంలో ఫ్రాన్స్, బెల్జియం, బ్రిటన్, జర్మనీ దేశాల్లో ఉగ్రవాదులు వాహనాలతో దాడులకు దిగగా, తాజాగా బార్సిలోనాలో జరిగింది కూడా అలాంటి ఘటనే కావచ్చునని పోలీసులు భావిస్తున్నారు. వ్యాన్ దూసుకెళ్లిన ఘటనకు సంబంధించి మాడ్రిడ్ భద్రతాధికారులతో తాను మాట్లాడానని స్పెయిన్ ప్రధానమంత్రి మరియానో రజోయ్ తెలిపారు. క్షతగాత్రులకు అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలెవరూ నగరంలోని ప్లాసా కేటలున్యా ప్రాంతం వైపు వెళ్లవద్దని, సమీపంలోని మెట్రో స్టేషన్లను మూసివేశామని ఎమర్జెన్సీ సేవల విభాగం ప్రకటించింది.

డ్రాగన్ యుద్ధభాష

మొదటిపేజీ తరువాయి

చైనా తరలిస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

అంతర్జాతీయంగా దుష్ప్రచారం



చైనా రూపొందించిన వీడియోలో సిక్కు పాత్రధారి

ఓ వైపు యుద్ధసన్నాహాలు చేస్తున్న చైనా మరోవైపు, భారత్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టే కుటిలయత్నాలను కూడా పెద్దఎత్తున చేస్తున్నది. దీంట్లోభాగంగా, ఆ దేశ అధికారిక వార్తాసంస్థ సిన్హువా.. మూడు నిమిషాల నిడివి గల ఒక ఇంగ్లిష్ వీడియోను ట్విట్టర్, యూట్యూబ్ తదితర ఆన్‌లైన్ వేదికల్లో పెట్టింది. భారత్ ఏడు పాపాలకు పాల్పడిందని పేర్కొంటూ ఈ వీడియోకు 'సెవెన్ సిన్స్ ఆఫ్ ఇండియా' అని పేరు పెట్టింది. దురాక్రమణకు పాల్పడటం, బాధితులపైనే నింద మోపటం, పొరుగున ఉన్న చిన్నప్రాంతాన్ని (భూటాన్‌ను) హైజాక్ చేయటం, తెలిసీ తప్పు చేయటమేగాక దానిని సమర్థించుకోవటం వంటి 'పాపాలకు' భారత్ పాల్పడిందని ఈ వీడియోలో పేర్కొన్నారు. వీడియోలో వ్యాఖ్యాతగా వ్యవహరించిన డీర్‌వాంగ్ అనే మహిళ ఒక్కో పాపాన్ని పేర్కొంటూ, భారత్‌ను ఎద్దేవా చేస్తూ మాట్లాడారు. అంతేకాదు, ఈ వీడియోలో భారతీయ సిక్కు వ్యక్తి వేషధారణతో గడ్డం, మీసం, తలపాగా, నల్లకళ్లద్దాలు ధరించిన ఓ వ్యక్తి కూడా కనిపిస్తాడు. అతడు భారతీయ యాసలో ఇంగ్లిష్ మాట్లాడుతూ.. ప్రేక్షకుల్ని నవ్వించే బఫూన్‌లాగా వ్యవహరిస్తాడు. వ్యాఖ్యాత అతడితో 'నీ ఇంట్లోకి దొంగతనానికి వచ్చిన దొంగతో నువ్వు చర్చలు జరుపుతావా? పోలీసులను పిలుస్తావా? లేక తన్ని తరిమేస్తావా?' అని అడుగుతారు. దీనికి సిక్కు వేషధారి.. 'పోలీసుల్ని పిలువటం ఎందుకు? మనం ఆటాడుకుందాం?' అని బదులిస్తారు. డీర్‌వాంగ్ స్పందిస్తూ.. 'నాతో ఆడుకోవాలనుంటే ముందు నా ఇంట్లోంచి బయటికి వెళ్లు' అని చెప్తారు. ఈ విధంగా భారత్ తమదేశంలోకి ఒక దొంగలాగా చొరబడుటమేగాక చర్చలు జరుపుదామంటూ నాటకాలు ఆడుతున్నదనే అభిప్రాయం ఈ వీడియో కలిగిస్తుంది. అంతేకాకుండా, భూటాన్‌ను భారత్ భయపెట్టి తన నియంత్రణలో ఉంచుకుంటున్నదనే అర్థం వచ్చేవిధంగా, భూటాన్‌కు చెందిన ఓ వ్యక్తిని సిక్కువ్యక్తి తనవద్ద ఉన్న కత్తెరతో బెదిరిస్తున్నట్టి వీడియోలో చిత్రీకరించారు.

విశ్లేషకుల ఆందోళన

చైనా-భారత్ సంబంధాలు రోజురోజుకీ దిగజారటంపై అంతర్జాతీయంగా కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికే అమెరికా-ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉండగా, తాజాగా, ఆసియాలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా-భారత్ ఘర్షణపడటం ప్రపంచ ఆర్థికరంగానికి మంచిది కాదని వారు పేర్కొంటున్నారు. మరీముఖ్యంగా, రెండు దేశాలూ అణ్వాయుధ సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో, డోక్లామ్ ఘర్షణ ఎటు పోయి ఎటువైపునకు దారితీస్తుందో అన్న ఆందోళన పెరుగుతున్నది.

వివాదం ఎక్కడ మొదలయ్యింది?

భారత్, చైనా, భూటాన్- ఈ మూడు దేశాల మధ్యన డోక్లామ్ ప్రాంతం ఉన్నది. ఆ ప్రాంతం తమదేనని భూటాన్ వాదన. దీనికి సంబంధించి చైనా-భూటాన్‌ల మధ్య చాలాకాలంగా వివాదం ఉంది. భూటాన్ నిరసనను పట్టించుకోకుండా, చైనా ఏకపక్షంగా డోక్లామ్‌లోకి రోడ్డు మార్గాన్ని నిర్మించటానికి జూన్‌లో ప్రయత్నాలు ప్రారంభించింది. భూటాన్‌కు మద్దతుగా భారత్.. చైనా ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించింది. డోక్లామ్‌లో చైనా రోడ్డును నిర్మించటం భూటాన్‌కేగాక తమ దేశ ప్రయోజనాలకు కూడా భంగకరమని భారత్ పేర్కొంది. కానీ, చైనా వినకపోవటంతో సైనికులను తరలించి అక్కడ మోహరించింది. దీనికి పోటీగా చైనా కూడా సైనికదళాల మోహరింపును పెంచింది. ప్రతిష్టంభన పెరిగిన దశలో.. ఇరు పక్షాల సైనికులను ఉపసంహరించుకొని చర్చలు జరుపుదామని భారత్ ప్రతిపాదించింది. చైనా మాత్రం.. తమ సైన్యాన్ని విరమించేది లేదని, భారతే వెనుకకు తగ్గాలని ఏకపక్షంగా మాట్లాడుతూ, యుద్ధవాతావరణాన్ని సృష్టిస్తున్నది.



షీ టీమ్స్‌కు 159 బైక్‌లు

కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కింద హీరో మోటర్ కార్ప్స్ సంస్థ షీటీమ్స్ సిబ్బందికి 159 బైక్‌లను గురువారం అందించింది. హైదరాబాద్ మారియట్ కన్‌వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో మోటర్ కార్ప్స్ సీఐవో అండ్ హెడ్ విజయ్ సేథ్ వీటిని అందజేశారు. పోలీసు పెట్రోలింగ్ సిగ్నల్ లైట్స్, సైరన్‌లు, ఆడియో సిస్టమ్(లౌడ్ స్పీకర్)ను ప్రత్యేకంగా అమర్చిన ఈ బైక్‌లను హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు మహేందర్‌రెడ్డి, సందీప్‌శాండిల్య, మహేశ్ భగవత్, హైదరాబాద్ అదనపు సీపీ స్వాతి లక్రా జెండా ఊపి ప్రారంభించారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా పోలీసులతో భాగస్వామ్యమవుతుండడం హర్షణీయమని సీపీలు హీరో సంస్థను అభినందించారు.

నగరంలో తగ్గిన రోడ్డు ప్రమాద మరణాలు

వాహనదారులు, ప్రజలకు హైదరాబాద్ సీపీ అభినందనలు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'వాహనదారుల్లో మార్పు వచ్చింది. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్నారు. దీంతో గతేడాదితో పోల్చితే హైదరాబాద్ నగరంలో ఏడు నెలల్లో 73 మరణాలు తగ్గాయి. గతేడాది ఇదే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను విశ్లేషించినప్పుడు 73 రోడ్డు ప్రమాద మరణాలు తగ్గినట్టు తేలింది. ఇది శుభపరిణామం' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని హోటల్ మారియట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాలను వివరించారు. ఇది కేవలం ప్రజలు, వాహనదారుల భాగస్వామ్యంతోనే సాధ్యమైందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెరుగడంతో చాలా మంది వాహనాదారులు తెల్లవారుజామున 3 గం టలకు కూడా ట్రాఫిక్ సిగ్నల్స్‌లో రెడ్ లైట్ పడినప్పుడు ఆగిపోతుండడం తమకు సంతృప్తిని కలిగిస్తున్నదన్నారు. ఈ విధంగా వారిలో పెరిగిన అవగాహన వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయని వివరించారు. మరో వైపు కొత్తగా పెనాల్టీ పాయింట్లు ప్రారంభమైనప్పటి నుంచి వాహనదారులు హెల్మెట్ ధరించడం పెరిగిందన్నారు. ఈ విధంగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకపాత్ర పోషిస్తున్నందుకు వాహనదారులకు సీపీ అభినందనలు తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే జీరో యాక్సిడెంట్ సిటీని సాధించడం కష్టమేమీ కాదని సీపీ పేర్కొన్నారు.

రూ.1.13 కోట్ల రద్దయిన నోట్లు స్వాధీనం

■ ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అరెస్ట్



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రద్దయిన నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను గురువారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.13 కోట్ల రద్దయిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని కాచపురం ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మంజుల జోషి తన పిల్లల చదువుకోసం 2013లో కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వలస వచ్చింది. కుమారుడి ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఆమె తమ నివాసాన్ని విశాఖపట్నంకు మార్చింది. మంజుల జోషి గతేడాది నవంబర్ నుంచి పాత నోట్లను తనకు తెలిసిన ఏజెంట్ల ద్వారా మారస్తూ భారీగా డబ్బును సంపాదించింది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలిసిన వారి నుంచి 50 శాతం కమీషన్‌పై సేకరించిన రూ.1.13 కోట్ల పాత నోట్లను మార్చేందుకు హైదరాబాద్‌లో ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారి శంకర్‌గుప్తాను సంప్రదించింది. అతనికి 30 శాతం కమీషన్ కింద బేరం మాట్లాడుకుంది. దీంతో మంజుల జోషి తన వద్ద రద్దయిన నోట్లతో వచ్చి సోమాజిగూడ షాన్‌బాగ్ హోటల్‌లోని రూం నంబర్ 101లో బస చేసింది. సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి మంజులతోపాటు శంకర్‌గుప్తాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రద్దయిన కరెన్సీతోపాటు రూ.4.36 లక్షలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఈ ఇద్దరినీ పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు.

రూ.57 లక్షల విదేశీ కరెన్సీ సీజ్

■ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ విస్తృత తనిఖీలు

శంషాబాద్: ఓ ప్రయాణికుడు భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని అక్రమంగా తరలిస్తుండగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ(డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు ఎమిరేట్స్ విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో డీఆర్ఐ అధికారులు అతడిని తనిఖీ చేశారు. అతని వద్ద 57 లక్షల విదేశీ కరెన్సీ(ఇండియన్ కరెన్సీ) ఉన్నట్టు గుర్తించారు. కరెన్సీకి సంబంధించి అతనివద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కరెన్సీని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.






నిందితుడు యాదయ్య, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి విక్రేత అరెస్ట్

హయత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని నుంచి సుమారు 880 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఒంగూరు మండలం తుర్కపల్లి చారకొండకు చెందిన కట్ట యాదయ్య బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో ఉంటూ వంట మనిషిగా పని చేస్తున్నాడు. మూడేండ్లుగా నార్కట్‌పల్లికి చెందిన పసూల కృష్ణ వద్ద గంజాయి తెచ్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. తాను ఉంటున్న పరిసర గ్రామాల్లో యువకులను టార్గెట్ చేసుకొని తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కుంట్లూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని నుంచి సుమారు 880 గ్రామల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



పిండి గిర్నీపై దాడి చేసి నిందితుడు జాఫర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చార్మినార్/చాదర్‌ఘాట్: పేదలకు చెందాల్సిన బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలించడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని సివిల్ సప్లై అధికారులు, రెయిన్ బజార్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చావునీ ప్రాంతంలో పిండి గిర్నీ నిర్వహించే జాఫర్ అలియాస్ సలీం(38) స్థానికంగా పలువురి నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. వాటిని తాను నిర్వహించే గిర్నీ గోదాములో భద్రపర్చి ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లై అధికారులు రెయిన్‌బజార్ పోలీసుల సహకారంతో గోదాముపై దాడి చేశారు. 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఢిల్లీ యువతిపై లైంగికదాడి


బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: సైట్ సీయింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఢిల్లీ యువతిపై నలుగురు యువకులు లైంగికదాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఢిల్లీకి చెందిన యువతి(20) సైట్ సీయింగ్ కోసం ఈ నెల 5న మరో ఇద్దరు స్నేహితులతో కలిసి నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఓ గెస్ట్ హౌస్‌లో వేర్వేరు గదుల్లో దిగారు. ఈ నెల 15న ఆమె ఉన్న గది వద్దకు నలుగురు గుర్తుతెలియని యువకులు వచ్చి అసభ్యంగా ప్రవర్తించారు. తమ గదికి రావాలంటూ ఒత్తిడి చేశారు. వారి నుంచి తప్పించుకొని ఆమె తిరిగి గదిలోకి వెళ్లిపోయింది. మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఓ యువకుడు రూం సర్వీస్ అంటూ యువతి గదిలోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గెస్ట్‌హౌస్ వద్ద సీసీ కెమెరా ఫుటేజీలను స్వాధీనం చేసుకొని వాటి ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

బాలానగర్ ఫ్లైఓవర్‌కు లైన్ క్లియర్

21న శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్.. రూ.387 కోట్లతో 1.32 కిలోమీటర్లు, ఆరు లేన్లతో నిర్మాణం

భూసేకరణకు రూ.282.47 కోట్లు, ఫ్లైఓవర్‌కు రూ.104.53 కోట్లు.. నర్సాపూర్, ఫతేనగర్ జంక్షన్లలో ట్రాఫిక్‌కు విముక్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:



స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్‌ఆర్‌డీపీ)లో భాగంగా బాలానగర్ ఫ్లైవర్ నిర్మాణ పనులకు లైన్ క్లియర్ అయింది. ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారక రామారావు ఫ్లైవర్ నిర్మాణ పనులకు ఈ నెల 21న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు చేస్తున్నది. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చుతూ ప్రభుత్వం ఎస్‌ఆర్‌డీపీ ద్వారా నగరం నలుమూలలా భారీ ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రూ.387కోట్లతో బాలానగర్‌లోని విమల్ థియేటర్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు 1.32 కిలోమీటర్ల మేర పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. భూసేకరణకు రూ.282.47 కోట్లు, ఆరు లేన్లతో చేపట్టే ఫ్లైవర్ నిర్మాణానికి రూ.104.53 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనాతో టెండర్లు ఆహ్వానించారు. 0.6 శాతం తక్కువకు కోట్ చేసిన బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు అధికారులు ఈ పనులు అప్పగించారు. ఈ మేరకు ఫ్లైవర్ నిర్మాణ పనులను ఈ నెల 21 తర్వాత మొదలు పెట్టి 24 నెలల్లోగా పూర్తి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఒక పక్క ఫ్లైవర్ నిర్మాణ పనులు పట్టాలెక్కుతుండగా, మరో పక్క భూ సేకరణ ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు.

జంక్షన్లలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

సాధారణంగా కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి సికింద్రాబాద్, మెదక్ జిల్లా వైపు వెళ్లే వారు అధికంగా ఉంటారు. అలాగే సనత్‌నగర్, ఫత్తేనగర్ నుంచి జీడిమెట్ల, కూకట్‌పల్లి వైపు అధికంగా వెళ్తుంటారు. ప్రధానంగా ఈ రెండు మార్గాల నుంచి వచ్చే వాహనాలతో నర్సాపూర్, ఫత్తేనగర్ జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ కొద్ది పాటి దూరాన్ని అధిగమించాలంటే వాహనదారులకు కత్తిమీద సామే. ఉదయం, సాయంత్రం సమయాల్లో దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో నరకయాతన అనుభవించక తప్పదు. ఈ భారీ ఫ్లైవర్ నిర్మాణ ప్రతిపాదన దశలో ఈ రెండు జంక్షన్లలో వాహనాలపై ప్యాసింజర్ కారు యూనిట్ (పీసీయూ)గా నిర్ధారించి అధ్యయనం చేశారు. నర్సాపూర్ జంక్షన్‌లో ఉదయం పూట 10,171 పీసీయూలు, సాయంత్రం పూట 11,924 పీసీయూలుగా, ఫత్తేనగర్ జంక్షన్‌లో ఉదయం 9,957 పీసీయూ, సాయంత్రం 11,530 పీసీయూగా ఉన్నట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ఫ్లైవర్ నిర్మిస్తే ఈ రెండు జంక్షన్లను ట్రాఫిక్ రద్దీ నుంచి విముక్తి కల్పించవచ్చని ప్రతిపాదనలో హెచ్‌ఎండీఏకు వివరించారు. ఈ ఫ్లైవర్ నిర్మాణంతో రెండేండ్లలో ఈ రెండు జంక్షన్లు ట్రాఫిక్ జామ్ నుంచి విముక్తి పొందే అవకాశం ఉన్నది.

వర్సిటీలలో న్యాక్ బృందం పర్యటన

ఓయూ, జేఎన్‌టీయూహెచ్‌లో అన్ని విభాగాల సందర్శన



జేఎన్‌టీయూహెచ్‌లోని ఐఎస్‌టీ భవనంలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న న్యాక్ బృందం సభ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ/కేపీహెచ్‌బీ కాలనీ: దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడింగ్ ఇచ్చే న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూహెచ్‌ను సందర్శించింది. న్యాక్ బృందం సభ్యులు మూడు రోజుల పాటు ఈ రెండు యూనివర్సిటీలలోని అన్ని అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించనున్నది. ఓయూను సందర్శించిన న్యాక్ బృందంలో ప్రొఫెసర్ ఎస్‌కే సింగ్, ప్రొఫెసర్ డీఆర్ భాస్కర్, ప్రొఫెసర్ కనికాశర్మ, ప్రొఫెసర్ శైలేంద్ర సరాఫ్, ప్రొఫెసర్ విజేందర్‌కుమార్, ప్రొఫెసర్ జయప్రసాద్, ప్రొఫెసర్ హెచ్ రాజశేఖర్, ప్రొఫెసర్ సతీందర్‌సింగ్, ప్రొఫెసర్ ఏవీ సింగ్ మద్నావత్ ఉన్నారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం వర్సిటీకి సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు. తర్వాత వీరు మూడు బృందాలుగా విడిపోయి వివిధ కళాశాలలు, డిపార్ట్‌మెంట్లు తిరిగారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, అఫిలియేటెడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సమావేశమయ్యారు. సాయంత్రం పీజీఆర్‌ఆర్‌సీడీఈలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనను తిలకించారు. జేఎన్‌టీయూహెచ్‌లో న్యాక్ బృందం చైర్మన్ జీడీ యాదవ్, ఎస్‌కే జైన్, సంజయ్ సింగ్, ఎంఎస్ సుభాష్, బిద్యుత్ బరన్ చందూరి, ఎస్‌కే సింగ్ పర్యటించారు. జేఎన్‌టీయూహెచ్‌లోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాల అధిపతులతో చర్చించి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీసీ వేణుగోపాలరెడ్డి, రెక్టార్ ఎన్‌వీ రమణారావు, రిజిస్ట్రార్ యాదయ్య, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో మక్కామసీదుకు మరమ్మతులు

■ 4.61 కోట్లకు టెండర్ దక్కించుకున్న లక్ష్మీ హెరికం కంపెనీ

■ పనులపై సమీక్షించిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రాజధానిలోని చారిత్రాత్మక మక్కా మసీదు అభివృద్ధి పనులు సెప్టెంబర్‌లో ప్రారంభమవుతాయని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ చెప్పారు. మసీదు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్‌ను రూ.4.61 కోట్లకు లక్ష్మీహెరికం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకున్నట్టు ఆయన తెలిపారు. అంతకుముందు సచివాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ మక్కామసీదు అభివృద్ధి పనులపై ఉమర్ జలీల్, మైనారిటీ సంక్షేమశాఖ, పురావస్తుశాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మక్కామసీదు మరమ్మతులు, పూర్వవైభవం తీసుకురావడానికి రూ.8.48 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం వానలు పడుతున్నాయని, వచ్చేనెలలో పనులు ప్రారంభిస్తామని, మక్కామసీదుకు పూర్వ వైభవం తీసుకొస్తామని అధికారులు తెలిపారు. మక్కామసీదు ప్రాచీన కట్టడంగా గుర్తింపు పొందడంతో పురావస్తుశాఖ సమక్షంలో ఈ అభివృద్ధి పనులు జరుగనున్నాయి.

మెట్రోరైలుతో ఆర్టీసీకి ఇబ్బందేమీ లేదు

■ మెట్రోకు అనుసంధానంగా బస్సులు నడుపుతాం

■ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ పురుషోత్తం నాయక్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నవంబర్‌లో ప్రారంభం కానున్న మెట్రోరైలు ఆపరేషన్స్ ప్రభావం నగర ఆర్టీసీపై పెద్దగా ఉండబోదని ఐటీ అండ్ గ్రేటర్ ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రవాణారంగంలో అపార అనుభవమున్న ఆర్టీసీ.. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులను నడుపుతుందని చెప్పారు. మెట్రోరైలు ఆపరేషన్స్ నేపథ్యంలో తాము ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. మియాపూర్ నుంచి అమీర్‌పేట్, అమీర్‌పేట్ నుంచి నాగోల్ మధ్యలో ఉన్న స్టేషన్లకు అనుసంధానంగా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. సమాంతరంగా లేదా అనుబంధంగా బస్సులు తిప్పే విషయాన్ని ఆలోచిస్తున్నామన్నారు. మెట్రో స్టేషన్ల నుంచి 5 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలనీలకు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటామన్నారు. ఎల్బీనగర్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతిరోజూ 760 బస్సులను నడుపుతున్నామని, మెట్రోరైలు ఆపరేషన్స్ మొదలయ్యాక వీటిని తగ్గించే ఉద్దేశం లేదన్నారు. నాగోల్ నుంచి మియాపూర్ వరకు నేరుగా బస్సు కనెక్టివిటీ లేదన్నారు. కేవలం 5 నుంచి 8 బస్సులు మాత్రమే ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్‌కు నడుస్తున్నాయన్నారు. వీటితోపాటు ఎల్బీనగర్-సికింద్రాబాద్, ఉప్పల్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-యూసుఫ్‌గూడ, బోరబండ తదితర ప్రాంతాలకు మాత్రమే బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. మియాపూర్ నుంచి 940 బస్సులను వివిధ ప్రాంతాలకు నడుపుతున్నామన్నారు. మియాపూర్- అమీర్‌పేట్ మెట్రో ఆపరేషన్స్ ప్రభావం పెద్దగా ఉండదని తెలిపారు. మియాపూర్ నుంచి అమీర్‌పేట్, నాంపల్లి, కోఠి, మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు ప్రయాణికులు ప్రయాణిస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల పార్కింగ్ విషయం మెట్రోరైలు అధికారులతో చర్చలు ఇంకా పూర్తికాలేదన్నారు.

నవంబర్ 28 నుంచి గ్లోబల్ సమ్మిట్

■ హైదరాబాద్‌కు రానున్న 160 దేశాల ప్రతినిధులు

■ భారత ప్రతినిధుల ఎంపికపై కసరత్తు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు(గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్)ను హైదరాబాద్‌లో ఈ ఏడాది నవంబర్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్‌కు చెందిన 400 మంది, అమెరికా నుంచి 400 మంది, ఇతర దేశాల నుంచి మరో 400 మందితో కలిపి 160 దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారు. వీరిలో 300 మందికిపైగా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఉంటారు. 'మహిళలకు ప్రథమ ప్రాధాన్యం-అందరికీ సౌభాగ్యం' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తారు. ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, అమెరికా ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ కూడా హాజరవుతారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ, విదేశీ వ్యవహారాలశాఖ, నీతి ఆయోగ్ సంయుక్తంగా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. సదస్సుకు మన దేశం తరపున హాజరయ్యే ప్రతినిధుల ఎంపికపై కసరత్తు జరుగుతున్నదని కేంద్రప్రభుత్వంలోని ఒక ఉన్నతస్థాయి అధికారి తెలిపారు. స్టార్టప్ కంపెనీలపై ఆసక్తి చూపే పారిశ్రామికవేత్తలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గతేడాది జూన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో తదుపరి ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సును భారతదేశంలో నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని రకాల మౌలికసౌకర్యాలతోపాటు ఐటీ రంగంలో ప్రధాన గుర్తింపు ఉన్న హైదరాబాద్‌ను కేంద్రం వేదికగా ఎంపిక చేసిందని ఆ అధికారి వివరించారు. ఇంధనం-మౌలిక సౌకర్యాలు, ఆరోగ్యం -జీవ శాస్త్రాలు, ఆర్థికరంగంలో సాంకేతిక పరిజ్ఞానం-డిజిటల్ ఎకానమీ, మీడియా-వినోదం అనే నాలుగు అంశాలపై ప్రధాన చర్చ ఉంటుందని చెప్పా రు. తొలి గ్లోబల్ సమ్మిట్ 2010లో అమెరికాలో జరిగింది. తర్వాత కెన్యా, మొరాకో, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మలేషియా తదితర దేశాల్లో సదస్సులు జరిగాయి. ఇప్పుడు మన దేశానికి ఆ అవకాశం వచ్చింది. ఈ సదస్సు ఏర్పాట్లను పరిశీలించడానికి సెప్టెంబర్‌లోనే అమెరికా నుంచి ఒక బృందం వస్తుందని సమాచారం.

'లోధా బెలిజ' బిల్డర్ మోసం చేశాడు

■ అపార్ట్‌మెంట్‌లో కనీస వసతులు లేవు

■ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సినీహీరో జగపతిబాబు ఆవేదన



లోధా బెలి జ అపార్ట్‌మెంట్‌లో విలేకరులతో మాట్లాడుతున్న జగపతిబాబు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని లోధా బెలిజ అపార్ట్‌మెంట్‌లో రూ.కోట్లు వెచ్చించి ఫ్లాట్లను కొనుగోలు చేశామని, బిల్డర్ కనీస వసతులు కల్పించకుండా మోసం చేశాడని సినీహీరో జగపతిబాబు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసోసియేషన్ సభ్యులు గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ పిచోర, సెక్రటరీ కల్యాణ్‌రెడ్డి, సినీహీరో జగపతిబాబు తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు. కేపీహెచ్‌బీకాలనీలోని విశాలమైన స్థలంలో భారీ భవనసముదాయాన్ని నిర్మించి ఇస్తామని బిల్డర్ చెప్పారన్నారు. 13 ఎకరాల్లో 560 ఫ్లాట్లను మాత్రమే నిర్మిస్తామని చెప్పారని, దీంతో రూ.2.5 నుంచి రూ.3 కోట్ల వరకు డబ్బులు చెల్లించి ఫ్లాట్లు కొన్నామని తెలిపారు. 32 అంతస్థుల ఎనిమిది ట్విన్ టవర్లు, ఒక్కో ఫ్లాట్ 4,760 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించి ఇవ్వాల్సి ఉన్నదని చెప్పారు. 2010లో సేల్ అగ్రిమెంట్ చేసుకుని ఫ్లాట్లు విక్రయించారన్నారు. తర్వా త 320 ఫ్లాట్లను మాత్రమే నిర్మించి, మిగిలిన ఫ్లాట్ల ను నిర్మించకుండా మాస్టర్ ప్లాన్ లేఔట్‌ను మార్చి, అదనంగా లోధా మెరీడియన్‌ను నిర్మించారని చెప్పా రు. లోధా బెలిజలో మౌలిక వసతులు కల్పించకుం డా మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. లోధా బెలిజ కమ్యూనిటీ స్థలాలను లోధా మెరీడియన్ నివాసితులకు చూపించి వారిని కూడా మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయంలో కోర్టుకు వెళ్లగా లోధా బెలిజ వారికి వసతులు కల్పించడంలో భాగంగా రెండు వెంచర్ల మధ్య ప్రహరీ నిర్మించారని చెప్పారు. చట్టపరంగా నిర్మించిన ప్రహరీపై లోధా మెరీడియన్ నివాసితులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారని, జీహెచ్‌ఎంసీ అధికారులు గోడను కూలుస్తారా? కూల్చమంటారా? అంటూ లోధా బెలిజ అసోసియేషన్‌కు నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ నియమ నిబంధనల ప్రకారమే ప్రహరీ ఉన్నదని, అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. లోధా బిల్డర్ లోధా బెలిజ, మెరీడియన్ ఫ్లాట్ల కొనుగోలుదారులను మోసం చేశారని, దీనిపై నిజనిర్ధారణ చేయాలని అధికారులను కోరారు. నిబంధనల కు విరుద్ధంగా మెరీడియన్ ఫ్లాట్లను నిర్మించి సొమ్ము చేసుకున్నారని, దీనిపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కలిసి, తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

తుదిదశకు చేరిన రోడ్ల మరమ్మతులు

■ నగరంలో మూడు దశల్లో నాణ్యతా పరీక్షలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు తుదిదశకు చేరకున్నాయి. వర్షాలను దృష్టిలో ఉంచుకొని చాలా ప్రాంతాల్లో ఒకే లేయర్ బీటీని వేస్తూ పూర్తిస్థాయిలో పునరుద్ధరణ పనులు వర్షాకాలం పూర్తయిన తర్వాత చేపట్టాలని నిర్ణయించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవలి వర్షాలకు 587ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినగా రెండు వేలకుపైగా గుంతలు ఏర్పడ్డాయి. గుంతల పూడ్చివేతతోపాటు మరమ్మతు పనులను 172 పనులుగా విభజించి రూ.22.73 కోట్ల అంచనాతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.19.20 కోట్లతో 145 చోట్ల మరమ్మతు పనులు చేపట్టారు. గురువారంనాటికి 82 ప్రాంతాల్లో పనులు పూర్తయినట్లు, 49 చోట్ల తుదిదశకు చేరుకున్నట్టు బల్దియా చీఫ్ ఇంజినీర్ జియావుద్దీన్ ప్రకటించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని రోడ్లను ఒకే లేయర్‌తో మరమ్మతు చేస్తున్నట్లు, వర్షాకాలం పూర్తయ్యాక పునరుద్ధరణ పనులు పటిష్టంగా చేపడుతామని వివరించారు. పూర్తయిన పనులకు మూడు ఏజెన్సీల ద్వారా నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముందుగా జీహెచ్‌ఎంసీ క్వాలిటీ సెల్, అనంతరం థర్డ్‌పార్టీ క్వాలిటీ సెల్ తనిఖీలు నిర్వహిస్తుందని, ఆ తర్వాత ఆయా యూనివర్సిటీల ఆధ్వర్యంలో ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చీఫ్ ఇంజినీర్ వివరించారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శుక్రవారం 18 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



అన్ని అకేషన్‌లకు పనికొచ్చే.. సింపుల్ అండ్ స్వీట్ చీరలు కావాలనుకునే అమ్మాయిలు.. ట్రెండీగా ఉంటూనే ట్రెడీషన్‌ల్ గా కనిపించాలనుకునే మగువలకు.. ఇదిగో సూపర్ అయిన చీరల కలెక్షన్ తీసుకొచ్చాం.. అంతేకాదండోయ్.. అదిరిపోయే రవికలను వాటికి జత చేశాం.. వచ్చే పండుగలు, ఫంక్షన్‌లలో అందంగా మెరిసేందుకే ఈ కలెక్షన్.

సూపర్ చీర.. అదిరే రవిక!

గువ్వలాగా కనిపించేందుకు ఈ చీర చుట్టాల్సిందే! చిలకపచ్చ రంగు క్రేప్ చీరకు బ్లూ కలర్ వెల్వెట్ బార్డర్‌ని జత చేశాం. బ్లూ కలర్ వెల్వెట్ బ్లౌజ్ మీద నెమళ్లు నాట్యమాడే డిజైన్‌ని ఎంచుకొని మగ్గం వర్క్ చేయించాం.

సింపుల్ అండ్ స్వీట్‌గా మెరిసిపోయేందుకు ఈ చీర కట్టాలి. పింక్ కలర్ జార్జెట్ మీద మొత్తం ముత్యాలు, కుందన్స్‌తో నింపేశాం. ప్యారెట్ గ్రీన్ కలర్ ప్యూర్ రాసిల్క్ మీద మొత్తం మిర్రర్ వర్క్ ఇచ్చాం. బ్లౌజ్ ముందు, వెనుక కీ హోల్ ఇచ్చాం. ఇవి బ్లౌజ్‌ని మరింత హైలైట్ చేశాయి.

లేత నీలం రంగు క్రేప్ చీర మీద నెమళ్ల డిజైన్ ఇచ్చాం. మగ్గం వర్క్‌తో స్టోన్స్, థ్రెడ్ వర్క్ చేశాం. హ్యాండ్ మేడ్ బార్డర్‌ని చీరకు జత చేశాం. నీలం రంగు వెల్వెట్ బ్లౌజ్‌ని హెవీగా డిజైన్ చేశాం. చీర మీద ఇచ్చిన డిజైన్‌నే బ్లౌజ్ మీద కూడా స్టోన్స్‌తో నింపేశాం. బ్యాక్ నెక్ మీద పూసలతో హైలైట్ చేశాం.

నిహారికా రెడ్డి
శ్రీ వైదికి డిజైనర్ స్టూడియో
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్
ఫోన్ : 040-44008089
https://www.facebook.com/sreevaidiki

లంగా-ఓణీ టైపు చీర ఇది. సగం వరకు బూడిద రంగు క్రేప్ మెటీరియల్ ఉంటుంది. ఆ తర్వాత గులాబీ రంగు క్రేప్ ఫ్యాబ్రిక్‌ని ఎంచుకున్నాం. నీలం రంగు మీద హెవీగా మగ్గం వర్క్ చేశాం. చీరకి లేస్ బార్డర్‌ని జతచేశాం. బూడిద రంగు శాటిన్ క్రేప్ బ్లౌజ్‌ని డిఫరెంట్‌గా డిజైన్ చేశాం. చేతులకు మాత్రం పింక్ కలర్ క్రేప్ మెటీరియల్‌ని వాడాం.

బ్లూ కలర్ క్రేప్, గోల్డెన్ కాంబినేషన్ మిమ్మల్ని ఎక్కడ ఉన్నా మెరిసేలా చూపిస్తుంది. ఈ చీర మీద మొత్తం సీక్వెన్స్‌తో మగ్గం వర్క్ చేశాం. హెవీగా బార్డర్ చీర అందాన్ని రెట్టింపు చేసింది. శాటిన్ బ్లౌజ్ మీద సీక్వెన్స్ ఫ్యాబ్రిక్‌ని డిఫరెంట్‌గా డిజైన్ చేశాం.

అడ్డురాని వయసు!



అనురాధ పీ థవన్.. 50 ఏండ్లు దాటిన వయసు ఈమెది. అయినా ఈమె అందం ముందు యువత కూడా చిన్నబోవాల్సిందే. ర్యాంప్‌పై నడుస్తుంటే ఫ్యాషన్ ప్రపంచం నివ్వెర పోతున్నది.

అనురాధకు ఫ్యాషన్‌పట్ల.. డిజైనింగ్ పట్ల.. టూరిజం పట్ల చాలా ఆసక్తి ఉండేది. తన అభిరుచి గురించి భర్తతో.. పిల్లలతో తరుచూ ఈ విషయాల గురించి చర్చిస్తుండేది. ఒకసారి ప్రముఖ చారిటీ సంస్థ ఫ్యాషన్ షోకు సన్నాహాలు చేస్తూ అందాల పోటీకి ఆహ్వానం పలికింది. ఫ్యాషన్ షో అంటేనే యూత్ ఉంటుంది.. ఇక మనమేం చేస్తాం అనుకున్న సమయంలో అనురాధ వాళ్ల కుమార్తె ధైర్యం చెప్పింది. వెళ్లాల్సిందేనంటూ చెప్పడంతో అనురాధ ఫ్యాషన్ షోకు హాజరై అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. తన అందాలతో అందర్నీ కట్టిపడేసింది. స్విమ్ సూట్ వేసుకుని హొయలొలుకుతూ ర్యాంప్‌పై ఆమె నడుస్తుంటే అంతా నోరెళ్లబెట్టుకున్నారు. అందాల పోటీలకు వయసు అడ్డురాదని నిరూపించింది. వయసు అనేది సంఖ్య మాత్రమే.. ఆత్మవిశ్వాసం ఉంటే అరవైలో కూడా ఇరవైయేండ్ల ఉరిమే ఉత్సాహం ప్రదర్శించొచ్చని అనురాధ చెప్తున్నది. ఫ్యాషన్ డిజైనింగ్‌లోనూ మంచి పట్టున్న అనురాధ రకరకాల డిజైన్లను రూపొందిస్తున్నది. ఫ్యాషన్ ఒక్కటే కాదు.. ప్రపంచాన్ని చుట్టేయడం కూడా ఆమెకు ఉన్న మరో అభిరుచి. ఇలా పర్యటకాన్ని ఎంజాయ్ చేస్తూ నిత్య నూతనంగా కనిపిస్తున్నది.

నిత్య వీక్షణం.. నిద్ర భంగం!



టీవీ చూడటం వల్ల ఇన్సోమియా అనే వ్యాధి బారిన పడటం తప్పదంటున్నారు బెల్జియంలోని ల్యూవెన్ యూనివర్సిటీ పరిశోధకులు. టీవీ వీక్షణం- నిద్ర అనే అంశంపై వీళ్లు తాజాగా ఓ అధ్యయనం చేశారు. వీలైనప్పుడు టీవీ చూసేవాళ్ల కంటే అదేపనిగా చూసేవాళ్లు తక్కువ నిద్రపోతారని.. ఇది క్రమంగా నిద్రలేమికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు.

అధ్యయనంలో భాగంగా 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ యువకులను పరిశీలించారు. దీంట్లో ప్రధానంగా వారి నిద్ర స్థాయిలను.. ప్రమాణాలను.. నిద్ర నాణ్యతను పరిశీలించారు. 65 శాతం యువతులు, 74 శాతం మంది యువకులు అలసట, నిద్రలేమి, తీవ్ర కలలు వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు స్పష్టమైందని వెల్లడించారు. మహిళలు ఎక్కువ టీవీలు చూస్తారనే అపవాదు ఉందిగానీ.. వాళ్లకంటే పురుషులు ఎక్కువగా చూస్తారనేది ఈ పరిశీలన ద్వారా తెలిసినట్లు కూడా వాళ్లు చెప్పారు. కాబట్టి అస్తమానం టీవీ చూసేవాళ్లు అప్రమత్తంగా ఉండాలని.. లేకపోతే తీవ్ర సమస్యలను కొని తెచ్చుకున్నవాళ్లవుతారని.. నిద్రలేమికి దూరంగా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

కష్టాల కడలిని ఈదుతూ..




కష్టసుఖాల సమ్మేళనమే జీవితం. కానీ సమస్యలు లేనప్పుడు సంతోషించి, కష్టం రాగానే కుంగిపోతుంటారు చాలామంది. అలాంటివారికి ఆదర్శప్రాయురాలు ముంబైకి చెందిన ఈ మహిళ.

పదమూడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి ముంబైకి వచ్చింది హజ్రత్ బీ. 19ఏళ్లకు ఎన్నో కలల్ని ఊహించుకుంటూ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. కానీ అత్తారింట్లో ఆమెకు అన్నీ కష్టాలే ఎదురయ్యాయి. వరుసగా జరిగిన సంఘటనలు ఆమెను కుంగదీశాయి. ముగ్గురు కూతుళ్లలో ఒకరు చనిపోయారు. కొన్నాళ్లకు భర్త కూడా లోకాన్ని వదిలాడు. ఈ కష్టాలకు తోడు, పుట్టింటికి వెళ్లిపోవాలంటూ అత్తామామల పోరు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇచ్చేందుకు పది ఇళ్లలో పనిమనిషిగా మారింది. అదే సమయంలో టైలరింగ్ నేర్చుకున్నది. చుట్టుపక్కల వాళ్లందరికీ బట్టలు కుట్టి పెడుతూ మంచి టైలర్‌గా గుర్తింపు పొందింది. ఈ అనుభవంతో ఒక స్వచ్ఛంద సంస్థతో కలిపి బ్యాగులు తయారు చేయడం మొదలుపెట్టింది. మరో పదిమందికీ దారి చూపెడుతున్నది. ఇంతలో ఆమె క్యాన్సర్ బారినపడింది. అయినా భయపడకుండా ముందుకు సాగింది. ఆత్మస్థైర్యంతో వ్యాధిని జయించింది. వ్యాపారాన్ని విజయవంతంగా నడిపిస్తూ, తనలాంటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

బిట్స్ కార్నర్

అడుగండి చెబుతా



ఈ దెబ్బ నుంచి కోలుకుంటాడా?

మా స్నేహితుడి వయసు 21 సంవత్సరాలు. బైక్ యాక్సిడెంట్‌లో తలకు గాయం అయ్యింది. చాలా రక్తస్రావం అయ్యింది. ఇది జరిగి దాదాపు 5, 6 నెలలు అయ్యింది. ఇప్పటికీ ఇంకా కోలుకున్నట్టు కనిపించడం లేదు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన మా పేర్లు కూడా అప్పుడప్పుడు తప్పుగా చెబుతున్నాడు. ఇప్పుడు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. క్లాసులకు హాజరు కాలేని పరిస్థితి. అతడు తన చదువు పూర్తి చెయ్యగలుగుతాడా? పూర్తిగా కోలుకుంటాడా? ఎంత సమయం పడుతుంది? దయచేసి పూర్తి వివరాలు తెలుపగలరు.

మహేష్ కుమార్, హన్మకొండ

తలకు దెబ్బతగిలినపుడు మెదడు మీద కూడా ప్రభావం చూపే ఆస్కారం ఉంటుంది. ఫలితంగా మెదడులో జరిగే కొన్ని సున్నితమైన రసాయనిక చర్యలు క్రమం తప్పుతాయి. అందువల్ల న్యూరాన్లు సరిగ్గా పనిచేయవు. మెదడులో ఉత్పత్తి అయ్యే రసాయనాలను న్యూరో ట్రాన్స్‌మీటర్లు అంటారు. మెదడులోని న్యూరాన్ల మధ్య సమాచార మార్పిడికి తోడ్పడుతాయి. తదనుగుణంగా మనలో ఆలోచనలు, ప్రవర్తన ఉంటుంది. ఒక్కోసారి గాయపడితే మెదడులోని ఈ రసాయనాలు తిరిగి సమతుల్యం కావడానికి కొన్ని వారాల నుంచి కొన్ని నెలలు, సంవత్సరాల సమయం కూడా పట్టవచ్చు. అది గాయం తీవ్రతను, ఆ గాయాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. ఒక అవయవం సవ్యంగా పనిచేయ్యాలంటే శరీరంలోని అనేక న్యూరాన్లు సమన్వయంతో పని చెయ్యాల్సి ఉంటుంది. తగిలిన గాయం మెదడులోని ఒక భాగానికి మాత్రమే పరిమితమైనపుడు దాని ప్రభావం కూడా పరిమితంగానే ఉంటుంది. సాధారంగా చాలామంది కొంత కాలానికి కోలుకొని మామూలు జీవితాన్నే గడుపుతారు. కానీ మీరు చెప్పినదాన్ని బట్టి మీ స్నేహితుడి తలకు తగిలిన గాయం చాలా తీవ్రమైందిగానే అనిపిస్తున్నది. ఒక్కోసారి తీవ్రమైన గాయం వల్ల దెబ్బతిన్న మెదడు తిరిగి సాధారణస్థితికి రావడం కష్టం అని కొంత మంది నిపుణులు అభిప్రాయపడతారు. కానీ, మెదడుకు సహజంగానే కోలుకునే సామర్థ్యం ఎక్కువ. ఇందుకు మెదడు కొత్త న్యూరాన్లను తయారు చేసుకోగలుగుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అయితే ఇదెంత వేగంగా జరుగుతుందో చెప్పడం ప్రస్తుతం సాధ్యపడదు. వయసు పెరిగే కొద్దీ మెదడులోని ఈ సామర్థ్యం తగ్గుతుంది. అందుకే చిన్న వయసులో ఉన్నవారు తలకు తగిలిన గాయాల నుంచి త్వరగా కోలుకుంటారు. మీ స్నేహితుడు ఇంకా చదువుకునే వయసులోనే ఉన్నాడు. వయసు తక్కువే కనుక త్వరలోనే కోలుకొని చదువు కొనసాగడానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. కనుక అతడికి కోలుకునేందుకు తగిన సమయం ఇవ్వడం మంచిది.



డాక్టర్
ఆనంద్ బాలసుబ్రమణ్యం
సీనియర్ న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్ : నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా (హెల్త్‌డెస్క్) #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

బంతి పూలసాగు ఇలా



పూలల్లో బంతి ముఖ్యమైంది. పండుగలు, శుభకార్యాల సమయంలో ఈ పూలకు డిమాండు ఉంటుంది. అలాగే ఈ పూలకు ఎక్కువ కాలం నిల్వ ఉండే స్వభావం ఉంటుంది.

వాతావరణం: ఎక్కువ వ్యత్యాసం లేని వాతావరణం అనుకూలం. జూలై నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటుకోవచ్చు. ఆగస్టు-సెప్టెంబర్‌లో నాటిన పంట నుంచి మంచి పూలను సరఫరా చేయవచ్చు. ఎక్కువ వర్షపాతం, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటే బంతి పూలు నాణ్యత దెబ్బతింటాయి.

నేలలు: ఉదజని సూచిక 7 నుంచి 7.5 వరకు గల నేలలు అనుకూలం. గరప నేలలు బంతి పూల సాగుకు అత్యంత అనుకూలం.

రకాలు: ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్‌బంతి, పూసా నారింజ గైండా, బసంతి గైండా, యండియు-1

ప్రవర్ధనం: బంతిని విత్తనం ద్వారా గాని, కత్తిరింపులు నాటి ప్రవర్ధనం చేయవచ్చు.

విత్తన మోతాదు: సూటిరకాల్లో ఎకరానికి 800 గ్రాముల నుంచి 1000 గ్రాముల వరకు విత్తనం అవసరం.

నాటేవిధానం: ఎత్తైన మడులలో నారు పెంచుకోవాలి. షేడ్‌నెట్ కింద ట్రేలలోనూ నారు పెంచుకోవచ్చు. దీనివల్ల మొక్కల్లో నాణ్యత ఉంటుంది.

విత్తనశుద్ధి తర్వాతనే విత్తనాలను నాటుకోవాలి. దీనివల్ల శిలీంధ్రాల వ్యాప్తిని అరికట్టవచ్చు. ప్రధానంగా 25 రోజుల వయసు ఉన్న నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. సాయంత్రం ఎండలేని సమయంలో నాటుకుంటే మంచిది. ఆఫ్రికన్ జాతి బంతిని 40X30 సెం.మీ దూరంలో ఫ్రెంచ్ బంతి మొక్కలను 20X20 సెం.మీ దూరంలో నాటుకోవాలి.

ఎరువులు: ఎకరాకు 10-15 టన్నుల వరకు బాగా చివికిన పశువుల ఎరువును చివరి దుక్కిలో వేసి కలియదున్నాలి. దీనితోపాటు 20-40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని పైపాటుగా వేసి నీరు పెట్టుకోవాలి.

నీటియాజమాన్యం: నాటిన 60 రోజుల వరకు శాఖీయ పెరుగుదల సమయంలో, పూతదశలోనూ నేలలో తేమ తగినంత ఉండేవిధంగా చూసుకోవాలి. ఈ సమయంలో మొక్కలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. లేదంటే పెరుగుదల ఆగిపోయి పూల దిగుబడి తగ్గిపోతుంది.

పించింగ్: ఎత్తుగా పెరిగే ఆఫ్రికన్ బంతి రకాల్లో పెరుగుదల ఎక్కువగా ఉండి చివరగా పూమొగ్గ ఏర్పడుతుంది. అప్పుడే పక్క కొమ్మలు ఏర్పడుతాయి. దీనికి బదులుగా నిటారుగా పెరుగుతున బంతి మొక్క కాండపు చివరి భాగాన్ని ముందుగానే కత్తిరిస్తే అనేక పక్కకొమ్మలు తొందరగా ఏర్పడుతాయి. దీనివల్ల పూల దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. నాటిన 40వ రోజు పించింగ్ చేస్తే పూల దిగుబడి పెరుగుతుంది. గుబురుగా పెరిగే రకాలకు పించింగ్ అవసరం లేదు.

పూల కోత: బంతిపూలు బాగా విచ్చుకున్న తర్వాత కోసుకోవాలి. పూలను ఉదయంకాని సాయంత్రం గాని కోయాలి. కోతకు ముందు నీటి తడి ఇస్తే కోత తర్వాత కూడా పూలు ఎక్కువ కాలం తాజాగా ఉంటాయి.


దిగుబడి: ఎకరాకు నాలుగు టన్నుల పూలు వస్తాయి.

సుందరి సురేష్
మండలస్థాయి ఉద్యానశాఖ
అధికారి, మిర్యాలగూడ
9441116724



'రైతుబడి'కి ఆహ్వానం

'రైతుబడి' రైతుల కరదీపిక, వేదిక. రైతులంతా తమవైన అనుభవాలను విజయగాథలను 'రైతుబడి' ద్వారా సోదర రైతు మిత్రులతో పంచుకోవచ్చు. తద్వారా సోదర రైతులకు సాగులో మెళకువలను నేర్పినవారవుతారు. నూతన సాగు పద్ధతులు, సాగు పరికరాల గురించి రైతుబడిలో రాయండి. పది మందికి మార్గం చూపించండి.



రచనలు పంపవలసిన చిరునామా:
8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్ నం-10,
బంజారాహిల్స్ హైదరాబాద్-500034.
raithubadi@ntdaily.news,
Fax-040-23291118



పంటక్షేత్రమే ప్రయోగశాల





ఆరేండ్లలో అద్భుత ఫలితాలు సాధించిన అన్నదాత • సేంద్రియ ఎరువులతోనే ఉద్యానపంటల సాగు
స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటున్న రైతు కుటుంబం • స్వచ్ఛ కూరగాయలు, స్వచ్ఛ సాగే లక్ష్యమంటున్న రైతు రామారావు

కల్తీరహిత పంటల ఉత్పత్తి జరుగాలన్నదే అతని ఆశయం. ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులతో సాగు చేయాలన్నదే అతని తపన. పండించిన పంటల ఫలితం రైతుకే దక్కాలి. మన కూరగాయలు-మన వ్యవసాయం, మన అవసరాలు అని సాగుచేస్తున్నాడు. రాబోయే తరానికి మంచి ఆరోగ్యం అందిద్దాం- ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామనేది అతని ఆలోచన. స్నేహితుడు ఇచ్చిన ఐడియానే అతని నేడు సేంద్రియ పంటలు సాగు చేసే రారాజును చేసింది. కష్టించి పనిచేశాడు. అందరికంటే భిన్నంగా ఆలోచించి సఫలీకృతుడయ్యాడు. తన తోటి గ్రామస్థులకు తానే ఉపాధి కల్పించేస్థాయికి ఎదిగారు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామానికి చెందిన చెరుకూరి రామారావు.

సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రామారావుకు చిన్ననాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరిక ఉండేది. కానీ పెద్ద చదువులు చదువలేదు. పదవ తరగతి మాత్రమే చదువడం వల్ల అతని కోరిక ఫలించలేదు. అయినప్పటికీ అతనిలో ఆశ చావలేదు. ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం సాధించాడు. దాదాపు 12 సంవత్సరాల పాటు కొలువు చేశాడు. అయినా ఆ ఉద్యోగంతో సంతృప్తి చెందలేదు. ఏదో చేయాలి మనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఉద్యోగాన్ని వదులుకున్నాడు. స్నేహితుడి ఆలోచన మేరకు సాగుకు సిద్ధపడ్డాడు. ఒకటి రెండు సంవత్సరాలు నాన్నకు తోడుగా ఉంటూ అందరిలానే పంటల సాగు చేపట్టాడు. అయినా తృప్తి చెందలేదు. సాగులో సైతం తన కంటూ ఓ మార్క్ ఉండాలనుకున్నాడు. అది అందరికీ ఆదర్శంగా ఉండాలనుకున్నాడు. అంచెలంచెలుగా సేంద్రియ సాగు వైపు అడుగులు వేశాడు. అద్భుత ఫలితాలు సాధించాడు. తన తల్లితండ్రులు వారసత్వంగా ఇచ్చిన ఆరు ఎకరాల భూమికి తోడు మరో 15 ఎకరాల భూమిని కొనుగోలు చేసి తన సేద్యాన్ని విస్తరించాడు. ప్రస్తుతం తనకున్న 21 ఎకరాలలో సుమారు 15 రకాల ఆకుకూరలు, కూరగాయలను సాగు చేసుకుంటూ సొంతంగానే మార్కెటింగ్ చేసుకోవడం విశేషం. అంతేకాదు తన సొంత పొలంలోనే రసాయనరహిత ఎరువుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పనికిరాని వర్థ్యాలనే ఉపయోగిస్తూ సేంద్రియ ఎరువులుగా మారుస్తున్నాడు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న రైతు రామారావు తన అనుభవాలను 'రైతుబడి'తో పంచుకున్నాడు.

కండక్టర్ నుంచి కర్షకుడిగా

2007 సంవత్సరానికి ముందు ఆర్‌టీసీలో కాంట్రాక్టు పద్ధతిలో కండక్టర్ కొలువు చేశాడు. దాదాపు పన్నెండు ఏండ్లు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. అయితే రైతు కుటుంబంలో జన్మించిన రామారావుకు ప్రతిరోజు తన తండ్రి చేసే సేద్యంపైనే ఆలోచన. ఎవరి దగ్గరో కొలువు చేయడం కంటే తానే స్వయంగా స్వయం ఉపాధి చేయాలని నిర్ణయించుకొని తన మదిలో మెదిలిన ఆలోచనను స్నేహితుల దగ్గర పంచుకున్నాడు. అయితే చాలామంది మిత్రులు సాగు చేపట్టాలనే సలహా ఇచ్చారు. దీంతో తన తండ్రితో పాటు సాగుకు శ్రీకారం చుట్టాడు. పాత పద్ధతిలోనే సాగు చేశాడు. పంట చేతికి వచ్చిన తరువాత మార్కెట్‌లో అమ్ముకోవడం, వచ్చిన లాభాలను బేరీజు వేసుకుంటే పెట్టుబడి పోను ఏమి మిగలని పరిస్థితి. సహజ సిద్ధమైన ఎరువులు (ఆవు పేడ) వేసి మాత్రమే పంటను సాగు చేద్దాం అని అనేకసార్లు తన తండ్రికి చెప్పాడు. అయినా అతను ఒప్పుకోలేదు. తనకు ఇచ్చిన భూమిలో తానే సాగు చేసుకుంటానని చెప్పాడు. దీంతో తల్లితండ్రులు ఓకే చెప్పారు. ఇంకేముంది ఒక్కో పంటకు ఒక్కో విధానం ప్రవేశపెట్టాడు. దుక్కి నుంచి మొదలుకొని పంట చేతికి వచ్చే సరికి సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులను ఉపయోగించడం మొదలుపెట్టాడు.

పంటపొలమే ప్రయోగశాల

ఎట్టి పరిస్థితుల్లోనూ రసాయనరహిత ఎరువులతోనే పంటలను పండించాలని సాగు మెదలు పెట్టాడు. తొలుత ఎకరం భూమిలోనే ప్రయోగం చేశాడు. ఇప్పుడు 21ఎకరాలకు విస్తరించాడు. ప్రతిసారి సేంద్రియ ఎరువుల కోసం ఇతరులను ఆశ్రయించాడు. ఇది ఇబ్బందిగా మారింది. దీంతో సాగుతో పాటు పంట పొలంలోనే సేంద్రియ ఎరువుల తయారు చేసుకోవడం మొదలు పెట్టాడు. ఇందుకు అవసరమైన పేడను ముందే నిల్వ చేసుకున్నాడు. అయితే రాను రాను పేడ కూడాదొరుక లేదు. దీంతో ప్రత్యామ్నాయా మార్గాలను అన్వేషించాడు. దీనికోసం తెలిసిన వారిని సంప్రదించి సలహాలు తీసుకున్నాడు. అయినా మార్గం దొరుకలేదు. చివరికి తన క్షేత్రంలోనే కుళ్లిపోయిన కూరగాయల వ్యర్థాలను, ఆకుకూరలను ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో నిల్వచేసి కొన్నాళ్ల తరువాత ఆ నీటిని శుభ్రపరిచి అదే ద్రవపదార్థాన్ని పంటలపై పిచికారీ చేశాడు. ఆశించిన ఫలితాలు వచ్చాయి. దీంతో మరింత ఆలోచన చేసి మట్టిని సైతం మరిగించి తద్వారా వచ్చిన రసాయన పదార్థమే పంటలకు జీవామృతంగా ఉపయోగించాడు. ఇక అప్పటి నుంచి వెనుదిరుగకుండా అదే విధానం కొనసాగిస్తూ నేడు 12 రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నాడు.

సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుంటూ

ఒకవైపు సహజసిద్ధమైన ఎరువుల సహాయంతో సాగు చేస్తున్న రామారావు దానికితోడు ఆధునిక యంత్ర పరికరాలను కూడా వినియోగిస్తున్నాడు. స్థానిక ఉద్యాన అధికారుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తున్నది. దీంతో కొత్తరకం పద్ధతులను అనుసరిస్తున్నాడు. తక్కువ నీటి వనరుల సహాయంతో ఎక్కువ మొత్తం సాగు చేపట్టాలనుకున్నాడు. దీనికికోసం సూక్ష్మనీటి పథకాన్ని అందుబాటులోకి తెచ్చాడు. అదే విధంగా తేమశాతం నిలుపుదల, కలుపు నివారణ కోసం మల్చింగ్ పద్ధతిని సైతం అమలు చేస్తున్నాడు. తీగజాతి కూరగాయల కోసం పందిళ్లను నిర్మించాడు. మంచి ఫలితాలు వస్తున్నాయి. తాను సొంతంగా తయారు చేసిన సేంద్రియ ఎరువులను డ్రిప్ పద్ధతిలో పంటలపై పిచికారీ చేస్తున్నాడు. పంటలను ఆశించే పురుగుల ఉధృతిని అరికట్టేందుకు ప్రత్యేక డబ్బాలను ఉపయోగిస్తూ సస్యరక్షణ చర్యలు చేస్తున్నాడు.

తోటి గ్రామస్థులకు ఉపాధి కల్పిస్తూ

సామాన్య కుటుంబానికి చెందిన రామారావు నేడు తన తోటి వారికి ఉపాధి కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. కోయచెలక గ్రామానికి చెందిన సుమారు 25 మందికి ఏడాది పొడువునా ఉపాధి కల్పిస్తున్నాడు. వారి వసతి తదితర అవసరాల కోసం పంట పొలాల్లోనే ప్రత్యేక విశ్రాంతి భవనాన్ని సైతం నిర్మించాడు. వీరితోపాటు తన సమీప బంధువులకు ఉపాధి కల్పిస్తున్నాడు. మార్కెటింగ్ చేసేందుకుగాను వారి సహకారంతో పంటలను విక్రయిస్తున్నాడు.

మార్కెటింగ్‌లోనూ ప్రత్యేకత

పండించిన పంటలను మార్కెటింగ్ చేసుకునే విధానంలోనూ రామారావుకు ప్రత్యేకత ఉన్నది. దాదాపు 12 రకాల కూరగాయలను పండిస్తున్న ఆయన సొంతంగానే విక్రయాలు చేస్తున్నాడు. ఖమ్మం నగరంలో ఉన్న రైతుబజార్‌లో ఆయన కోసం అధికారులు ఓ స్టాల్‌ను కేటాయించారు. సేంద్రియ ఎరువులతో పండిస్తున్న ఆ కూరగాయలను కొనేందుకు నగరంలో చాలా మందే వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. సొంతంగా మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఎకరానికి ప్రతి పంటకు రూ. లక్షకు పైగా ఆదాయాన్ని సొంతం చేసుకుంటున్నాడు.

– మద్దెల లక్ష్మయ్య,
ఖమ్మం వ్యవసాయం, 9010723131

కల్తీరహిత కూరగాయలు



రసాయన ఎరువులతో పండించిన కూరగాయలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాకాకుండా వారికి రసాయనరహిత కూరగాయలను అందించడం మన బాధ్యత అని భావించాను. కల్తీరహిత కూరగాయలను అందివ్వాలనే ఉద్దేశంతో సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాను. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా సాగు చేస్తున్నాను.

– చెరుకూరి రామారావు, రైతు 7995430697

మామిడితోటలో యాజమాన్య పద్ధతులు



మామిడి తోట నిర్వహించడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటే లాభాలు ఆర్జించవచ్చు. ఇందుకు- అనువైన సమయంలోనే మామిడి మొక్కలు నాటుకోవాలి. తోటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి. అవసరమైన మేరకు తగు మోతాదులో మందులు పిచికారీ చేయాలి. ఎండిన కొమ్మలను తీసివేయడం శ్రేయస్కరం. కాయ కోయడంలో తగు జాగ్రత్తలు పాటించాలి.

నేలల ఎంపిక: నేల ఉదజని సూచిక 7.5- 8.0 వరకు ఉన్న నేలలు అనుకూలం. లోతైన ఎర్ర చెల్కా నేలల్లో చెట్టు బాగా అభివృద్ధి చెంది అధిక దిగుబడులు ఇస్తాయి.

రకాలు: బంగనపల్లి, తోతాపురి, సువర్ణరేఖి, దశేరి, నీలం, కేసర్, హిమాయత్ పసంద్.

రసాలు: చిన్నరసం, పెద్దరసం, చెరకు రసం, నవనీతం.

పచ్చడి రకాలు: జలాల్, తెల్ల గులాబీ, చిన్నరసం.

సంకర రకాలు: మంజీర, మల్లిక, ఆమ్రపాలి, రత్న, అర్కపునీత్, నీలేషాన్.

పునాస రకాలు: రాయల్ స్పెషల్, బారమసి, బొబ్బిలి పునాస, తంబ్వా

మొక్కల ఎంపిక: 8 నెలల నుంచి ఒక ఏడాది వయసు ఉన్న మొక్కలను నాటడం శ్రేయస్కరం.

జూలై నుంచి డిసెంబర్ వరకు నాటుకోవచ్చు. నాటే దూరం నీటి సదుపాయం నేల రకాన్నిబట్టి 7-10 మీటర్లు దూరం ఉండాలి. అధిక సాంద్రత పద్ధతిలో 15X15 లేదా 18X18 అడుగల దూరంలోనూ నాటుకోవచ్చు. కాసే చెట్లను ఏటా కత్తిరింపులు చేస్తే అధిక దిగుబడులను పొందవచ్చు. పొడవు, వెడల్పు లోతు 3X3X3 ఉండేలా గుంతలను తవ్వాలి. ప్రతి గుంత పైపొర మట్టికి సుమారు 30-40 కిలోలు బాగా మాగిన పశువుల ఎరువు లేదా 5 కిలోల వానపాముల ఎరువు+ రెండు కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్+ 100 గ్రాముల పాలిడాల్ పొడి మందును కలిపి గుంతలను నింపాలి. మామిడిలో బోరాన్ లోపం ఎక్కువగా వస్తుంది. కనుక గుంతలో 50-60 గ్రాముల బోరాక్స్ కూడా కలుపాలి.

ఎరువుల యాజమాన్యం: ప్రతి మొక్కకు మొదటి ఏడాది100 గ్రాముల నత్రజని, 100 గ్రాముల భాస్వరం, 100 గ్రాముల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. తర్వాత ప్రతి సంవత్సరం 100 గ్రాముల నత్రజని, భాస్వరం, పొటాష్‌లను పెంచుతూ 10వ సంవత్సరం ఆ తర్వాత ప్రతి మొక్కకు ఒక కిలో నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ అంటే 2175 గ్రాముల యూరియా, 6250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్ 1670 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ సిఫారసు చేసిన ఎరువులను మొదటి దశ వర్షాకాలం మొదట్లో వేయాలి ఫిబ్రవరిలో పిందె గోళీకాయ పరిమాణంలో ఉన్నప్పుడు 1/3 వంతు ఎరువులను వేసుకోవాలి.

నత్రజనిని 50 శాతం సేంద్రియ ఎరువుల రూపంలో, 50 శాతం రసాయన ఎరువుల రూపంలో వేయాలి. సాధారణంగా మొక్కల పెరుగుదల దశలో సూక్ష్మపోషక పదార్థాల నివారణకు లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్+ 2.5 గ్రాముల టెట్రా సల్ఫేట్+ 2 గ్రాముల బోరాక్స్+ 2 గ్రాముల కాపర్ సల్ఫేట్+ 3 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ సంవత్సరానికి 2-3 సార్లు లేత ఆకులపై పిచికారీ చేయాలి. అక్టోబర్ మాసంలో లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను కలిపి పిచికారీ చేయడం వల్ల చెట్లకు ఒకేసారి పూత వస్తుంది.

కలుపు నివారణ: లీటరు నీటికి 8 మి. లీ గ్లైపోసేట్+ 10 గ్రాముల యూరియా కలిపి 20-25 రోజుల వయసు ఉన్న కలుపుపై పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం: చిన్న వయస్సు చెట్లకు ప్రతి నాలుగు రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. కాపునకు వచ్చిన చెట్లకు మొగ్గ వచ్చే ముందు ఒకసారి తేలికపాటి తడి తేలిక నేలలో ఇవ్వాలి. తర్వాత పిందె బఠాణి గింజ పరిమాణంలో ఉన్నప్పుడు మరొకసారి ఆ తర్వాత నెల రోజులకు మరొకసారి తడినివ్వాలి. కాయలు కోయడానికి 25-30 రోజుల ముందు నీరు పెట్టడం ఆపాలి. బిందు సేద్యంలో నీటి పొదుపుతో పాటు చెట్లు బాగా ఎదిగి అధిక దిగుబడులు ఇస్తాయి.

కత్తిరింపులు: మొక్క కింద నుంచి 50 సెం. మీ వరకు ఎటువంటి కొమ్మలను రానియ్యరాదు. ప్రధాన కాండంపై మూడు బలమైన కొమ్మలను ఎన్నుకుని పెరుగనివ్వాలి. పక్క కొమ్మలు 60-80 సెం. మీ పొడవు ఉండేలా చూసుకుని కత్తిరించుకోవాలి. పెద్ద చెట్లలో ఏటా కాపు తర్వాత కాయ ఒదిలిన తొడిమలను అడ్డదిడ్డంగా పెరిగే కొమ్మలను, ఎండిన కొమ్మలను తీసివేయడం వల్ల చెట్టంతా సూర్యరశ్మి సోకి మంచి కాపునిస్తుంది.

పిందె రాలకుండా 10 లీటర్ల నీటికి 2.5 మి. లీ ప్లానోఫిక్స్‌ను కలిపి మొగ్గ దశలో ఒకసారి మరలా పిందె బఠాణి గింజ పరిమాణంలో ఉన్నప్పుడు మరోసారి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ: పూత, పండు దశలో తామర పురుగులు, తేనే మంచు పురుగులు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు ఆశిస్తాయి. వీటి నివారణకు మొదటి దఫా మొగ్గ తొడిగేందుకు 15-20 రోజుల ముందు 3 గ్రాముల కార్బరిల్+ 2 గ్రాముల సాఫ్ లీటర్ కలిపి పిచికారీ చేయాలి. రెండవ దఫాలో మొగ్గ దశలో తేనె మంచు పురుగు, బూడిద తెగులు కన్పిస్తే ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి. లీ+ 1 మి. లీ కెరాథేన్+ 3 మి. లీ వేపనూనెను కలిపి పిచికారీ చేయాలి. మూడవ దఫాలో పిందె దశలో పురుగు బూడిద తెగులు ఉధృతిని బట్టి లీటరు నీటికి రెండు మి.లీ క్వినాల్ ఫాస్+ 2 మి. లీ కెరాథేన్ కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు నివారణ: ఈ పురుగులు తీవ్రంగా ఆశిస్తే మొక్కలు ఎండిపోతాయి. వీటి నివారణకు పురుగు తొలిచిన రంధ్రాలలో మిథైల్ పెరాథియాన్ 50 శాతం ఒక మి. లీ, ఒక లీటరు నీటికి కలిపి ద్రావణాన్ని వేసి బంక మట్టితో మూయాలి.

రాతి మంగు: ఇది తామర పురుగు వల్ల కలుగుతుంది. ఈ పురుగు నివారణకు పిందెలు ఎదిగే దశలో లీటరు నీటికి 0.3 మి. లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మి.లీ హోస్టాథియాన్ కలిపి నల్ల పూత దశలో పిచికారీ చేయాలి.


పిండి పురుగులు: లీటరు నీటికి ఒక మి. లీ డైక్లోరోవాస్ లేదా రెండు మి. లీ ఫాస్ఫామిడాన్‌లను కలిపి పురుగులపై పిచికారీ చేయాలి.

కాయ కోయడం: పాటు కాయ రాలితే కాయ కోతకు సిద్ధంగా ఉన్నదని గుర్తించాలి. కాయ కోసేటప్పుడు కాయకు ఒక అంగుళం తొడిమి ఉండేటట్లు డపోలి హార్వెస్టర్లను ఉపయోగించి కోయాలి.

దిగుబడి: సరియైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరానికి 5 టన్నుల దిగుబడిని పొందవచ్చు.

– నట్టె కోటేశ్వరరావు, గరిడేపల్లి
99899 44945

జాగ్రత్తలు పాటించాలి



మొక్కలు నాటుకునేందుకు సరైన నేలలు ఎంపిక చేసుకోవాలి. సరైన సమయంలో మొక్కలు నాటుకోవాలి. చెట్టు వయస్సును బట్టి అవసరమైన మేరకు ఎరువులను వాడాలి. అలాగే మొక్కలకు వచ్చే రోగాలను బట్టి మందులు పిచికారీ చేసుకోవాలి. అదే విధంగా కాయలు కోతకు వచ్చినప్పుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ కాయలు కోయాలి.

–ముదిరెడ్డి రంగారెడ్డి, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

GURUKUL -ENGLISH

PAPER - II

1. I wish, I ………… a bird
A. Is B. are C. was D. were
2. He ordered me as if I …… his servant
A. Am B. is C. are D. were
3. The cattle …… grazing in the field
A. Is B. was C. are D. has
4. The news …… good
A. Is B. are C. were D.None
5. Vijay as well as Pradeep …… absent
A. Have B. was C. were D. None
6. The professor together with students …… on vacation
A. Have B. was C. were D. None
7. One should love ……… country
A. his B. her C. one's D. our
8. He is a man of letters ………… is famous for many notable works
A. who B. which
C. whom D. none
9. The books ……… are listed in the catalogue are out of stock
A. who B. which C. whom D. none
10. Hari and Rama love ………
A. one another B. each other
C. himself D. None
11. Shravani came …… hour ago
A.a B. an C. the D. No article
12. Susheel ordered …… tea
A.a B. an C. the D. No article
13. …… Gold is used as …. ornament
A. a, an B. No article, an
C. the, a D. No article, No article
14. Geetha had …. late dinner yesterday
A. a B. an C. the D. No article
15. Venu lives in …… Hyderbad
A. a B. an C. the D. No article
16. She lives in …… U.S.A
A. a B. an C. the D. No article
17. It happens once in …… bluemoon
A. a B. an C. the D. No article
18. Ashish works for …… ISRO
A. a B. an C. the D. No article
19. We know … Elephant and …… Cow
A. a, an B. an, a C. the, a
D. No article, No article
20. Mohan plays …… Snookers
A. a B. an C. the D. No article

Identify the correct word which suits the best for the following sentences

21. Hema often …… here
A. come B. came
C. comes D. will come
22. The Sun ……… in the west
A. was set B. will set C. sets D. rises
23. Arun ……… (read) News paper early in the Morning
A. will read B. reads
C. never reads D. none
24. look! it …
A. rains B. is raining
C. was raining D. will be rain
25. Shiva …… to movie yesterday
A. go B. went
C. has gone D. was gone
26. It is high time, we … class
A. left B. leave
C. have to leave D. start
27. The Train ……… before we …… the Station
A. left, reached B. left, reach
C. left, had reached
D. had left, reached
28. If you … me, I…… come
A. will invite, shall B. invited, will
C. invite, will D. will invite, will
29. Monika … (live) in Bangalore for 2 years
A. is living B. has been living
C. was living D. is been living
30. He is not believing you … identify the correct sentence
A. He doesn't believe you
B. He is not believing you
C. He is believing you
D. He is not believe him
31. He must apply …… judge for pardon
A. to B. with C. upon D. beside
32. We must dispense …… our services
A. to B. with C. of D. No word
33. Vinay turned …… the offer
A. to B. with C. over D. down
34. Soldiers laid … their lives for the country
A. on B. with C. upon D. down
35. She sat …… him
A. to B. with C. by D. besides
36. Nikitha was dressed …. Red
A. in B. at C. since D. for
37. Vinay has been working ….. five years
A. on B. at C. for D. since
38. We have been learning English …. 2000
A. on B. at C. for D. since
39. The guide describes ……… the beauty of the master piece
A. on B. on C. at D. No word
40. All of you must get …… the exam
A. on B. through C. for D. up
41. Indians have great respect for traditions
A. Do they? B. Don't they?
C. Have they? D. haven't they?
42. Kavish works in Amazon
A. Does he? B. Doesn't he?
C. Did he? D. Didn't he?
43. She beats Cattle
A. Doesn't She? B. Does She?
C. Did She? D. Didn't She?
44. He beat cattle
A. Does he? B. Doesn't he?
C. Did he? D. Didn't he?
45. Srishailam was married to Rajitha
A. Does he? B. Doesn't he?
C. Was he? D. wasn't he?
46. Prasad never smokes
A. Does he? B. Doesn't he?
C. Did he? D. Didn't he?
47. I am a lecturer
A. Am i? B. Amn't i?
C. Aren't i? D. Are i?
48. Although the IPL is relatively new, It has already become very popular, identify the sentence
A. simple B. compound
C. complex D. compound- complex
49. My friend's handwriting is ….. than mine
A. good B. bad
C. worse D. more better
50. Inspite of hard work, she failed in the exam ……, identify the sentence
A. simple B. compound
C. complex D. compound- complex

Identify the correct form of the passive voice

51. She spreads the news
A. The news was spreaded by her
B. The news is spread by her
C. The news is spreaded by her
D. The news are spreaded by her
52. He beat cattle
A. Cattle was beaten by him
B. Cattle is beaten by him
C. Cattle are beaten by him
D. Cattle were beaten by him
53. He is playing Chess
A. Chess is being played by her
B. Chess was being played by him
C. Chess were being played by him
D. Chess is being played by him
54. Greeshma sings a song
A. A song is sung by her
B. A song is sung by her
C. A song is sung by Greeshma
D. A song is sing by him
55. We have seen a movie
A. A movie has been saw by us
B. A movie has been seen by us
C. A movie will be seen by us
D. A movie is seen by them
56. Billiards …… liked by me
A. is B. are C. were D. have
57. The building was(1)/ design(2)/ by the Architects(3)/ No error (4) Identify the error in the given sentence
A. 1 B. 2 C. 3 D. 4
58. A car has ….. by the Chauffeur
A. drive B. drove
C. been driven D. will drived
59. She is known …… me
A. to B. by C. on D. for
60. Prashanth vihari turns …… to be a great music director
A. on B. off C. out D. down
61. Susheel Banna hit … an idea
A. on B. up C. upon D. down
62. Pranav is going in …. I.P.S
A. in B. At C. for D. over
63. Many soldiers laid …… their lives for our country
A. off B. on C. down D. out
64. The Supreme court of India set …… the govt orders
A. in B. out C. aside D. over
65. Kramanika's father laid …… some money for her higher studies
A. off B. down C. over D. by

Identify the correct form of the degree (Q.NO. 66-70)

66.
A. Ashoka was one of the greatest kings (Superlative degree)
B. Ashoka was greater than most other kings (Comparative degree)
C. Vey few kings were as great as Ashoka (Positive degree)
D. A and B B. B and C
C. A, B, C D. None
67.
A. R.K. Narayan is one of the most famous writers in India (Superlative degree)
B. R.K. Narayan is more famous than most of the writers in India (Comparative degree)
C. Very few writers in India are so famous as R.K. Narayan (Positive degree)
A. A and B B. B and C
C. A, B, C D. None
68.
A. Varanasi is not oldest of all the cities in Uttarpradesh (Superlative degree)
B. Varanasi is not older than some other cities in Uttarpradesh (Comparative degree)
C. Some other cities in Uttarpradesh are atleast as old as Varanasi (Positive degree)
A. A and B B. B and C
C. A, B, C D. None
69.
A. Mumbai is not finer than Chennai (Comparative degree)
B. Chennai is as fine as Mumbai (Positive degree)
A. A only B. B only
C. A and B D. None
70.
A. Ravi is greater than Mahi (Comparative degree)
B. Mahi is not so great as Ravi (Positive degree)
A. A only B. B only
C. A and B D. None
71. He …… my appointment
A. ordered for B. ordered
C. order in D. none
72. This book …. that book
a. Resembles with b. Resembles
c. Resemble to d. No word
73. She takes …. her mother
a. Into b. After c. Off d. in
74. Ramu Has No House ……
a. To live b. To stay
c. To live in d. No word
75. All the … french houses were sold
A. Old fine white B. White fine old
C. Fine white old D. Fine old white
76. He must have given …… instructions
A. Oral B. Verbal
C. Spoken D. None

Identify the correct form of the word

77. A. Grammar B. Grammaer
C. Grammer D. Grammare
78. A. Personnell B. Invisiable
C. acqueman D. veracity

Identify the misspelt word

79. A. Rendezvous B. connoisseur
C. chauffeur D. Arguement
80. A. indefatigable B. invulnerable
C. elobarate D. ecstasy
81. Round about way of speaking
A. Extempore B. Reticent
C. Circumlocution D. maiden
82. RENDEZVOUS
A. A person who does the things for pleasure not for gain
B. one who hates marriage
C. A pre arranged place for meeting
D. one who possess several talents or gifts
E. A place where bees are reared
83. It is all greek to me
A. good for me
B. unable to understand something
C. useful
D. easy to understand something
84. He is coming to the front
A. He is coming to front
B. he is sitting in front row
C. He is getting fame and importance
D. He is losing credit and faith
85. You will never succeed if you work like fits and starts
A. seriously B. do not work
C. ignore D. irregularly
86. Every community has a black sheep
A. A sheep which is black in colour
B. good persons
C. bad character D. skilled

*Select the most suitable word for the following (*similar in nature)*

87. EXIGENT
A. Urgent B. Lazy
C. Naive D. Insipid
88. Feign
A. Reclusive B. Fake
C. Authentic D. Foreign
89. Extant
A. Still existing B. Extent
C. Laconic D. Ephemeral
90. Assiduous
A. Diligent B. Capricious
C. Taciturn D. Zest

Select the most suitable word which is opposite in nature

91. Specious
A. Fascinate B. Allure
C. Genuine D. Wide
92. Noxious
A. Harmless B. Poisonous
C. Lethargic D. Innocuous
93. Pious
A. Private B. Sanctity
C. Pure D. Impure
94. Fallible
A. True B. Infallible
C. Invincible D. Credulous

Identify the error in the following questions

95. I have left (A)/any stones (B)/unturned in order(C)/ to carry the day (D)/no error(E)
96. I had been(A)/ to Kashmir(B)/ which(C)/ is famous of greenery (D)/no error(E)
97. The information (A)/who(B)/ is broadcasting(C)/ by A.I.R is informative (D)/ no error(E)
98. The plural form of offspring is ......
A. offsprings B. Offspring
C. Heirs D. None
99. The Singular form of radii
A. Radi B. Radii
C. Radius D. Radies
100. .... of beauties
A. Bunch B. Bevy
C. Group D. Herd
101. If u .... me, I will come
A. Invite B. Invites
C. will invite D. None
102. She will attend the exam (A)/if you will allow her into (B)/the examination hall(C)/no error(D)
103. If you worked hard, you .... get through the exam
A. will B. would C. Can D. May
104. If you had worked hard, you .... got through the exam
A. will have B. shall have
C. could have D. Might has
105. Shiva said, 'I am happy today', The Indirect speech is
A. Shiva said that he was happy that day
B. Shiva said that he were happy that day
C. Shiva said he was happy that day
D. Shiva said that he was happy this day
106. The king said to the courtiers, 'go and bring me a doctor' The Indirect speech is
A. The king ordered the courtiers to go and get him a doctor
B. The king ordered the courtiers to go and get her a doctor
C. The king requested the courtiers to go and get him a doctor
D. The king requested that the courtiers to go and get him a doctor
107. He said, 'alas! I am undone', The Indirect speech is
A. He exclaimed with sorrow that he was undone
B. He filled with sorrow he was undone
C. She exclaimed with sorrow that he was undone
D. He expressed with sorrow that he was undone
108. The student said 'I wrote a letter yesterday' The Indirect speech is
A. The student said that he had written a letter the previous day
B. The student said that he had written a letter the next day
C. The student said that he had wrote a letter the previous day
D. The student said that he had to write a letter the previous day
109. The voter said to the leader, 'will you solve the problem?', The Indirect speech is
A. The voter asked the leader if/whether he would solve the problem
B. The voter ordered the leader if/whether he would solve the problem
C. The voter requested the leader if/whether he would solve the problem
D. The exclaimed with a sorrow the leader if/whether he would solve the problem
110. Re arrange the following sentences An outstanding feature of this country is
P: living condition of the
Q: the improvement of the income and
R: greater security and education which
S: working man leading to
S6: has meant greater political power
The correct order is
A.QPRS B.QPSR C.PSQR D.RSPQ
111. Re arrange the following
S1. Science does not merely add new truths
P : destroys some old truths, and
Q: discovers new truths that
R: there by upsets the way of
S: to old ones it also
S6. Men's thinking and their lives
A) SQRP B) SQRP C) PQRS D) PQSR
112. Re arrange the following
S1. The greatest tragedy of Bhopal
P: we in india
Q: is that ever after the disaster
R: have not realized
S: the necessity
S6. of town planning
A) PQRS B) QPRS C) PQSR D) RSPQ
113. We must turn….. books in the library
A. in B. down C. out D. over
114. I cannot put him …… with his mischievous behaviour
A. up B. down C. in D.off
115. The match was called ….. due to heavy rain
A. off B. on C. for D. up
116. Varun refrained …… smoking
A. from B. up C.out D. over
117. We should fully aware …. the bad habits
A. in B.of C. out D. at
118. I had been to Delhi when
A. they are searching for me
B. they were for searching for me
C. they will be searching for me
D. they are about to searching for me
119. It is …… to rain
A. about B. allow
C. besides D. None
120. every one …... busy in their deeds
A. is B. are C. were D. None
121. ………. Mt. Everest is the highest peak in the world
A.a B. an C. the D.no article
122. He is……than him
A. taller B. tallest C. tall D. none
123. Ramu is superior ….. Raju
A. to B. than C. over D. prefer
124. He is ……. unique
A. more B. most
C. no word D. none of the above
125. Karan is ……. than Prasad
A. more wiser B. most wise
C. wiser D. most wisest
126. She is more beautiful and
A. more cleverer B. most cleverest
C. more industrious D. None
127. My Phone is cheaper …… you
A. than B. no word
C. than that of yours D. than your
128. This building is constructed with
A. bricks and stones B. brick and stone
C. bricks and stone D. stones and brick
129. 5 kilo meters ……. a long distance
A. is B. are C. were D. no word
130. Linguistics ….. my favourite subject
A. is B. are C. were D. no word
131. find the odd one out
A. Apple B. Banana
C. Rose D. orange
132. They attacked ….. him
A. on B. against C. over D. no word
133. I shall help everyone of the students in …… times of difficulty
A. his B. her C. A or B D. their
134. I need not …… go there
A. to B. off C. over D. no word
135. I ,he and you went to the market ….. The correct order of the pronouns is
A.You, He, I B. I, You , He
C. He, you, I D. you, I, He
136. Neither of the books …. yours
A. is B. are C. were D. none
137. He is …… to believe her
A. enough foolish B. foolish enough
C. more enough foolish D. None
138. No sooner ….. left home than it began to rain
A. I had B. had I
C. I had been D. No word
139. He not only works (A)/in Google(B)/ but also in Amazon(C)/ No error(D)
140. Independence day is a ……
A. white letter day B. Red letter day
C. rainy day D. colourful day

Select the correct word in the following paragraph.

The World Health Organisation has confirmed that the Olympic Games … (1)… to be held in August …(2)… Rio de Janeiro will go ahead, the Zika virus … (3)… . An Emergency Committee meeting …(4)… by the WHO Director-General said there is "very low risk" of the virus spreading globally as a consequence of the Games being …(5)… in Brazil. The local mosquito population level is expected to …(6)… sharply in August, the Brazilian mid-winter, and the annual infection rate is expected to peak before that. Intensive vector-control measures at and around the venue will reduce …(7)… risks. It is possible that a few individuals …(8)… get infected and contribute to a global spread and start …(9)… a new chain of local transmission. But the risk will be the same as in any country where the local transmission of the Zika virus is … (10)… ; it does not get amplified even when thousands come together, as the committee has noted.

141. a) scheduled b) plan c) scheme d) organised e)probable
142. a) therewith b)into c)at d) in e) on
143. a) along with b) notwithstanding c) withstanding d) henceforth e) herewith
144. a) convened b) call c) had d) there e) out
145. a) play b) apprehended c) happen d) hold e) held
146. a) go b) drop c) fell d) happen e) lean
147. a) suspension b) suspicion c) transmission d) transportation e) transfusion
148. a) may b) might c) ought to d) will not e) hence
149. a) of b) off c) on d) at e) among
150. a) progress b) coming c) going d) ongoing e) showing

A.ARUNKUMAR
(Author, Trainer)
SIG, Hyderabad
9494665208



Answers

1.B	2.D	3.C	4.A	5.B	6.B
7.C	8.A	9.B	10.B	11.B	12.D
13.B	14.A	15.D	16.C	17.A	18.D
19.B	20.D	21.C	22.C	23.B	24 B
25.B	26.A	27.D	28.C	29.B	30. A
31.A	32.C	33.D	34.B	35.D	36.A
37.C	38.D	39.D	40.B	41.B	42.B
43.A	44.D	45.D	46.A	47.C	48.C
49.C	50.A	51.B	52.D	53.D	54.A
55.B	56.A	57.B	58.C	59.A	60.C
61.C	62.C	63.C	64.C	65.D	66.C
67.C	68.C	69.C	70.C	71.B	72.B
73.B	74.C	75.D	76.A	77.A	78.D
79.D	80.C	81.C	82.C	83.B	84.C
85.D	86.C	87.A	88.B	89.A	90.A
91.C	92.A	93.D	94.A	95.B	96.D
97.B	98.B	99.C	100.D	101.A	102.B
103.B	104.C	105.A	106.A	107.A	108.A
109.A	110.B	111.A	112.B	113.A	114.A
115.A	116.A	117.B	118.B	119.A	120.A
121.D	122.A	123.A	124.C	125.C	126.C
127.C	128.B	129.A	130.A	131.C	132.D
133.C	134.B	135.A	136.A	137.B	138.B
139.A	140.A	141.A	142.D	143.B	144.A
145.E	146.B	147.C	148.A	149.B	150.D


శర్వానంద్

మహానుభావుడి సరదాలు

శర్వానంద్ కథానాయకుడిగా యు.వి. క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెహరిన్ కథానాయిక. ఈ చిత్రానికి 'మహానుభావుడు' అనే పేరును ఖరారు చేవారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. విజయదశమికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కుటుంబ బంధాలకు చక్కటి హాస్యాన్ని మేళవించి రూపొందిస్తున్న చిత్రమిది. శర్వానంద్ పాత్ర చిత్రణ, ఆయన కామెడీ టైమింగ్ ఆకట్టుకుంటాయి. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఇటలీ, క్రొయేషియా, ఆస్ట్రియాతో పాటు పొల్లాచ్చి, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరిపాం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 24న చిత్ర ఫస్ట్‌లుక్, టీజర్‌ను విడుదలచేస్తాం' అని తెలిపారు. వినోదం, ప్రేమ, సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రమిదని మారుతి తెలిపారు. వెన్నెల కిషోర్, నాజర్, భద్రం తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, సినిమాటోగ్రఫీ: నిజార్ షఫీ, ఆర్ట్: రవీందర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్ సందీప్.



రజనీకాంత్ అతిథిగా..

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'స్పైడర్'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకుడు. తెలుగు, తమిళ భాషల్లో దసరా కానుకగా ప్రేక్షకులముందుకు రానుంది. మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలకు భారీగా సన్నాహాలు చేస్తున్నది చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్. చెన్నైలో ఏర్పాటు చేయబోతున్న ఓ కార్యక్రమానికి రజనీకాంత్, ప్రముఖ తమిళ దర్శకుడు శంకర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని సమాచారం. రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం '2.0' థియేట్రికల్ హక్కుల్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'స్పైడర్' ప్రచార కార్యక్రమానికి రజనీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని తెలిసింది.

యుద్ధానికి సిద్ధం

నాగచైతన్య, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. వారాహి చలన చిత్రం పతాకంపై రజని కొర్రపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ ఆర్.వి. మరిముత్తు దర్శకుడు. శ్రీకాంత్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ట్విట్టర్ ద్వారా శ్రీకాంత్ ప్రకటించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. తను బతకడం కోసం బలవంతుడైన శత్రువుపై తెగింపుతో పోరాడే యువకుడిగా నాగచైతన్య పాత్ర నవ్యరీతిలో సాగుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి వివేక్‌సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు.


నాగచైతన్య

అదే నిజమైన విజయంగా భావిస్తా!

'గత మూడేళ్ల నుంచి కెరీర్ సాఫీగా సాగిపోతున్నది. హృదయానికి దగ్గరైన కథాంశాల్ని ఎంచుకొని సినిమాలు చేస్తున్నాను. ప్రేక్షకులు నన్ను వినూత్న పాత్రల్లో చూడాలనుకుంటున్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా సినిమాలు చేయాలంటే రిస్క్ తీసుకోవాల్సిందే' అంటున్నది ఢిల్లీ సొగసరి తాప్సీ. కొద్దికాలంగా తెలుగు చిత్రసీమకు దూరంగా వుంటున్న ఈ సొగసరి తాజాగా 'ఆనందోబ్రహ్మ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకురానుంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో తాప్సీ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆమె చెప్పిన సంగతులివి...


తాప్సీ

చాలా విరామం తర్వాత తెలుగు సినిమా చేశారు?

- వాస్తవానికి నాకు హారర్ సినిమాలంటే ఇష్టం వుండదు. 'ఆనందోబ్రహ్మ' హాస్య ప్రధానంగా సాగే హారర్ సినిమా కాబట్టి అంగీకరించాను. ఈ చిత్రంలో భయం కంటే వినోదాత్మక అంశాలు ఎక్కువగా వుంటాయి. ప్రస్తుతం కామెడీ హారర్ జోనర్‌ను ప్రేక్షకులు బాగా ఇష్టపడుతున్నారు. ఈ చిత్ర కథ బాగా నచ్చింది. కాన్సెప్ట్ వినగానే వెంటనే సినిమాకు ఓకే చెప్పాను. దర్శకుడు మహి.వి.రాఘవకు దేవుడు, దెయ్యంపై నమ్మకం లేదు. అందుకే ఈ సినిమాను సరికొత్త కోణంలో ఆవిష్కరించాడు.

చిత్ర కథలో మీకు బాగా నచ్చిన అంశాలేమిటి?

- దయ్యాలు మనుషులకు భయపడటమనే పాయింట్ ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తుంది. దక్షిణాదిలో ఇప్పటివరకు ఏ సినిమా విషయంలో నాకు ఇంతటి స్వేచ్ఛ దొరకలేదు. స్క్రిప్ట్ మొదలుకొని అనేక విషయాల్లో చిత్ర బృందం నా సూచనల్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. అందుకే ఈ సినిమాను నా బేబీ (బిడ్డ) లాంటిది అనుకుంటున్నాను.

బాలీవుడ్‌లో మీరు నటించిన 'పింక్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు కమర్షియల్‌గా కూడా మంచి విజయాన్ని సాధించింది. ఈ సినిమా తర్వాత కథాంశాల ఎంపికలో మీ ప్రాధాన్యతలు ఏమైనా మారాయా?

- అలాంటిదేమి లేదు. 'పింక్' సినిమా తర్వాత నా మీద మీడియా వారి అటెన్షన్ బాగా పెరిగింది (నవ్వుతూ). ఫలానా జోనర్ చిత్రాల్ని మాత్రమే చేయాలనే ఎప్పుడూ అనుకోను. ప్రస్తుతం కమర్షియల్, కాన్సెప్ట్ ప్రధాన చిత్రాల మధ్య సమతుల్యతను పాటిస్తూ కథాంశాల్ని ఎంపిక చేసుకుంటున్నాను. ప్రేక్షకులు వారు పెట్టిన డబ్బుకు తగిన విధంగా న్యాయం జరిగిందని అనుకోవాలి. అలాంటి కథల్నే ఎంచుకుంటున్నాను. ఒక ప్రేక్షకురాలిగా నేను చూడగలిగిన సినిమాల్నే చేస్తున్నాను.

'పింక్' సినిమా విషయంలో మీకు లభించిన అత్యుత్తమ ప్రశంస ఏమిటి?

- సినిమా విడుదలైన తర్వాత చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీతో ఫొటోలు, సెల్ఫీలు అవసరం లేదు. ఇంత గొప్ప సినిమా చేసినందుకు మీకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అన్నారు. నా దృష్టిలో అదే పెద్ద కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. 'పింక్' సినిమా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ప్రజలు గుర్తుంచుకునే సినిమాలు చేయడమే నిజమైన విజయమని ఆ సినిమాతో తెలిసింది.

కథానాయికగా మీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది. ఏ విషయంలోనైనా బాధపడిన సందర్భాలున్నాయా?

- పరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలి మూడు సంవత్సరాల్లో ఎలాంటి సినిమాలు చేస్తున్నానో అర్థమయ్యేది కాదు. కానీ ఇప్పుడు కథాంశాల ఎంపికపై పూర్తి అవగాహన వచ్చింది. నా మనసుకు నచ్చిన సినిమాల్నే ఎంచుకుంటున్నాను. నేనెప్పుడు గొప్ప స్టార్ కథానాయికగా ఫీలవలేదు. ఇప్పటికి నేను పరిశ్రమలో స్ట్రగుల్ అవుతూనే వున్నాను. కొత్త కథల్ని ఎంచుకోవాలని, ప్రేక్షకుల అంచనాల్ని అందుకోవాలని నిరంతరం సంఘర్షణకులోనవుతూనే వున్నాను. దీనిని ఓ సవాలుగా స్వీకరిస్తున్నాను.

అబద్ధాన్ని నిజమని భ్రమిస్తే..!


మంచు లక్ష్మి

మంచు లక్ష్మీప్రసన్న ప్రధాన పాత్రలో నటిస్తూ మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. విజయ్ యలకంటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం హీరో మంచు మనోజ్, ఆయన భార్య ప్రణతి, మంచు లక్ష్మి కూతురు విద్యా నిర్వాణ స్క్రిప్ట్‌ను మంచు లక్ష్మి, దర్శకుడు విజయ్ యలకంటికి అందజేశారు. మంచు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 'నిజం కాని విషయాన్ని నిజమని భ్రమించే ఓ యువతి కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సున్నితమైన భావోద్వేగాలు, అనుబంధాల చుట్టూ తిరిగే కథ ఇది. నాకు నచ్చిన కథ కుదరడం వల్లే కొంత విరామం తరువాత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాను. ఈగ, బాహుబలి ది బిగినింగ్ చిత్రాలకు రాజమౌళి వద్ద దర్శకత్వం శాఖలో విజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఈ సినిమాతో తన ప్రతిభను నిరూపించుకుంటాడనే నమ్మకముంది. ఈ సినిమాతో పాటు ఓ టీవీ సిరీస్‌ను కూడా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. దానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సుహాసిని, ప్రొడక్షన్ డిజైనర్: లత.

దయ్యంతో ప్రేమలో పడితే..

సుజయ్, తనిష్క్, చంద్రకాంత్, రష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాకు మనసున్నది'. రాజశేఖర్ దర్శకుడు. దేవశంకర్‌గౌడ్ నిర్మాత. ఉదయకిరణ్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను సీనియర్ నటుడు భానుచందర్ విడుదలచేశారు. ప్రచార చిత్రాన్ని ప్రతాని రామకృష్ణగౌడ్ ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'దయ్యంతో ప్రేమలో పడిన ముగ్గురు యువకుల కథ ఇది. హారర్, ప్రేమ అంశాలకు వినోదాన్ని మిళితం చేసి ఈ సినిమాను రూపొందిస్తున్నాం' అని తెలిపారు. ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరించే ఈ చిత్ర తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముందని నిర్మాత చెప్పారు. ఈ కార్యక్రమంలో కవిత, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.


దివ్య, రాము, రాహుల్ విజయ్, పూరి జగన్నాథ్, విజయన్, వి.వి.వినాయక్, విజయ్

స్వచ్ఛమైన ప్రేమకథ

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ విజయ్ కథానాయకుడిగా పరిచయమవుతు వి.ఎస్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. పూజా కార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, విజయన్ కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి పూరి జగన్నాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'సుకుమార్ వద్ద దర్శకత్వ శాఖలో పలు చిత్రాలకు పనిచేశాను.ఆ అనుభవంతో తొలిసారి నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనంగా నిలుస్తుంది' అని తెలిపారు. ఈ నెల 21 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, మూడు నెలల్లో చిత్రీకరణ పూర్తిచేస్తామని నిర్మాత తెలిపారు. హీరోగా ఈ చిత్రం తనకు చక్కటి శుభారంభాన్ని అందిస్తుందనే నమ్మకముందని రాహుల్ విజయ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, మురళీశర్మ, పవిత్రలోకేష్, పోసాని కృష్ణమురళి, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ:ఛోటా.కె.నాయుడు, ఎడిటింగ్: నవీన్‌నూలి.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్


అనుపమ పరమేశ్వరన్, దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన మలయాళ చిత్రం 'జొమాంటే సువిశేషంగాళ్'. సత్యన్ అంతిక్కాడ్ దర్శకుడు. మేఘవర్ష క్రియేషన్స్ పతాకంపై నిర్మాత పత్తిపాటి శ్రీనివాసరావు 'అందమైన జీవితం' పేరుతో ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'కుటుంబ బంధాలతో ముడిపడిన ప్రేమకథా చిత్రమిది. తండ్రీకొడుకుల అనుబంధంతో పాటు ప్రేమికుల మధ్య ఉండే అనురాగాన్ని దర్శకుడు సత్యన్ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యముంటుంది. మలయాళంలో యాభై కోట్లకు పైగా వసూళ్లను సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది. సెన్సార్ నుంచి క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది. ఈ నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విద్యాసాగర్, మాటలు: ఘంటసాల రత్నకుమార్.

అవధుల్లేని ఆనందం

సినిమాల జోరు తగ్గినా సామాజిక మాధ్యమాల్లో మాత్రం అంతులేని అభిమాన గణంతో దూసుకుపోతున్నది గోవా సొగసరి ఇలియానా. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతాను అనుసరించే వారి సంఖ్య ఆరు మిలియన్లకు(అరవై లక్షలు) చేరుకున్నది. ఈ సందర్భంగా ప్రియుడు ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్ తీసిన తన బ్లాక్ అండ్ వైట్ ఫొటోను అభిమానులతో పంచుకున్నది ఇలియానా. ఫాలోవర్స్ సంఖ్య ఆరు మిలియన్లకు చేరుకోవడం అవధులేని ఆనందాన్ని కలగిస్తున్నదని తెలిపింది. సినీ కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితం, ప్రియుడి గురించిన ముచ్చట్లు ఏదైనా నిర్మొహమాటంగా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంటుంది ఇలియానా. అదే ఆమెకు సోషల్‌మీడియాలో భారీ అభిమానగణాన్ని తెచ్చిపెట్టింది. దక్షిణాదికి భిన్నంగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన తొలినాళ్లలో గ్లామర్ పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించిన ఇలియానా గత కొంతకాలంగా నటనకు ఆస్కారమున్న పాత్రలవైపు మొగ్గుచూపుతున్నది. ప్రస్తుతం హిందీలో చారిత్రక కథాంశంతో తెరకెక్కుతున్న 'బాద్‌షాహో' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అవకాశాలొస్తే దక్షిణాది చిత్రాల్లో నటించాలనుకుంటున్నానని, మంచి కథల కోసం ఎదురుచూస్తున్నానని చెప్పింది ఇలియానా.


ఇలియానా

డీజీపీ కార్యాలయంలో మొబైల్ డిటెక్టర్లు

విజిటర్ల సెల్‌ఫోన్లకు చెక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రతా చర్యల్లో భాగంగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కార్యాలయంలో ఐదేవల మొబైల్ డిటెక్టర్లను ఏర్పాటుచేశారు. దీంతో విజిటర్ల సెల్‌ఫోన్లకు చెక్‌పెడింది. నిత్యం అధికారులను కలిసేందుకు వచ్చే విజిటర్లు విచ్చలవిడిగా సెల్‌ఫోన్లు వాడుతున్నారు. మరికొందరు అధికారులతో మాట్లాడిన మాటలను గోప్యంగా రికార్డు చేస్తున్నారు. దీనిని పసిగట్టిన కార్యాలయ భద్రతాధికారులు సీసీ కెమెరాలు, మొబైల్ డిటెక్టర్లను ఏర్పాటుచేశారు. డీజీపీ చాంబర్‌లోకి వెళ్లే సమయంలో సెల్‌ఫోన్ ఉండరాదని హెచ్చరిస్తూ, బయట ఉన్న గార్డ్ వద్ద పెట్టాలని సూచిస్తారు. మెయిన్ గేట్ వద్ద భద్రతాసిబ్బంది తనిఖీచేసిన తర్వాతే విజిటర్లు డీజీపీ చాంబర్ వద్దకు వెళ్తుంటారు. అయితే, కొందరు విలువైనటువంటి వస్తువులు, సెల్‌ఫోన్లు తీసుకుని లోపలికి వెళ్తున్నారు. కట్టుదిట్టమైన భద్రత సిబ్బంది అడుగుగడుగునా పరిశీలించినా ఎవరైనా సెల్‌ఫోన్ తీసుకెళ్తే డిటెక్టర్ గుర్తిస్తుంది. డీజీపీ చాంబర్, ఆ పరిసరాల్లోకి వస్తున్న విజిటర్ వద్ద సెల్‌ఫోన్ ఉంటే డిటెక్టర్ శబ్దం చేస్తుంది. దీంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమై, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, తిరిగివెళ్లే సమయంలో ఇచ్చేస్తారు.

వచ్చేనెల 17న నగరానికి కేంద్రహోంమంత్రి రాక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీజేపీ తెలంగాణశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న 'తెలంగాణ విమోచన' దినోత్సవ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే లక్ష్మణ్ వెల్లడించారు. సభ ఎక్కడ నిర్వహించేది త్వరలో ఖరారు చేయనున్నట్లు గురువారం హైదరాబాద్‌లో మీడియాకు తెలిపారు. సెప్టెంబర్ నెలలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కూడా రాష్ట్రంలో మూడురోజులపాటు పర్యటించనున్నట్లు తెలిపారు.

మైనారిటీ పథకాల ప్రచారానికి కసరత్తు

- త్వరలో జిల్లాలవారీగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో యాత్రలు
- డిప్యూటీ సీఎం మహమూద్ అలీకి సమన్వయ బాధ్యత
- ప్రభుత్వం, పార్టీలో మైనారిటీల భాగస్వామ్యం పెంచాలని కేసీఆర్ నిర్ణయం
- పేర్ల సూచనకు జిల్లాలవారీగా ఇన్‌చార్జుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనారిటీవర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారానికి టీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తున్నది. ఇందుకు త్వరలో జిల్లాలవారీగా యాత్ర చేపట్టనున్నది. గతంలో ఎన్నడూలేని విధంగా మైనారిటీల సంక్షేమానికి భారీగా నిధుల కేటాయింపు, సంక్షేమ పథకాల అమలు, రాజకీయంగా నామినేటెడ్ పదవుల కేటాయింపు వంటిఅంశాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. దీనితోపాటు వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి త్వరలో మరికొన్ని పదవులు ఇవ్వాలని భావిస్తున్నది. ఎన్నికల హామీమేరకు మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు, మైనారిటీల స్వయం ఉపాధి కల్పన పథకాలకు రూ.500 కోట్ల కేటాయింపు, మైనారిటీ విద్యార్థులకు ఒకేసారి 204 గురుకులాల ప్రారంభం, షాదీముబారక్ వంటి వంటి కార్యక్రమాలను మైనారిటీవర్గాలకు వివరించే లక్ష్యంగా యాత్ర సాగనున్నది.

మైనారిటీలకు కమిటీలు, కార్పొరేషన్లలో పదవులు

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న మైనారిటీలకు నామినేటెడ్, పార్టీ పదవులు వచ్చేవిధంగా నియోజకవర్గాలవారీగా నాయకుల పేర్లు సేకరించాలని సీఎం కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి చురుగ్గా పనిచేసిన, కొత్తగా పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న వారి పేర్లను బాధ్యులు సూచించాల్సి ఉన్నది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరి పేర్లను తీసుకోనున్నారు. ప్రతి కార్పొరేషన్‌లో మైనారిటీవర్గం నుంచి ఒకరు డైరెక్టరుగా ఉండే విధంగా కమిటీలను ఏర్పాటుచేస్తారు. వీటితోపాటు పార్టీ, అనుబంధ సంఘాల్లో మిగిలిన వారికి అవకాశం కల్పిస్తారు. జిల్లాల బాధ్యులందరినీ సమన్వయం చేసే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీకి అప్పగించారు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, మెదక్‌కు ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, వరంగల్ జిల్లాకు ఖాదీ బోర్డు చైర్మన్ జహీద్, నల్లగొండకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం, రంగారెడ్డికి ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, నిజామాబాద్‌కు రెడ్కో చైర్మన్ అలీం, మహబూబ్‌నగర్‌కు టీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ముజీబుద్దీన్, హైదరాబాద్ జిల్లాకు సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీబాక్రీ, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఖమ్మం జిల్లాకు టీఎస్ఐడీసీ చైర్మన్ ఎంకే బేగ్‌లను ఇన్‌చార్జులుగా నియమించారు. వీరందరు ఈ నెల 29లోగా ఆయా జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారంతో పేర్లను సేకరించనున్నారు. త్వరలోనే హజ్ కమిటీ, ఉర్దూ అకాడమీ, మైనారిటీ కమిషన్, అనీసుల్ గుర్బా అనాథాశ్రమాలకు కమిటీలను వేయనున్నారు.

ఉపరాష్ట్రపతి పౌరసన్మానానికి భారీ ఏర్పాట్లు

- బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం
- వివిధశాఖల అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్


భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్న ఎం వెంకయ్యనాయుడుకు పౌరసన్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించిన నేపథ్యంలో ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతిని ఘనంగా సన్మానించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఇందుకు పక్కాగా ఏర్పాట్లుచేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. ఉపరాష్ట్రపతి ఈ నెల 21వ తేదీ ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని, అక్కడ ఆయనకు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకొని, పౌరసన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎక్కడా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ముఖ్యకార్యదర్శులు అధర్‌సిన్హా, సునిల్‌శర్మ, ఫైర్‌సర్వీసెస్ డీజీపీ రాజీవ్‌రతన్, ఇంటెలిజెన్స్ ఐజీ ఎంకే సింగ్, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, డీఐజీ అంజనీకుమార్, హైదరాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రశాంతి, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సమాచారశాఖ ప్రధాన సమాచార ఇంజినీర్ కిశోర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ పీ భాస్కర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి పౌరసన్మానం ఏర్పాట్లపై గవర్నర్‌కు వివరించిన సీఎస్

రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ గురువారం భేటీ అయ్యారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు ఉపరాష్ట్రపతికి పౌరసన్మానం ఏర్పాట్లు చేస్తున్నామని సీఎస్ గవర్నర్‌కు తెలిపారు. పౌరసన్మానం, ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా తీసుకుంటున్న చర్యలు, సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున చేపట్టిన ఉద్యోగ నియామక చర్యలను కూడా వివరించినట్టు తెలిసింది.

అరబ్ షేక్ చెరలో నగర బాలిక

- డబ్బుకు ఆశపడి కట్టబెట్టిన తల్లిదండ్రులు
- చిత్రహింసలు పడుతున్న చిన్నారి
- రూ.ఐదు లక్షలు తిరిగిస్తేనే బిడ్డను ఇస్తానంటున్న అహ్మద్
- ట్విట్టర్ ద్వారా స్పందించిన కేంద్రమంత్రి మేనకాగాంధీ



అరబ్ షేక్ అహ్మద్

చాంద్రాయణగుట్ట: నిరుపేద తల్లిదండ్రులు డబ్బుకు ఆశపడి 16 ఏండ్ల బిడ్డను 65 ఏండ్ల అరబ్‌షేక్‌కు ఇచ్చి కట్టబెట్టారు. అక్కడికెళ్లాక తనను చిత్రహింసలకు గురిచేస్తున్నాడని కుమార్తె రోదించగా, తల్లిదండ్రుల ఫిర్యాదుతో గురువారం ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదుచేశారు. పాతబస్తీ నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన కూలీ సయ్యదా ఉన్నీసా అలియాస్ అఫ్జల్‌బేగం, సయ్యద్ అఫ్సర్ దంపతుల కుమార్తె రుక్సార్ స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేది. రుక్సార్ మేనత్త గౌసియాబేగం ఒమన్ దేశంలో నివసించే కుమార్తె వద్ద ఉంటుంది. ఆమెకు ఒమన్‌లోని అరబ్‌షేక్ అహ్మద్‌తో పరిచయం ఏర్పడింది. అహ్మద్‌ను ఆమె జూన్ మొదటివారంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. భర్త సికిందర్‌తో కలిసి మేనకోడలు రుక్సార్‌ను షేక్ అహ్మద్‌కు ఇచ్చి పెండ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు డబ్బును ఎరగా చూపి, జూన్ మొదటివారంలోనే సికిందర్ స్నేహితులు హాజి, అహ్మద్ సహకారంతో అర్ధరాత్రి మతపెద్ద సమక్షంలో బార్కాస్‌లో పెండ్లి చేశారు. ఈ సమయంలో షేక్.. బాలిక తల్లిదండ్రులకు ఓ కూలర్, నోకియాఫోన్, యాక్టివా బైక్ కానుకగా ఇచ్చాడు. ఆరునెలల తర్వాత అమ్మాయిని మీకే అప్పగిస్తానని, ఓ ఇంటిని కొనిస్తానని నమ్మించాడు. పెండ్లయిన ఐదోరోజే బాలికను ఒమన్‌కు తీసుకెళ్లాడు. రెండువారాల నుంచి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారని, తిరిగి ఇండియాకు వచ్చేస్తానని రుక్సార్ రోదించింది. దీంతో షేక్ అహ్మద్‌కు ఫోన్‌చేసి కుమార్తెను ఇండియాకు పంపించాలని తల్లిదండ్రులు కోరారు. పెండ్లి సమయంలో గౌసియాబేగం, సికిందర్‌కు రూ.5లక్షలు ఇచ్చానని, ఆ డబ్బు తిరిగిస్తే రుక్సానాను ఇండియాకు పంపిస్తానని చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు.

స్పందించిన కేంద్రమంత్రి మేనకాగాంధీ

పాతబస్తీకి చెందిన బాలిక పెండ్లిని 65 ఏండ్ల షేక్‌తో నిర్వహించడంపై కేంద్రమంత్రి మేనకా గాంధీ గురువారం ట్విటర్ ద్వారా స్పందించారు. రూ.ఐదు లక్షల కోసం వృద్ధుడితో బాలికకు పెండ్లి చేయడం అమానుషమన్నారు. బలవంతంగా పెండ్లి చేసిన వారందరినీ గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌ను ట్విట్టర్‌లో కోరారు. దీనిపై కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ కల్పించుకుని బాలికను ఒమన్ నుంచి తీసుకురావాలని విజ్ఞప్తిచేశారు. జాతీయ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు కూడా బాలిక తల్లిదండ్రులను సంప్రదించాలని సూచించారు.

సిట్ పేరెంట్స్ కౌన్సెలింగ్‌కు భారీ స్పందన

- ఇప్పటివరకు 1200 మంది తల్లిదండ్రులు హాజరు
- డ్రగ్స్ వాడకం వల్ల అనర్థాలపై కాలేజీల్లో వీడియో ప్రదర్శనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ బారినపడిన తమ పిల్లలను కాపాడుకునేందుకు భారీసంఖ్యలో తల్లిదండ్రులు సిట్ కార్యాలయానికి వస్తున్నారు. పిల్లలను సక్రమమార్గంలో పెట్టేందుకు తల్లిదండ్రులకు సిట్ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇప్పటివరకు 1200 మంది పేరెంట్స్‌కు కౌన్సెలింగ్ వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పలువురు తల్లిదండ్రులు మొబైల్ ఫోన్లను అధికారులకు అందజేస్తున్నారు. వీటిలోని సమాచారాన్ని డీకోడ్‌చేసి డ్రగ్స్‌కు సంబంధించిన వివరాలను అధికారులు తెలుసుకుంటున్నారు. మొబైల్ డేటా ఆధారంగా 1,275 మంది వీఐపీల వివరాలను సేకరించినట్లు సమాచారం. పలువురు సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలు, పేరున్న విద్యాసంస్థల విద్యార్థులు డ్రగ్స్ ఉచ్చులో పడినట్లు తెలిసింది. వీరందరినీ విచారించేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నారు. డ్రగ్స్ దందాకు పూర్తిగా చెక్‌పెట్టాలని భావిస్తున్న అధికారులు విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారు. డ్రగ్స్ వాడకం వల్ల సంభవించే అనర్థాలు, వాటి వినియోగం వల్ల వచ్చే వివిధ రకాల వ్యాధులను వివరించి చెప్పేలా వీడియోలను రూపిందించి, వాటిని పాఠశాలల్లో, కాలేజీల్లో ప్రదర్శించేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లైసర్జిక్ యాసిడ్ డైథైలమైడ్ (ఎల్లెస్డీ), మిథలీన్ డయాక్సీ మెథంఫెటమైన్ (ఎమ్డీఎంఏ) అనే రెండు రకాల అత్యంత ఖరీదైన మత్తు పదార్థాలతోపాటు గంజాయిని విద్యార్థులు ఎక్కువగా తీసుకుంటున్నట్లు సిట్ అధికారుల విచారణలో వెల్లడయినట్లు సమాచారం. వీటిని నిషేధిత వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని కొరియర్ ద్వారా హైదారాబాద్‌కు తెప్పించుకుంటున్నారని అధికారులు తెలిపారు.



ఉద్యాన శిక్షణ సంస్థలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పట్టు పరిశ్రమశాఖ కార్యదర్శి సీ పార్థసారథి

27 నుంచి తెలంగాణ ఉద్యాన మహోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 27 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో తెలంగాణ ఉద్యాన మహోత్సవం-2017 నిర్వహించనున్నట్టు వ్యవసాయ ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ కార్యదర్శి సీ పార్థసారథి, ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకటరాంరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఉద్యానశాఖ ప్రాముఖ్యం, నూతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన పంటలు, మొక్కలు, వాటి విశిష్టతను ఈ మహోత్సవంలో వివరించనున్నట్టు చెప్పారు. గురువారం రాష్ట్ర ఉద్యాన శిక్షణ సంస్థలో జరిగిన సమావేశంలో మహోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై వివిధ కమిటీల చైర్మన్లు, సభ్యులతో వారు సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహిస్తున్న ఉద్యాన మహోత్సవానికి పక్కాగా ఏర్పాటుచేయాలని పార్థసారథి అధికారులను ఆదేశించారు.

తెలంగాణ యాత్రికుల రక్షణ కోసం రూ.3.50 లక్షలు

నేపాల్‌లోని భారత రాయబారికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేపాల్‌లో చిక్కుకున్న తొమ్మిది మంది తెలంగాణ యాత్రికుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేపాల్‌లోని భారత రాయబారికి రూ.3.50 లక్షలను పంపించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, విపత్తుల నిర్వహణశాఖ కమిషనర్ బీఆర్ మీనా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

బ్రెస్ట్ క్యాన్సర్ నివారణలో విప్లవాత్మక మార్పులు

- కిమ్స్ డాక్టర్ పీ రఘురాం
- శ్రీలంకలో కాలేజ్ ఆఫ్ సర్జన్స్ 48వ వార్షిక సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రెస్ట్ క్యాన్సర్ నివారణలో విప్లవాత్మక మార్పులకు భారత్ వేదికగా నిలిచిందని, గత దశాబ్దకాలంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీ రఘురాం వెల్లడించారు. ప్రఖ్యాత శ్రీలంక కాలేజ్ ఆఫ్ సర్జన్స్ 48వ వార్షిక కాంగ్రెస్ సదస్సు గురువారం శ్రీలంకలోని క్యాండీ నగరంలో జరిగింది. ఆ దేశంలో ఆంకాలజీ సర్జరీ పితామహుడిగా ఖ్యాతినార్జించిన టోని గాబ్రియేల్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో రఘురాం ప్రసంగించారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, మలేసియా, సింగపూర్ వంటి దేశాలకు చెందిన ప్రముఖ సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఇందులో ప్రసంగించిన అతిపిన్న సర్జన్‌గా రఘురాం ఖ్యాతిగడించారు. బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు భారత్‌లో తీసుకుంటున్న చర్యలపై దాదాపు 30 నిమిషాలపాటు ఆయన మాట్లాడారు.



శ్రీలంకలో జరిగిన సదస్సులో పాల్గొన్న డాక్టర్ పీ రఘురాం

భద్రతలో తెలంగాణ సూపర్

- ఉగ్రవాద నిర్మూలనలో ఇక్కడి పోలీసుల తీరు అభినందనీయం
- హైదరాబాద్‌లోని వర్సిటీల్లో ప్రశాంతత
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరెన్ రిజిజు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భద్రత విషయంలో తెలంగాణ రాష్ట్రం మెరుగ్గా ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరెన్ రిజిజు కితాబిచ్చారు. కొన్ని నెలల కిందట హైదరాబాద్‌లో ఉగ్రవాదులు తిష్ఠవేసి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తే తెలంగాణ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం గుర్తించి.. నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో కలిసి దుండగుల ఆటకట్టించిందని అభినందించారు. ఉస్మానియా విద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఐఐసీటీ ఆడిటోరియంలో జాతీయ భద్రతపై యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగాక క్షణాల్లో సమాచారాన్ని చేరవేసే వ్యవస్థ వచ్చిందని, దీన్ని సమర్థంగా ఉపయోగించుకుని ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉన్న యూనివర్సిటీలు ప్రశాంతంగా ఉన్నాయని రిజిజు పేర్కొన్నారు. ఏ దేశమైనా ప్రగతిపథంలో ముందుకుసాగాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సీమాంతర ఉగ్రవాదం, మత్తు మందుల అక్రమ రవాణా, దొంగనోట్ల వంటి వివిధ రకాల సవాళ్లను ఎదుర్కోవడానికి పటిష్ఠ భద్రత వ్యవస్థ ఉండి తీరాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్ వైస్‌చైర్మన్ శేఖర్‌రావు, స్టేట్ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్‌ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువారం హైదరాబాద్‌లోని ఐఐసీటీ ఆడిటోరియంలో జాతీయ భద్రతపై జరిగిన యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిరెన్ రిజిజు

వరంగల్ డీసీసీబీ పాలకవర్గం రద్దు

- అక్రమాలకు ఒడిగట్టిన పాలకవర్గం
- విచారణలో నిగ్గుతేల్చిన సర్కార్
- రద్దుచేస్తూ ఉత్తర్వుల జారీ
- వరంగల్ రూరల్ కలెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు



వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పదవులను అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కాజేసిన వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వరంగల్ డీసీసీబీలో భారీగా అవినీతి జరిగిందని, ముఖ్యంగా రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతున్నదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బ్యాంకును కాపాడాలని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సహా మరికొందరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సహా పాలకవర్గం సభ్యులు ఇష్టానుసారంగా బ్యాంకు సొమ్మును సొంతానికి వాడుకోవడమే కాకుండా ఆర్‌బీఐ, నాబార్డు, సహకార నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోలేదని ఎర్రబెల్లి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టింది. సహకార శాఖ రిజిస్ట్రార్ దాదాపు ఐదునెలలపాటు విచారణ జరిపారు. ముందుగా పాలకవర్గాన్ని సస్పెండ్ చేశారు. ఈ విచారణను అడ్డుకునేందుకు పాలకవర్గం కోర్టును సైతం ఆశ్రయించింది. తనపైన విధించిన సస్పెన్షన్‌ను జంగా రాఘవరెడ్డి కోర్టుకు వెళ్లి తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. విచారణ పూర్తి నివేదికను, చట్టపరమైన నిబంధనలు అన్ని అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఎం వీరబ్రహ్మయ్య డీసీసీబీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రద్దు ప్రతుల్ని చైర్మన్ జంగా రాఘవరెడ్డితోపాటు మరో 17 మంది డైరెక్టర్లకు పంపారు. డీసీసీబీకి తిరిగి కొత్త పాలకవర్గం వచ్చేదాకా వరంగల్ రూరల్ కలెక్టర్ (ప్రశాంత్‌జీవన్ పాటిల్)ను అఫీషియల్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు. కాగా ఈ రద్దు ఉత్తర్వులను చైర్మన్ సహా మిగతా డైరెక్టర్లకు అందజేసే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.

ఉత్తమ ఫొటోగ్రాఫర్ల పోటీ విజేతల ప్రకటన

- ముగ్గురు 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్లకు బహుమతులు
- రేపు రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఫొటోగ్రాఫర్ల పోటీలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు చెందిన ముగ్గురు ఫొటోగ్రాఫర్లు బహుమతులు సాధించారు. ఈ ఫలితాలను గురువారం ప్రకటించారు. మూడు క్యాటరిగిరీల్లో ప్రదానం చేసే బహుమతులకు వచ్చిన ఎంట్రీ ఫొటోలను రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రదర్శనకు ఉంచారు. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వీ సత్తిరెడ్డి, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ మధుకర్ విజేతలను ఎంపిక చేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు విభాగంలో 'నమస్తే తెలంగాణ' మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్ బందిగె గోపి ప్రథమ బహుమతి, బెస్ట్ న్యూస్ పిక్చర్ విభాగంలో నల్లగొండ ఫొటోగ్రాఫర్ ఆర్ ఆకాశ్ కన్సొలేషన్ బహుమతి, తెలంగాణ సంస్కృతి, చారిత్రక కట్టడాలు, పండుగలు విభాగంలో రంగారెడ్డి ఫొటోగ్రాఫర్ విష్ణుగౌడ్ కన్సొలేషన్ బహుమతి సాధించారు. విజేతలకు శనివారం ఉదయం రవీంద్రభారతిలో బహుమతులు ప్రదానం చేస్తామని టీపీజేఏ అధ్యక్షుడు జీ భాస్కర్ తెలిపారు.

జాగృతి మహిళా విభాగం

కో కన్వీనర్‌గా గందె కల్పన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన గందె కల్పనను నియమిస్తూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆదేశాలు జారీ చేశారు. క్రియాశీలంగా పనిచేస్తున్నవారికి మరిన్ని బాధ్యతలు అప్పగించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మహిళా విభాగం కన్వీనర్ చెన్నమనేని ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు.

కోటి మొక్కల లక్ష్యానికి చేరువలో సింగరేణి

ఇప్పటికే 80 లక్షలు నాటారు.. జోరుగా ప్లాంటేషన్ పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ కోటి మొక్కలు నాటే లక్ష్యానికి చేరువైంది. గురువారం నాటికి దాదాపు ఎనభై లక్షల మొక్కలు నాటామని, కొద్దిరోజుల్లోనే లక్ష్యానికి చేరుకుంటామని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల్లోని పదకొండు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రోజువారీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్క భూపాలపల్లిలోనే అత్యధికంగా 8.69 లక్షల మొక్కలను నాటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, వారి కుటుంబసభ్యులతోపాటు విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు.

గాయాల చికిత్సకు 'ప్రకృతి' లేపనం!


న్యూఢిల్లీ, ఆగస్టు 16: ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారు కొన్నిసార్లు అధిక రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకుంటారు. కొన్నిసార్లు మరణం కూడా సంభవిస్తుంది. రక్తం త్వరగా గడ్డకట్టలేని బలహీనత ఉన్న రోగులకు చిన్న గాయం తగిలినా రక్తస్రావాన్ని నియంత్రించడం వైద్యులకు కష్టతరమవుతుంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత శాస్త్రవేత్తలు ఓ జీవపదార్థాన్ని (లేపనం) అభివృద్ధి చేశారు. గాయపడిన వారిలో రక్తం త్వరగా గడ్డకట్టేందుకు దోహదపడే ఈ లేపనాన్ని కోల్‌కతాలోని భారత శాస్త్రీయ విద్య, పరిశోధన సంస్థ (ఐఐఎస్‌ఈఆర్‌కే), సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ సంస్థకు చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రకృతిలో లభించే జీవపదార్థాలు, పెప్టైడ్స్‌లో కొద్దిగా మార్పులు చేసి ఈ లేపనాన్ని రూపొందించినట్టు పరిశోధకులు తెలిపారు. ఆరోగ్యవంతులలో సహజసిద్ధంగా రక్తం గడ్డకట్టేందుకు పట్టే సమయం కన్నా ముందుగానే ఈ లేపనంతో గాయం మానినట్టు తమ పరీక్షల్లో వెల్లడైందని వారు పేర్కొన్నారు. ప్రమాదాల బారిన పడిన వారికి, యుద్ధాలలో గాయపడిన వారికి చికిత్స చేయడంలో తమ పరిశోధన కీలకమైన పాత్ర పోషించగలదని వారు తెలిపారు. తాము రూపొందించిన లేపనానికి ఉన్న మండే స్వభావాన్ని శరీరం తట్టుకోగలదని అన్నారు. చర్మపు కణజాలం లేని వారికి, గాయాలు త్వరగా మానని వారికి సైతం ఈ లేపనంతో చికిత్స చేయవచ్చని తెలిపారు.

కొత్త ప్రాజెక్టులపై డీపీఆర్లు ఇవ్వండి

ఏపీ, తెలంగాణకు కృష్ణా బోర్డు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్తవని ఆరోపిస్తున్న సాగునీటి పథకాల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను సమర్పించాలని కృష్ణానదీ యాజమాన్యబోర్డు రెండు తెలుగు రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నెల 22న విజయవాడలో బోర్డు సమావేశం జరుగనున్న నేపథ్యంలో గురువారం ఎజెండా అంశాలను వివరంగా పొందుపరుస్తూ రెండు రాష్ట్రాలకు బోర్డు సభ్యకార్యదర్శి లేఖలు పంపారు. ఇందులో ఏడో ఎజెండా అంశంగా రెండు రాష్ట్రాలు కొత్తవని పరస్పరం ఫిర్యాదు చేస్తున్న ప్రాజెక్టుల గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ముచ్చుమర్రి, గుండ్రేవుల, గాజులదిన్నె, గురురాఘవేంద్ర, పులికనుమ, సిద్ధాపురం, శివభాష్యం, మున్నేరు, రాజోలిబండ కుడికాల్వ వంటి తొమ్మిది ప్రాజెక్టులు కొత్తవని తెలంగాణ తెలిపింది. తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, డిండి, భక్త రామదాసు, తుమ్మిళ్ల, కల్వకుర్తి నీటి వినియోగం పెంపు, వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులు కొత్తవని ఏపీ ఆరోపిస్తున్నది. దీంతో నిజానిజాల పరిశీలనకు ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లు కావాలని బోర్డు కోరింది. విజయవాడ సమావేశం ఎజెండా అంశాలను బోర్డు ఖరారు చేసింది. ఈ ఎజెండాలో ప్రధానంగా పోతిరెడ్డిపాడుపై టెలిమెట్రీ, బోర్డు వర్కింగ్ మాన్యువల్, 2017-18 సంవత్సరానికి రెండు రాష్ట్రాలకు జలాల పంపిణీ తదితర అంశాలున్నాయి.

కవి ధేనువకొండ శ్రీరామమూర్తి ఇకలేరు



హైదరాబాద్: కవి, రచయిత డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి(70) కన్నుమూశారు. గురువారం ఉదయం గుండెపోటుతో ఓ ప్రైవేటు దవాఖానలో తుదిశ్వాస విడిచారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన శ్రీరామమూర్తి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈయన సిద్దేశ్వర రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదం అనే సంస్థను నడిపారు. వృత్తిని కొనసాగిస్తూనే కవిత్వ రచన, కథా రచన చేశారు. ఆయన చింతయామి, ఆశలసముద్రం, వల్మీకం వంటి కవితా సంపుటాలను వెలువరించారు. అమ్మ ఒడి అనే దీర్ఘకవితను రాశారు. ఐలాండ్ విల్లా పేర కథల సంపుటిని వెలువరించారు. ఒంగోలు ప్రాంత జీవిత వాస్తవికతను ఐలాండ్ విల్లా కథలు తెలియజేస్తాయి. మృతిపై పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు సంతాపం తెలియజేశారు. ఆయన రాసిన తొలి నవల స్నిగ్ధఛాయ. శ్రీరామమూర్తి మృతి సాహితీలోకానికి తీరని లోటని బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ తెలిపారు.

రైల్వే స్థలాల్లో ప్రీ-ఫ్యాబ్ టాయిలెట్లు

- రైల్వేట్రాకుల నుంచి 15 మీటర్ల దూరంలో మరుగుదొడ్ల ఏర్పాటు
- ఎకోఫ్రెండ్లీ, మొబైల్ టాయిలెట్లు
- ఏర్పాటు, నిర్వహణ బాధ్యత స్థానిక సంస్థలకు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో గల రైల్వేస్థలాల్లో మొబైల్, ఎకోఫ్రెండ్లీ, ప్రీ-ఫ్యాబ్ టాయిలెట్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఊపందుకున్నాయి. మనదేశంలోని అధిక శాతం రైల్వేస్టేషన్లలో నేటికీ పట్టాల మీదే మలమూత్ర విసర్జన చేయడం పరిపాటిగా మారింది. దీంతో వందశాతం ఓడీఎఫ్ లక్ష్యానికి చేరుకోవడం కష్టతరమైంది. ఈ ఒక్క కారణంగా అధికశాతం నగరాలు, పట్టణాలు ఓడీఎఫ్ స్థాయికి చేరడంలో విఫలమవుతున్నాయి. అందుకే రైల్వేశాఖ, పట్టణాభివృద్ధిశాఖలు సంయుక్తంగా వాస్తవికమైన ఈ సమస్యను పరిష్కరించడానికి నడుం బిగించాయి. రైల్వేస్థలాల్లో ఓడీఎఫ్ లక్ష్యాన్ని చేరుకోవడానికి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నాయి. దీనిప్రకారం రైల్వేస్థలాల్లో స్థానిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ముందుగా బిగించిన నిర్మాణాలను (ప్రీ-ఫ్యాబ్) నిర్దేశిత స్థలాల్లో ఏర్పాటు చేస్తారు. ఇందుకు అవసరమయ్యే స్థలాలను రైల్వేశాఖ సమకూర్చాలి. ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేవిధంగా చర్యల్ని తీసుకుంటారు. ప్రస్తుతమున్న రైల్వే ట్రాకుల పక్క నుంచి దాదాపు 15 మీటర్ల దూరంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తారు.


ప్రీ-ఫ్యాబ్ టాయిలెట్ నమూన

తాత్కాలిక నిర్మాణాలు

పట్టణ స్థానిక సంస్థలు వీటి నిర్వహణ బాధ్యతలను చేపడుతాయి. ఈ కార్యక్రమంలో అడుగు ముందుకు పడాలంటే స్థానిక సంస్థలు, రైల్వేశాఖతో ఒప్పందం కుదుర్చుకోవాలి. రైల్వేశాఖ ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆయా స్థలాలను వెనక్కి ఇచ్చే విధంగా శాశ్వత నిర్మాణాలు కాకుండా తాత్కాలిక నిర్మాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రైల్వే అధికారులు, స్థానిక సంస్థల అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, పలు రైల్వే స్థలాలను ఎంపిక చేస్తారు. దేశంలోని 4,041 నగరాలు, పట్టణాలను వందశాతం బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నది స్వచ్ఛభారత్ ప్రధాన లక్ష్యం. ఈ నెల రెండో వారం వరకు 1,260 పట్టణాలు ఈ స్థాయికి చేరుకున్నాయి. వీటిలో 990 పట్టణాలను థర్డ్ పార్టీ సంస్థలు పరిశీలిస్తున్నాయి. రెండురోజుల క్రితమే రైల్వేశాఖ పరిశుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైల్వే పట్టాల చుట్టూ, లైన్ల వెంబడి గల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని రైల్వే మంత్రిత్వశాఖ రాష్ట్ర పురపాలకశాఖ కార్యదర్శికి సమాచారాన్ని అందజేసింది.



గురువారం లక్నోలో యూపీ మంత్రి సురేశ్‌ఖన్నా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తెలంగాణ ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్

రాష్ట్ర రవాణాశాఖకు అవార్డుల పంట

ఆర్టీఏ ఎం-వ్యాలెట్ యాప్‌కు యూపీ ప్రభుత్వ ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రవాణాశాఖ రూపొందించిన ఆర్టీఏ మొబైల్ యాప్ 'ఎం-వ్యాలెట్' దేశంలోనే నంబర్-1గా నిలిచిన నేపథ్యంలో రాష్ట్ర రవాణాశాఖకు అవార్డుల పంట పండుతున్నది. ఇదే తరహాలో రవాణాశాఖ అందిస్తున్న ఆన్‌లైన్ సర్వీసులు కూడా అబ్బురపరుస్తున్నాయని పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశంసిస్తున్నాయి. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సురేశ్‌ఖన్నా నుంచి తెలంగాణ ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఎం-వ్యాలెట్ యాప్‌ను దాదాపు 30 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని, ఇది దేశంలోనే నంబర్-1గా నిలిచిందని సురేశ్‌ఖన్నా కొనియాడారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాల్లో కాగితరహిత సేవలు కొనసాగుతున్నాయని, ఎం-వ్యాలెట్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరయిందని యూపీ అధికారులు ఇటీవలి పర్యటనలో గుర్తించారు.

మరింత పటిష్ఠంగా జిల్లా పోలీస్

మొదటిపేజీ తరువాయి...

అందుబాటులోకి తెచ్చేలా స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం ఆ సమావేశంలో పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దానికి అనుగుణంగా డీజీపీ అనురాగ్‌శర్మ ఆదేశాలతో వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర కసరత్తు ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో విజయవంతంగా అమలులో ఉన్న పోలీస్ విధానాలను ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులకు అన్వయించే అంశాన్ని అధ్యయనం చేసేందుకు కమిటీలను వేశారు. ప్రతి కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు ఎస్పీలు, వీరితోపాటు ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ స్థాయి అధికారులు ఉన్నారు. వారు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో వివిధ పోలీస్ స్టేషన్లలో అధ్యయనం చేశారు. క్రోడీకరించిన అంశాలు, పోలీస్ ఉన్నతాధికారులతో చర్చోపచర్చల అనంతరం డీపీఎస్‌పీ-2017 తయారైంది. జూలై 13న డీజీపీ అనురాగ్‌శర్మ ఈ నివేదికను విడుదల చేశారు. దీని ఆధారంగా వెస్ట్‌జోన్‌లోని నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పోలీసులు అక్కడి స్థానిక అవసరాలకు అనుగుణంగా వేర్వేరుగా ప్రణాళికలను రూపొందించారు. తమ పరిధిలో పోలీస్ స్టేషన్ల అధునీకరణ, నూతన విధానాల అమలు, మౌలిక వసతుల కల్పనకు మొత్తం రూ.132కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసినట్టు వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఏడాదిలోగా వెస్ట్‌జోన్ పరిధిలోని జిల్లాల్లో మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

ప్రధానంగా ఏడు అంశాలపై అధ్యయనం

ఎస్పీల కమిటీలు హైదరాబాద్‌లో ప్రధానంగా ఏడు అంశాలపై అధ్యయనం చేశాయి. అందులో ఐటీ ఇనిషియేటివ్స్ ఇన్ పోలీసింగ్, స్టేషన్ హౌస్ ప్రాసెస్ అండ్ మేనేజ్‌మెంట్, బ్రాండింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సిబ్బందికి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళలు- చిన్నారుల భద్రత వంటి అంశాలున్నాయి.


డిస్ట్రిక్ట్ పోలీస్ స్టెబిలైజేషన్ ప్లాన్‌ను ఇటీవల హైదరాబాద్ పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌లో ఆవిష్కరిస్తున్న డీజీపీ అనురాగ్‌శర్మ (ఫైల్)

డీపీఎస్‌పీ-2017 అమలు చేస్తే...

హైదరాబాద్ తరహాలోనే జిల్లాల్లోనూ పౌరులకు సత్వర పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక్కడ వినియోగంలో ఉన్న హ్యాక్‌ఐ, కైట్ ఐ తరహాలో యాప్స్ జిల్లాలకు విస్తరిస్తాయి. ఎస్పీతోపాటు డీఎస్పీ స్థాయి కార్యాలయాల్లోనూ వీడియోకాన్ఫరెన్స్ అందుబాటులోకి వస్తుంది. బల్క్ ఎస్‌ఎంఎస్, టెలికాన్ఫరెన్స్ సేవలు కూడా కలుస్తాయి. కాల్‌డేటా ఎనాలసిస్ సిస్టం సీ-డాట్ ఏర్పాటు, జేఆర్‌ఎంఎస్(జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టం) వస్తుంది. మున్సిపాలిటీల్లో ట్రాఫిక్ నియంత్రణకోసం ఈ-చాలన్ విధానం వస్తుంది. పోలీస్ స్టేషన్ సేవలపై థర్డ్‌పార్టీనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే వ్యవస్థ ఏర్పాటు, సైబర్ ల్యాబ్స్ ఏర్పాటు, క్లూస్ టీంలను పటిష్ఠపర్చడంతోపాటు సబ్‌డివిజన్ స్థాయిలో మొబైల్ క్లూస్ టీంల ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి పని విభజన, బాధ్యతల అప్పగింతపై ప్రత్యేక దృష్టి పెడుతారు.

మరింత మెరుగైన సేవలు



సామాన్యులకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడం కోసం ఏడు ప్రధానాంశాలతో డీపీఎస్‌పీ-2017ను రూపొందించాం. హైదరాబాద్ విధానాలను స్థానికంగా అన్వయించుకున్నాం. ప్రాథమికంగా స్టేషన్లలో మౌలిక వసతుల కల్పన, సిబ్బందికి శిక్షణపై ప్రధానంగా దృష్టి పెట్టాం. దశలవారీగా పనులు పూర్తి చేస్తాం.

- ఎన్ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ, నల్లగొండ

కాలానుగుణంగా మార్పులు తెస్తున్నాం



ప్రజలకు సేవలు మరింత అందుబాటులోకి తేవటమే డీపీఎస్‌పీ లక్ష్యం. ఇప్పటికీ మన దగ్గర కొన్ని పాత విధానాలే ఉన్నాయి. కాలానుగుణంగా వాటిలో మార్పులు తెస్తున్నాం. ప్రధానంగా సిబ్బంది శిక్షణపై దృష్టి పెడుతున్నాం. సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగే లక్ష్యంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు వెళుతున్నాం.

- శ్వేతారెడ్డి, ఎస్పీ, కామారెడ్డి

కొత్త కలెక్టరేట్లకు టెండర్లు

మొదటిపేజీ తరువాయి...

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌కు సేకరించిన స్థలం అసైన్‌మెంట్ ల్యాండ్‌గా రికార్డుల్లో ఉంది. దీనికి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అలాగే జనగామ జిల్లాకు ఎండోమెంట్ స్థలాన్ని, పెద్దపల్లి జిల్లాకు ఇరిగేషన్ స్థలాన్ని గుర్తించారు. ఈ మూడు జిల్లాలకు సంబంధించి ఆయా శాఖల నుంచి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. డిజైన్లను ఉషారెడ్డి ఆర్కిటెక్ట్ సంస్థ ఆయా జిల్లాల చారిత్రక నేపథ్యం స్ఫురించేలా రూపొందించింది. వీటికి సీఎం కేసీఆర్ చేసిన కొన్ని మార్పులు, చేర్పులపై ఆర్‌అండ్‌బీ అధికారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. భూసేకరణ పూర్తయిన జిల్లాల్లో సిరిసిల్లల్లో 93ఎకరాలు, సూర్యాపేటలో 55.35, జోగుళాంబ గద్వాలలో 42, సిద్దిపేటలో 23.15, మంచిర్యాలలో 26.27, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 29.32, ఖమ్మంలో 18, జగిత్యాలలో 25.34, మహబూబాబాద్‌లో 32.11, నిజామాబాద్‌లో 25, కామారెడ్డిలో 25, వికారాబాద్‌లో 19, భువనగిరి యాదాద్రిలో 12, వనపర్తిలో 20 ఎకరాల చొప్పున సేకరించారు. ఇందులో సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి భారీగా 93 ఎకరాల స్థలం సేకరించారు. సిద్దిపేట, కొత్తగూడెం, కామారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, జనగామ, భువనగిరి, సిరిసిల్ల, నిర్మల్, సూర్యాపేట, మెదక్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వనపర్తి, జగిత్యాల, వరంగల్ (గ్రామీణం), మంచిర్యాల, గద్వాల, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, భూపాలపల్లి జిల్లాల్లో కలెక్టర్లు, ఇతర అధికారులకు నివాసగృహాలను నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.118.50కోట్లు అంచనా వ్యయంగా నిర్ధారించారు. 21 జిల్లాకేంద్రాల్లో కలెక్టర్ల నివాసగృహాలకు ఆరువేల చదరపు అడుగులు, జేసీల నివాసగృహాలకు మూడు వేల చదరపు అడుగులు, డీఆర్వో నివాస గృహాలకు 2,500 చదరపు అడుగులు, ఇతర అధికారుల గృహాలకు 1,500 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగామ, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ప్రభుత్వ వాస్తు సలహాదారు సుధాకర్‌తేజ స్థలాలను పరిశీలించారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నిర్మాణాల్లో వాస్తుదోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈఎన్సీ తెలిపారు.

వీడిన చిక్కుముళ్లు

మొదటిపేజీ తరువాయి...

అనుమతులు, పనుల పురోగతిపై సమీక్షలు జరిపారు. ఎప్పటికప్పుడు అధికారులకు టార్గెట్లు ఇస్తూ ఒక్కొక్కటిగా చిక్కుముళ్లను విప్పారు. ఈ కృషి ఫలించి 2015లో 4 వేల ఎకరాలకు నీరు అందించారు. ఆపై 2016లో 5,500 ఎకరాలకు ఇచ్చారు. ప్రస్తుతం కిన్నెరసాని రిజర్వాయర్‌లో ఇపుడు 8 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీనితో ఆరు కిలోమీటర్ల మేర 45 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నిర్మించిన కుడికాల్వ కింద మూడు వేల ఎకరాలకు, 20 కిలోమీటర్ల మేర వంద క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో చేపట్టిన ఎడమ కాల్వ కింద ఏడు వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అధికారులు రెండ్రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. వానకాలం పంటకు కడుపు నిండా నీరు అందుతున్నది. 12 ఏండ్ల కిందట పనులు మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టుకు ఇన్నాళ్లకు మోక్షం కలుగుతున్నది.

కిన్నెరసాని కెనాల్ వివరాలు

- ప్రాజెక్టు అంచనా వ్యయం - రూ.36.83 కోట్లు
- ఆయకట్టు - 10 వేల ఎకరాలు (పాల్వంచ మండలంలో 5100 ఎకరాలు, బూర్గుంపాడు మండలంలో 4900 ఎకరాలు)
- పనులు మొదలైన సంవత్సరం... 2005
- పూర్తి ఆయకట్టుకు నీరిస్తున్న సంవత్సరం - 2017

కాల్వలు తవ్వారు. గేట్లు మరిచారు..

పాత ఖమ్మం జిల్లా (ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి) పరిధిలో 10వేలకు పైచిలుకు ఎకరాలకు సాగునీరందించేందుకు చేపట్టిన పాలెం వాగు ప్రాజెక్టుది ఓ విచిత్ర ప్రస్థానం. 2005లో రూ.70.99 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. 50వేల క్యూసెక్కులతో దీన్ని డిజైన్ చేస్తే 86వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. బండ్‌కు 2006లో ఒకసారి, 2008లో మరోసారి గండి పడింది. దీనితో మిగిలిన 36వేల క్యూసెక్కుల వరద వెళ్లేందుకు 2010లో రూ.80 కోట్లు ఖర్చుపెట్టి నాలుగు వెంట్స్ (ద్వారాలు)తో నాన్ గేటెడ్ స్పిల్ నిర్మించారు. డిస్ట్రిబ్యూటరీలు మొదలు పెట్టారు. ఇటు గేట్లు లేకపోవడం,అటు డిస్ట్రిబ్యూటరీలు పూర్తి కాకపోవడంతో క్రస్ట్ లెవల్ వరకు మాత్రమే నీటి నిల్వ చేరింది. కాల్వలు అస్తవ్యస్తంగా ఉండటంతో పదివేల ఎకరాల లక్ష్యంలో కేవలం మూడు నుంచి నాలుగు వేల ఎకరాలకే నీరందింది. భూసేకరణ, అటవీ అనుమతులు వంటి చిక్కుముళ్ల వంటి సమస్యలు చుట్టుముట్టగా విసిగిపోయి కాంట్రాక్టరు సైతం బాధ్యత నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన సందర్భాలున్నాయి.

శరవేగంగా పనులు..

నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు భూసేకరణ చిక్కులు, అటవీ అనుమతులు ఇలా అన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించారు. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని కూడా సవరించడంతో గత మూడు నెలలుగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. దశాబ్దకాలంలో జరిగిన దాన్ని మించిన పనులు, ఈ మూడు నెలల్లో జరిగాయని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. కీలకమైన డి-8, 13, 14, 15 డిస్ట్రిబ్యూటరీలతో సహా 15 డిస్ట్రిబ్యూటరీల పనులను దాదాపు పూర్తి చేశారు. గేట్ల బిగింపు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. ఈ ఖరీఫ్‌లో తొలిసారిగా 7-8వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పాలెం వాగు వివరాలు..

- ప్రాజెక్టు అంచనా వ్యయం - రూ.70.99 కోట్లు (సవరణ వ్యయం రూ.221 కోట్లు)
- ఆయకట్టు - 10,132 ఎకరాలు
- నీరందే ప్రాంతాలు... భూపాలపల్లి జిల్లా వెంకటాపురం పరిధిలో 32 గ్రామాలు, వాజేడు మండలంలో ఏడు గ్రామాలు
- ప్రాజెక్టు ప్రారంభం - 2005

సాగునీటి కల్పన...

- 2013-14 - 3-4 వేల ఎకరాలు (వానకాలం పంట)
- 2016-17 - 5వేలు (వానకాలం), రెండు వేలు (యాసంగి)
- 2017-18 ప్రణాళిక - 7-8 వేల ఎకరాలు (వానకాలం, యాసంగి)

గత పాలకులకు చిత్తశుద్ధి ఎక్కడిది?



జలయజ్ఞం కింద తెలంగాణలో 34 ప్రాజెక్టులను చేపడితే తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్కటికూడా పూర్తిస్థాయి నీరిచ్చినవి లేవు. ఇది గత పాలకుల చిత్తశుద్ధి. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగంగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ మాకు ఆదేశాలిచ్చారు. అనేక చిక్కుముళ్లు..డిజైన్ లోపాలు, అటవీ అనుమతులు, క్లిష్టతరంగా తయారైన భూసేకరణ... ఇలా ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించి ప్రస్తుతం సాగునీటిని విడుదల చేస్తున్నం. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు భారీ ప్రాజెక్టులు, ఆదిలాబాద్‌లో మత్తడివాగు, ర్యాలీవాగు, గొల్లవాగు, గడ్డెన్నవాగు , మెదక్‌లో సింగూరు, నల్లగొండలో లోలెవల్ కెనాల్, డిసెంబరుకల్లా ఉదయ సముద్రం, ఎస్సారెస్పీ రెండోదశలో 70 శాతం పనులు.. ఇలా ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల్లో సాగు లక్ష్యాలు పూర్తి చేసేదిశగా వెళ్తున్నం. ఆదిలాబాద్ జిల్లాను తీసుకుంటే పదేండ్ల కాంగ్రెస్ 20వేల ఎకరాలకు నీరిస్తే మేం ఏడు లక్షల ఎకరాలకు అదనంగా నీళ్లిచ్చాం. రైతుల పట్ల మా చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం.

- టీ హరీశ్‌రావు, రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి



30 వేల పైకి పసిడి

రూ.40 వేలు దాటిన వెండి

న్యూఢిల్లీ, ఆగస్టు 17: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతోపాటు దేశవ్యాప్తంగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆభరణాలకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల ధర రూ.30 వేల మార్కును దాటింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.300 పెరిగి రూ.30,050 వద్ద స్థిరపడింది. బంగారంతోపాటు వెండి మరింత పుంజుకుంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ధర ఏకంగా రూ.900 పెరిగి రూ.40,200కి చేరుకుంది. జూలై నెలకుగాను అమెరికా ఫెడరల్ సమావేశం వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినట్లు మినిట్స్ విడుదల కావడంతో గ్లోబల్ మార్కెట్లో అతి విలువైన లోహాలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొందని బులియన్ ట్రేడర్ వెల్లడించారు. ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే అతి విలువైన లోహాలపై పెట్టుబడులు సురక్షితంగా ఉన్నట్లు పెట్టుబడిదారులు భావించారు. దీంతో తమ ఇన్వెస్ట్‌మెంట్లను వీటివైపు మళ్లించారు. అంతర్జాతీయ మార్కెట్లో భాగంగా సింగపూర్‌లో 0.43 శాతం పెరిగి ఔన్స్ గోల్డ్ ధర 1,288.30 డాలర్లుగా నమోదైంది. అలాగే ఔన్స్ వెండి ధర 17.12 డాలర్లకు చేరుకుంది.

రూ.100 కోట్లతో హైదరాబాద్‌లో దవాఖాన

ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన వీఐఎన్ఎన్

హైదరాబాద్, ఆగస్టు 17: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఆరోగ్య సేవల సంస్థ వీఐఎన్ఎన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వీఐఎన్ఎన్ హాస్పిటల్ విస్తరణ బాట పట్టింది. వచ్చే రెండు నుంచి మూడేండ్లకాలంలో తెలుగు రాష్ర్టాల్లో 10 దవాఖానాలను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వినాయక్ పంపాటి తెలిపారు. విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోని బేగంపేట వద్ద రూ.100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 250 పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే వచ్చే ఆరు నెలలోకాలంలో హైదరాబాద్‌లో మరో 200 బెడ్స్ కలిగిన ఆసుపత్రిని ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు. 2020 నాటికి తెలుగు రాష్ర్టాల్లో 200 నుంచి 250 పడక గదులు కలిగిన మరో తొమ్మిది దవాఖానాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో పడకల సంఖ్య 2,500కి చేరుకోనున్నది. ఇప్పటికే సంస్థ నేపాల్‌లో 1,600 పడకలు కలిగిన దవాఖానను నిర్వహిస్తున్నది.

ఆడీ నుంచి మరో రెండు కార్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 17: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ ఆడీ..దేశీయ మార్కెట్లోకి మరో రెండు కార్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ క్యూ7లో ప్రత్యేక డిజైన్ ఎడిషన్‌గా ప్రవేశపెట్టగా, సెడాన్ ఏ6 కూడా ఉంది. క్యూ7 ధర రూ.81.99 లక్షలుగాను, ఏ6 మోడల్ ధరను రూ.56.78 లక్షలుగా నిర్ణయించింది. డిజైన్ ఎడిషన్‌గా విడుదల చేసిన క్యూ7లో 3 లీటర్ల డీజిల్ ఇంజిన్ సామర్థ్యం కలిగిన కారు 249 హెచ్‌పీ శక్తిని ఇవ్వనున్నది. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 7.1 సెకండ్లలో అందుకోనున్నది. గంటకు 234 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చునని కంపెనీ వర్గాలు తెలిపాయి. అలాగే డిజైన్ ఎడిషన్ ఏ6 సెడాన్‌ను కూడా 2 లీటర్ల డీజిల్ ఇంజిన్‌తో రూపొందించింది. ఈ సందర్భంగా ఆడీ ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ మాట్లాడుతూ..దేశీయ మార్కెట్లోకి అడుగు పెట్టి పదేండ్లు పూర్తయిన సందర్భంగా ఈ ప్రత్యేక ఎడిషన్ కార్లను విడుదల చేసినట్లు చెప్పారు. కంపెనీకి చెందిన అత్యధిక ప్రజాదరణ పొందిన సెడాన్‌లలో ఏ6 ఒకటని ఆయన పేర్కొన్నారు.

సియాజ్‌లో సరికొత్త వెర్షన్

ప్రారంభ ధర రూ.9.39 లక్షలు



న్యూఢిల్లీ, ఆగస్టు 17: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ.. మధ్యస్థాయి సెడాన్ సియాజ్‌లో స్పోర్ట్స్ ఎడిషన్‌గాను ప్రవేశపెట్టింది. ఢిల్లీ షోరూంలో పెట్రోల్ రకం కారు రూ.9.39 లక్షలకు లభించనుండగా, డీజిల్ రకం రూ.11.55 లక్షలకు లభ్యమవనున్నది. డీజిల్ స్మార్ట్ హైబ్రిడ్ సియాజ్ ఎస్ వెర్షన్‌లో ఇంటీరియర్‌లో పలు మార్పులు చేసినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. సియాజ్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఎస్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, ముఖ్యంగా యువతియువకులు కోరుకుంటున్న విధంగా ఈ నూతన వెర్షన్‌లో పలు మార్పులు చేసినట్లు మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మార్కెటింగ్, సేల్స్ ఆర్ఎస్ కల్సి తెలిపారు. అక్టోబర్ 2014లో దేశీయ రోడ్లపై అడుగు పెట్టిన సియాజ్ ఇప్పటి వరకు 1.70 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌లో ఈ కారు లభించనున్నది. మిడ్‌సైడ్ సెడాన్ సెగ్మెంట్‌లో 43.5 శాతం వాటాతో సియాజ్ దూసుకుపోతున్నదని ఆయన వెల్లడించారు. స్మార్ట్ హైబ్రిడ్ టెక్నాలజీతో రూపొందించిన సియాజ్ డీజిల్ 28.09 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఈ కారును దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా షోరూంలలో సంస్థ విక్రయిస్తున్నది.

రూ.30 లక్షలకు మూడు లక్షలు ఆదా

యాక్సిస్ బ్యాంక్ నుంచి నూతన గృహ రుణ పథకం

ముంబై, ఆగస్టు 17:

దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ ఆర్థిక సేవల సంస్థ యాక్సిస్ బ్యాంక్..గృహ రుణ పరిధిని మరింత పెంచుకోవడానికి వినూత్న నిర్ణయం తీసుకున్నది. తాము తీసుకున్న రుణంపై కొన్ని నెలలపాటు నెలవారి చెల్లింపులు(ఈఎంఐ) జరుపాల్సిన అవసరం లేదని ప్రకటించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో నాలుగు త్రైమాసికాల్లో ఒకసారి ఎలాంటి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదు. ఇది నాలుగో సంవత్సరం, ఎనిమిది, 12 ఏటా మాత్రమే వర్తించనున్నదని షరతు విధించింది. అంటే రుణ కాలపరిమితి ముగిసే వరకు 12 ఈఎంఐలు చెల్లించాల్సిన అవసరం లేదన్న మాట. ఉదాహరణకు 20 ఏండ్ల కాల పరిమితి కలిగిన రూ.30 లక్షలు తీసుకున్న రుణంపై రూ.3.09 లక్షల వరకు ఆదా కానున్నదన్న మాట. రూ.30 లక్షల లోపు రుణం తీసుకున్న వారికి మాత్రమే ఈ అవకాశం కల్పించింది. ఇలా తీసుకున్న రుణాలపై వడ్డీరేటును 8.35 శాతంగా వసూలు చేస్తున్నది. బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంతో నికర వడ్డీ మార్జిన్‌పై ప్రభావం పడుతుందన్న దానిపై బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఆనంద్ స్పందిస్తూ..వినియోగదారులకు ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, అలాగే రుణ పరిధి కూడా మరింత పెరుగనున్నదని వ్యాఖ్యానించారు. ఒకవేళ ఒక ఈఎంఐ చెల్లించలేదో ఈ సదుపాయం కోల్పోనున్నట్లు ఆయన వెల్లడించారు. మంచి ఆర్థిక పరివర్తన కలిగివున్నవారు, రెగ్యులర్‌గా చెల్లింపులు జరిపే వారికి మాత్రమే ఈ సదావకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తక్కువ ఆదాయం కలిగిన వారికోసం 'ఆశా', శుభ్ ఆరంభ్' పేర్లతో ప్రత్యేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. బ్యాంక్ ఇచ్చిన మొత్తం రుణాల్లో ఆశా రుణ పరిధి వాటా 5 శాతంగా ఉందన్నారు. జూన్ చివరి నాటికి బ్యాంక్ రూ.1.68 లక్షల కోట్ల మేర గృహ రుణాలను అందించింది.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీరేట్ల తగ్గింపు

దేశంలో రెండో అతిపెద్ద ఆర్థిక సేవల సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్...పొదుపు ఖాతాలపై చెల్లించే వడ్డీరేటును తగ్గించింది. రూ.50 లక్షల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును అరశాతం కోత విధించడంతో వడ్డీరేటు 3.5 శాతానికి చేరుకుంది. రూ.50 లక్షలపైబడిన డిపాజిట్లపై మాత్రం యథావిధిగా వడ్డీ 4 శాతం చెల్లించనున్నట్లు ప్రకటించింది. సవరించిన వడ్డీరేట్లు శనివారం(ఆగస్టు 19) నుంచి అమలులోకి రానున్నట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. రెసిడెంట్, నాన్-రెసిడెంట్ కస్టమర్లకు ఈ తగ్గింపు వర్తించనున్నది. ఇప్పటికే ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు డిపాజిట్లపై వడ్డీరేట్లను అరశాతం వరకు కోత విధించిన విషయం తెలిసిందే.

ఇన్ఫీ రూ.13 వేల కోట్ల బైబ్యాక్!

శనివారం నిర్ణయం తీసుకోనున్న బోర్డు

బెంగళూరు, ఆగస్టు 17: దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ రూ.13 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు(బైబ్యాక్) చేయడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి శనివారం జరుగనున్న బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోబోతున్నది. 36 ఏండ్ల చరిత్ర కలిగిన సంస్థ తొలిసారిగా బైబ్యాక్ చేయనున్నది. సంస్థ వద్ద అధికంగా నిధులు ఉండటంతో డివిడెండ్ లేదా బైబ్యాక్ చేయాలని కంపెనీ వ్యవస్థాపకులు, మాజీ ఎగ్జిక్యూటివ్ అధికారులు తీవ్ర ఒత్తిడిన నేపథ్యంలో చివరకు బోర్డు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. 36వ వాటాదారుల సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13 వేల కోట్ల నిధులను వాటాదారులకు చెల్లింపులు జరుపనున్నట్లు ప్రకటించింది. అయితే డివిడెండ్ లేదా బైబ్యాక్ రూపంలో చెల్లింపులు జరుపనున్నది. ఈ నెల 19న జరుగనున్న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు బుధవారం పొద్దుపోయిన తర్వాత సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. సమావేశంలో తీసుకునే నిర్ణయాన్ని బీఎస్‌ఈకి అందించనున్నది. ఆదాయ, లాభాలు ఆశించిన స్థాయి కంటే అధికంగా ఉండటంతోపాటు సంస్థ వద్ద నగదు నిల్వలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో సంస్థ బైబ్యాక్ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో ఈ బైబ్యాక్ ప్రతిపాదనతో కంపెనీ షేరు ధర భారీగా పుంజుకునే అవకాశం ఉందని ట్రేడర్లు భావిస్తున్నారు. జూన్ 30 నాటికి కంపెనీ వద్ద 350 కోట్ల డాలర్ల నగదు నిల్వలు ఉన్నాయి. మన కరెన్సీలో రూ.24 వేల కోట్లకు పైమాటే.

మిస్త్రీతో టాటా పూర్తి తెగతెంపులు!

న్యూఢిల్లీ, ఆగస్టు 17: నూతన చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాటా గ్రూపు సంచలన నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్‌లో అతిపెద్ద వాటాదారు అయిన షాపూర్జి పల్లోంజి గ్రూపు(ఎస్పీ)తో ఉన్న అన్నిరకాల వ్యాపార సంబంధాలను పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని టాటా గ్రూపు యోచిస్తున్నది. ఈ గ్రూపును టాటా సన్స్ చైర్మన్‌గా ఉద్వాసనకు గురైన సైరస్ మిస్త్రీ కుటుంబం ప్రమోట్ చేస్తున్నది. దీంతో సైరస్‌మిస్త్రీ కుటుంబానికి చెందిన అన్ని సంస్థలతో ఉన్న డీలింగ్స్‌కు చెక్ పెట్టాలని టాటా సన్స్ యోచిస్తున్నది. టాటా సన్స్ బోర్డు, టాటా గ్రూపులోని మేజర్ ఆపరేటింగ్ సంస్థల ప్రమోటర్ గత నెలలో సమావేశమయ్యారని, ఈ భేటీలో పల్లోంజి గ్రూపుతో ఉన్న సంబంధాలను తెంచుకోవాలని సంస్థలను ఆదేశించినట్లు టాటా గ్రూపు ఇన్‌సైడర్స్ ఒకరు తెలిపారు. టాటా సన్స్ చైర్మన్‌గా ఉన్న మిస్త్రీని గతేడాది బోర్డు సభ్యులు అర్ధాంతరంగా ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. ఈ హఠాత్తు పరిణామం నుంచి టాటా సన్స్‌కు, మిస్త్రీకి వాదనలు నడుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే టాటా గ్రూపు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. 18.4 శాతం వాటాతో టాటా సన్స్‌లో షాపూర్జి పల్లోంజి గ్రూపు అతిపెద్ద సింగిల్ వాటాదారునిగా ఉంది.

కొత్త బీఎడ్, డీఎడ్ కాలేజీలు లేనట్టే!

నాణ్యమైన ఉపాధ్యాయ విద్యపై దృష్టి

ఉన్న సీట్లలో కోత పెట్టాలని కేంద్రం సూత్రప్రాయ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా కొత్తగా బీఎడ్, డీఎడ్ కాలేజీల ఏర్పాటుకు అనుమతులను నిలిపేయాలని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే బీఎడ్, డీఎడ్ కాలేజీలు అవసరానికి మించి ఉన్నాయని, వాటిలో పాఠాలు బోధించడానికి కావాల్సిన అధ్యాపకులు కూడా లేరన్న విషయాన్ని ఎన్సీటీఈ గుర్తించింది. ప్రస్తుతం బీఎడ్, డీఎడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల్లోనూ నైపుణ్యాలు కరువయ్యాయని, నాణ్యమైన ఉపాధ్యాయ విద్యాబోధన అందుబాటులోకి రావడంలేదని భావిస్తున్నది. వ్యాపారకోణంలో ప్రారంభించిన ఇలాంటి కళాశాలల్లో నాణ్యమైన బోధన అందడంలేదని, దాని ప్రభావం భావి ఉపాధ్యాయులపై పడి, విద్యార్థులకు అవసరమైన బోధన అందడంలేదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. బీఎడ్, డీఎడ్ కళాశాలల ఏర్పాటు విషయంలో ఎన్సీటీఈ నిబంధనలను 80 శాతం కాలేజీలు పాటించడంలేదు. పక్కా భవనాలు, అవసరమైన భూమి ఉండాలి. డీఎడ్ కళాశాలలు చాలావరకు నకిలీ పత్రాలు దాఖలుచేశాయి. గతేడాది అఫిలియేషన్లు, కొత్త కాలేజీల అనుమతి కోరుతూ రాష్ట్ర విద్యాశాఖకు, ఎన్సీటీఈకి చేసుకున్న దరఖాస్తుల్లో ఈ విషయం బయటపడింది. రంగంలోకి దిగిన రాష్ట్ర విద్యాశాఖ ఆయా కాలేజీలకు అనుమతులను నిరాకరించింది. వారిపై చీటింగ్ కేసులను నమోదుచేసింది. ఏపీలో ఎక్కువసంఖ్యలో నకిలీ పత్రాలతో కాలేజీలు కొనసాగుతున్నాయి. అవసరాలకు మించిన కళాశాలలు ఉన్నాయని, వాటిని నియంత్రించి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతోనే ఉపాధ్యాయ విద్యా కాలేజీలపై ఎన్సీటీఈ దృష్టి సారించిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో 186 బీఎడ్ కాలేజీలు ఉండగా, వాటిలో 18,600 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

చర్చలతో భూసేకరణ చేపట్టవచ్చు: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త భూసేకరణ చట్టం ప్రకారం చర్చల ద్వారా రైతుల నుంచి భూమిని సేకరించే అధికారం సర్కారుకు ఉన్నదని ఉమ్మడి హైకోర్టు గురువారం స్పష్టంచేసింది. చట్టంలోని నిబంధనలు.. చర్చల ద్వారా భూసేకరణకు అవకాశం కల్పిస్తున్నాయని, దీన్ని తోసిపుచ్చలేమని పేర్కొన్నది. చర్చల విషయంలో రైతులు, భూ యజమానుల అభ్యంతరాలను ప్రభుత్వం తప్పనిసరిగా పరిశీలనలోకి తీసుకుని పరిష్కరించాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ భూ సేకరణను చేపట్టడాన్ని సవాల్ చేస్తూ మామిడ్యాల, తానేధార్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన ఆరుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. చర్చలు జరుగుతుండగానే మిగతా రైతుల నుంచి కలెక్టర్ భూసేకరణ ఒప్పందాలు చేసుకోవడంపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తంచేశారు.

మూడేండ్ల అభివృద్ధిపై 'బంగారు తెలంగాణ దిశగా'

- సామాజిక, ఆర్థిక ముఖచిత్రం- 2017 పుస్తకం విడుదల
- ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాసే యువతకు ఉపయోగకరం
- నేటినుంచి హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో లభ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగాలకోసం పోటీ పరీక్షలు రాసే యువతకు ఉపయోగపడేలా ప్రణాళికశాఖ 'బంగారు తెలంగాణ దిశగా' టైటిల్‌తో పుస్తకాన్ని రూపొందించింది. రాష్ట్రం ఆవిర్భవించిన మూడేండ్లలో ఎలా అభివృద్ధి చెందుతున్నదో వివరిస్తూ తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2017 తెలుగు పుస్తకాన్ని విడుదల చేసింది. ఇటీవల ఉద్యోగుల కోసం ఈ మాడ్యుల్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య దీన్ని విడుదలచేశారు. తెలుగులో 25 వేల కాపీలను ప్రచురించారు. ఇందు లో 9 వేల పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగుల కోసం పంపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖుల కోసం ప్రతి జిల్లాకు 300 కాపీల చొప్పున పంపిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పుస్తకాన్ని అందించాలని నిర్ణయించారు. మిగిలిన పుస్తకాలను శుక్రవారం నుంచి నిరుద్యోగులకు ఒక్క పుస్తకానికి రూ.150 చొప్పున విక్రయించనున్నారు. ఈ పుస్తకాలను హైదరాబాద్‌లోని అర్థగణాక శాఖ కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన అన్ని జిల్లా కేంద్రాల్లో విక్రయానికి ఉంచుతారు.



'బంగారు తెలంగాణ దిశగా' పుస్తకాన్ని విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య

అనర్హుడికి అందలం!

- ఐటీశాఖలో ఇన్‌చార్జి జాయింట్ సెక్రటరీగా సీనియర్ ప్రోగ్రామర్
- మంత్రి వద్దన్నా కొనసాగిస్తున్న వైనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐటీశాఖలో కీలకమైన జాయింట్ సెక్రటరీ (జేఎస్) పోస్టుకు ఇన్‌చార్జిగా ఎలాంటి అర్హతలు లేని వ్యక్తిని నియమించారు. ఈ విషయం ఆ శాఖ మంత్రి కే తారక రామారావు దృష్టికి రాగా, వెంటనే అర్హతలు లేని వ్యక్తిని మాతృశాఖకు పంపించాలని (రిపాట్రియేషన్) నెలన్నర కిందటే ఆదేశించారు. అయినా అతన్నే ఇన్‌చార్జి జేఎస్‌గా కొనసాగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఐటీశాఖలో గత ఏప్రిల్‌లో జాయింట్ సెక్రటరీ పోస్టు ఖాళీ అయింది. మీసేవలో డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్)గా పనిచేస్తున్న పీ శ్రీనివాస్‌ను దీనికి ఇన్‌చార్జిగా నియమించారు. పీ శ్రీనివాస్ టీఎస్‌టీఎస్ (తెలంగాణ స్టేట్ టెక్నాలజికల్ సర్వీసెస్ లిమిటెడ్)లో సీనియర్ ప్రోగ్రామర్‌గా ఉండేవారు. అక్కడి నుంచి మీ సేవకు డిప్యూటీ డైరెక్టర్‌గా డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన ఐటీశాఖ జాయింట్ సెక్రటరీగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి, ఆ పోస్టులో ఆయననే రెగ్యులర్ చేయాలని కొందరు ప్రయత్నించినట్టు సమాచారం. సంబంధిత ఫైలును ఐటీశాఖ మంత్రి కేటీఆర్ వద్దకు పంపించారు. ఫైలుపై ఉన్నతాధికారులతో చర్చిస్తుండగా వాస్తవాలు బయటపడ్డట్టు తెలుస్తున్నది. పరిశీలించిన మంత్రి కేటీఆర్.. వెంటనే శ్రీనివాస్‌ను మాతృశాఖకు పంపించాలని ఆదేశించారు. దీనిపై మంత్రి పేషి నుంచి శ్రీనివాస్ అనర్హతలను కారణాలుగా పేర్కొంటూ లేఖ రాసినా బాధ్యతల నుంచి తప్పించకపోవడం గమనార్హం.

అన్నీ అనర్హతలే...

కనీసం గెజిటెడ్ అధికారికాని వ్యక్తికి ఇన్‌చార్జి జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. జేఎస్ పోస్టులో నియమితులయ్యే వ్యక్తి పేస్కేలు ఆ స్థాయిలోనే ఉండాలి. జేఎస్ స్థాయి పేస్కేలు 73,270-1,08,330 స్థాయిలో ఉంటుంది. కానీ శ్రీనివాస్ పేస్కేలు 35,120-87,130 మాత్రమే. ఇది సెక్రటేరియట్‌లో పనిచేసే సెక్షన్ ఆఫీసర్ పేస్కేలు (37,100-91,450) కన్నా తక్కువ. జేఎస్‌గా బాధ్యతలు అప్పజెప్పాలంటే ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండాలని 22.11993లో ఫైనాన్స్ అండ్ ప్లానింగ్‌శాఖ జారీచేసిన జీవో నంబరు 10లో స్పష్టం చేస్తుంది. శ్రీనివాస్ మాత్రం కార్పొరేషన్ ఉద్యోగి మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగి కూడా కాదు.

ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నాం

రిపాట్రియేషన్ చేయాలని మంత్రి ఆదేశించారు. కానీ ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నాం. జాయింట్ సెక్రటరీగా చేస్తున్నవారు రిటైర్ కావడంతో ఐటీరంగంపై ఉన్న పట్టును పరిగణనలోకి తీసుకొని శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాం. జేఎస్ కన్నా కింది స్థాయిలో ఉన్నవారు చాలా జూనియర్లు. అందుకే ఆయనకు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం దొరుకగానే రిపాట్రియేషన్ చేస్తాం.

- జయేష్‌రంజన్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



పోతుగల్‌లో సీఎం సతీమణి శోభ

ముస్తాబాద్: సమీప బంధువు గృహప్రవేశానికి సీఎం కేసీఆర్ సతీమణి శోభ హాజరయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో సీఎం మేనల్లుడు వెన్నమనేని పూర్ణచందర్‌రావు గురువారం నూతన గృహప్రవేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ బాపురావు, సర్పంచ్ పందిరి తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కుకు దక్షిణ కొరియా బృందం

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు అనుకూల అంశాలను పరిశీలించేందుకు దక్షిణ కొరియాకు చెందిన నిపుణుల బృందం గురువారం ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించింది. కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ కిహక్ సంగ్ నేతృత్వంలోని బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున టీఎస్‌ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి సారథ్యం వహించారు. హైదరాబాద్ నుంచి నేరుగా వరంగల్ రూరల్ జిల్లాలోని గీసుకొండ మండలం శాయంపేట హవేలీ గ్రామానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ప్రతిపాదిత టెక్స్‌టైల్ పార్కు స్థలంలో అనుకూలతలు, భౌగోళిక స్వరూపం, వనరులు, మానవవనరుల లభ్యత, విద్యుత్, జలసంపద, పర్యావరణ పరిస్థితులు, రోడ్డు, రైల్వే రవాణా వ్యవస్థ వంటి వాటిపై కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, టీఎస్‌ఐఐసీ ఎండీలు స్వయంగా కొరియా అధికారుల బృందానికి వివరించారు. నేతకార్మికుల వారసత్వ సంపదకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చేలా విస్తృత ప్రచారం కల్పించాలని కిహాక్ సంగ్ చెప్పారు. వీరివెంట జేసీ హరిత, మెగా టెక్స్‌టైల్ పార్కు డైరెక్టర్ మిహిర్ పరేఖ్, టీఎస్‌ఐఐసీ జీఎం రతన్ రాథోడ్, పరిశ్రమల శాఖ జీఎం హరిప్రసాద్ ఉన్నారు.



శాయంపేట హవేలీలో టెక్స్‌టైల్ పార్కు ప్రతిపాదిత స్థలంలో మ్యాపులను పరిశీలిస్తున్న దక్షిణకొరియా బృందం ప్రతినిధులు



బాల భీముడు..

సిద్దిపేట జిల్లా దుబ్బాక సర్కార్ దవాఖానలో గురువారం బాల భీముడు జన్మించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా భీమని మల్లారెడ్డిపేటకు చెందిన చింతకింది స్రవంతి ఐదున్నర కిలోల బరువుగల మగ బిడ్డకు జన్మనిచ్చింది. సాధారణంగా రెండు నుంచి మూడున్నర కిలోల బరువుతో పిల్లలు పుట్టడం సహజం. కానీ ఈ చిన్నోడు అధిక బరువుతో పుట్టడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. **–దుబ్బాక టౌన్**



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మందమర్రి రూరల్: భారీగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో టీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ బడికల శ్రావణ్, నాయకులు తోట సురేందర్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సింగరేణి జూనియర్, డిగ్రీ కళాశాలలో కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముడుపుల శేఖర్, మాసు వెంకటేశ్, అఖిలేశ్ పాండే, సంతోష్ పాండే, కుండం శ్రీనివాస్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

త్వరలో డీఎస్సీ

ఉద్యోగ నియామక ప్రక్రియ వేగవంతం: డిప్యూటీ సీఎం కడియం

హసన్‌పర్తి(వరంగల్) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాల కోసం త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని బాలికల గురుకుల విద్యాలయంలో మిజిల్స్, రుబెల్లా వాక్సినేషన్ కార్యక్రమాన్ని కడియం శ్రీహరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. హసన్‌పర్తి బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనుల వేగవంతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంసుధాకర్, కలెక్టర్ ఆమ్రపాలి, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో లలిత, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, నగర మేయర్ నన్నపునేని నరేందర్, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



జనగామ జిల్లాలోని ఓబుల్ కేశవాపూర్‌లో గురువారం శ్రీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఊరు రుణం తీర్చుకునేందుకు టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఓబుల్‌కేశవాపూర్‌లో వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. **– జనగామ రూరల్**



మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి తండ్రి, టీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, దివంగత రైతు నేత వేముల సురేందర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ డీ రాజేశ్వర్, ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరై సురేందర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. **-కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ/వేల్పూర్/ముప్కాల్**

ఏటా 2 లక్షల ఇండ్లు కట్టిస్తాం

మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడి

బైరాపూర్‌లో సామూహిక గృహప్రవేశాలు

బీర్కూర్: తెలంగాణ రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు ఉండకూడదని, వాళ్ల సొంతింటి కలను సాకారం చేసి లబ్ధిదారుల కండ్లల్లో ఆనందం చూడాలన్నదే సీఎం కేసీఆర్ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఏటా రెండు లక్షల ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నదని చెప్పారు. కామారెడ్డి జిల్లాలో మొదటిసారిగా బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. పుణ్యాహావాచనం నిర్వహించి సామూహిక గృహప్రవేశాలు చేయించారు. నూతన గృహాల్లో పాలు పొంగించారు. హోమంలో మంత్రి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మంత్రి, గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారులతో మంత్రి ముచ్చటించారు. ఇచ్చిన హామీ మేరకే బైరాపూర్‌లో 40 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించినట్టు చెప్పారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



కామారెడ్డి జిల్లా బైరాపూర్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి పోచారం, బైరాపూర్‌లో 'డబుల్' ఇండ్ల సముదాయం


ఇండ్ల నిర్మాణంలో నాణ్యత లోపించొద్దు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో నాణ్యత విషయమై రాజీపడొద్దని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వచ్చే జనవరి 26న లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల తాళాలు అందిస్తామన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నగర పంచాయతీ పరిధిలోని చుక్కాయపల్లిలో 40 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలనే ఉద్దేశం తో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. ఇండ్లకోసం ఎవరూ మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, అధికారులకు కూడా డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. పట్నంలో ఉన్న ఇండ్ల మాదిరిగానే గ్రామాల్లోనూ ఇండ్లు కట్టిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్ననిరంజన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ ఇక్బాల్, సింగిల్ విండో చైర్మన్ రఘుపతిరావు, తాలూకా ప్రత్యేక అధికారి కృష్ణయ్య, కమిషనర్ రామలింగం, ఆర్‌అండ్‌బీ ఈఈ భీముడు, డీఈ కేవీఎన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చుక్కాయిపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 379.431 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	3003	3003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	2489	11442	1615	1608.07	37.646	28.60
జూరాల	2544	2544	1045	1039.08	9.66	6.263
తుంగభద్ర	8734	652	1633	1617.61	100.86	52.00
శ్రీశైలం	1713	46	885	779.5	215.807	20.09
నాగార్జునసాగర్	0	671	590	500.30	312.045	115.785
పులిచింతల	0	0	175	118.94	45.77	3.55
ప్రకాశం బ్యారేజీ	8833	8833	54.95	55.95	3.070	2.81

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	3333	1522	1511.46	102.732	64.48
కడెం	550	654	700	685.48	7.6	4.392
ఎస్సారెస్పీ	0	174	1091	1054.90	90.313	9.214
సింగూరు	0	355	1717.93	1708.66	29.91	17.57
నిజాంసాగర్	253	60	1405	1380.58	17.803	1.410
ఎల్లంపల్లి	1100	418	485	472.87	20.175	10.93
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	106806	105648	45	45	2.93	2.93

బిడ్డల్ని గోదావరిలోకి తోసి తల్లి ఆత్మహత్య

మృతులు నిజామాబాద్ జిల్లా బర్దీపూర్ వాసులు

బాసర: ఓ మహిళ తన ఇద్దరు పిల్లలను గోదావరిలోకి తోసి తానూ దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయవిదారక సంఘటన గురువారం నిర్మల్ జిల్లా బాసరలో వెలుగుచూసింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దీపూర్‌కు చెందిన అర్చన(27), రాము దంపతులు. వీరికి కూతురు దీక్షిత(7), కొడుకు కీర్తి రాజు (4 నెలలు) ఉన్నారు. భర్త రాము బతుకుదెరువు నిమిత్తం ఆఫ్ఘనిస్థాన్ వెళ్లాడు. రెండేండ్లకోసారి వచ్చి వెళ్తుంటాడు. అర్చన పుట్టినిల్లయిన బర్దీపూర్‌లో సొంతిల్లు కట్టుకుని తల్లి సుజాతతో కలిసి ఉంటుంది. కొడుకు కీర్తిరాజును ఓ ప్రైవేటు దవాఖానలో చూపించడానికి కూతురు దీక్షిత, తల్లి సుజాతతో కలిసి అర్చన బుధవారం నిజామాబాద్ వెళ్లింది. చికిత్స తరువాత దవాఖాన నుంచి బయటకు రాగానే కొబ్బరిబోండాం తీసుకురావాలని అర్చన తన తల్లికి చెప్పడంతో ఆమె వెళ్లింది. ఈలోగా అర్చన తన కూతురు, కుమారుడితో కలిసి ఆటోలో వెళ్లిపోయింది. తల్లి సుజాత వచ్చి చూడగా.. అర్చన కనిపించలేదు. బంధువులు సాయంత్రం వరకు వెతికి దవాఖానలో సీసీ ఫుటేజీ పరిశీలించగా, ఆటోలో వెళ్లినట్టు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులకు అనుమానం వచ్చి బాసరకు వచ్చి ఆలయ పరిసరాల్లో వెతికారు. గురువారం ఉదయం గోదావరి పుష్కర ఘాట్ వద్ద గల ఫిల్టర్ బెడ్ పక్కన నదిలో అర్చన, దీక్షిత, కీర్తి రాజు మృతదేహాలను గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రఘుపతి తెలిపారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో భర్త..

అర్చన భర్త రాము స్వగ్రామం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రి. అర్చనతో పదేండ్ల క్రితం వివాహం జరిగింది. పిప్రిలో ఎవరూ లేకపోవడంతో రెండేండ్ల క్రితం అర్చన బర్దీపూర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకుంది. గతేడాది దీపావళికి రాము ఆఫ్ఘనిస్థాన్ వెళ్లే సమయానికి అర్చన గర్భిణి కావడంతో గత ఏప్రిల్ 30న కీర్తిరాజ్ జన్మించాడు. తన కొడుకు పుట్టిన విషయం రాముకు తెలుపడంతో సంతోషం వ్యక్తం చేశాడని, కొడుకును కళ్లారా చూడకముందే గోదావరిలో కలిసిపోయాడని బంధువులు విలపించారు.

మతిస్థిమితం లేకనే...

అర్చనకు ఏడాదికాలంగా మతి స్థిమితంగా ఉండటం లేదని నిజామాబాద్‌లో చికిత్స చేయిస్తున్నామని ఆమె కుటుంబీకులు తెలిపారు. కుమారుడు పుట్టిన తరువాత కూడా నెల రోజులపాటు పసిగుడ్డును పట్టించుకోలేదన్నారు.



సంఘటనా స్థలం వద్ద విచారణ జరుపుతున్న డీఎస్పీ అందె రాములు. ఇన్‌సెట్‌లో అర్చన (ఫైల్)

పలుచోట్ల భారీగా గంజాయి స్వాధీనం

ఖమ్మం మయూరిసెంటర్/నారాయణఖేడ్/తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: పలు జిల్లాల్లో గురువారం గంజాయి భారీగా పట్టుబడింది. ఖమ్మం రైల్వే పోలీసులు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మధిర సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్10 బోగీలో ఓ ట్రాలీ బ్యాగ్, మూడు కార్టన్లు అనుమానాస్పదంగా కన్పించాయి. వాటిని పరిశీలించగా గంజాయి బయటపడింది. ఇందుకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం హంగిర్గా(కె) పరిధిలోని చందర్‌నాయక్ తండా, నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి పరిధిలోని గంగారాం తండా శివారులో, నాగల్‌గిద్ద మం డలం కరస్‌గుత్తి పంచాయతీ పరిధిలోని గంగారాం తండా శివారు పొలంలో సాగు చేస్తున్న గంజాయి పంటను ధ్వంసం చేశారు. వీటి విలువ రూ.6.75 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ గాయత్రీదేవి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మద్దికుంటకు చెందిన చిట్నేని విక్రంరావు(23) బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ముస్తాబాద్ మండలం గూడేనికి చెందిన పడాల వెంకటసాయి(19) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వీరిద్దరు చిన్ననాటి స్నేహితులు. వీరికి గంజాయి అలవాటైంది. ఇతరులకు సరాఫరా చేస్తూ సొమ్ము చేసుకోవచ్చని భావించిన వీరు హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండి నుంచి ఓ మహిళ వద్ద రూ.20 వేలకు నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తిమ్మాపూర్ మండలంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, యువకులకు విక్రయించే ప్రయత్నంలో రామకృష్ణకాలనీ వద్ద బుధవారం సాయంత్రం ఎల్‌ఎండీ పోలీసులకు పట్టుబడ్డారు.

మూడో తరగతి విద్యార్థి
ఆత్మహత్యాయత్నం

పద్యం నేర్వలేదని టీచర్ దాష్టీకం

వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో ఘటన

పెబ్బేరు, నమస్తే తెలంగాణ: ఓ ఉపాధ్యాయుడి దాష్టీకం మూడోతరగతి విద్యార్థి ప్రాణాల మీదికి తెచ్చింది. ఉపాధ్యాయుడు కొడుతాడనే భయంతో గురువారం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత బాలుడి తండ్రి కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం శేరుపల్లి గ్రామానికి చెందిన జలకరి గొల్ల నాగన్న కుమారుడు ఆనంద్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్నాడు. తెలుగు పద్యాలు కంఠస్థం చేయాలని ఉపాధ్యాయుడు మూడు రోజులుగా ఒత్తిడి చేయటంతోపాటు చీపురుకట్టతో చితకబాదుతున్నాడు. పద్యాలు రాకపోతే శుక్రవారం కూడా కొడుతాడనే భయంతో గురువారం బడి నుంచి ఇంటికి రాగానే గదిలోకి వెళ్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు వచ్చి గోనెసంచులతో మంటలు ఆర్పారు. ఆ వెంటనే 108 వాహనంలో వనపర్తి జిల్లా దవాఖానకు తరలించారు. 80శాతం కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. ఉపాధ్యాయుల వల్లనే ఇలా జరిగి ఉంటే చర్యలు తీసుకుంటానని పెబ్బేరు ఎంఈవో జయరాములు తెలిపారు.

పరువుపోయిందని దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

డిండి: కొందరు తమపై చెడుగా ప్రచారం చేయడంతో మనస్తాపానికి గురైన దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో భర్త మరణించగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన సోమిడి యాదయ్య, అనిత దంపతులు. అనితకు వివాహేతర సంబంధం ఉందంటూ స్థానికులు కొందరు ప్రచారం చేశారు. ఈ విషయమై సదరు దంపతులు 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసత్య ప్రచారంతో గ్రామంలో తమ పరువుపోయిందని దంపతులు బుధవారం రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని యాదయ్య తన ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు అక్కడికి చేరుకొని దంపతులను దేవరకొండ దవాఖానకు తరలిస్తుండగా యాదయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. అనితను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు గురువారం దేవరకొండ దవాఖాన ఎదుట ధర్నా నిర్వహించారు.

వీఆర్వో సస్పెన్షన్

రెవెన్యూ వాట్సప్ గ్రూపులో అశ్లీల వీడియో పోస్టులు

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు వీఆర్వో షేక్ సైదులును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సురేంద్రమోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులను సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కోదాడ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఓ వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేశారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలను కలుపుతూ ఈ గ్రూపు కొనసాగుతున్నది. ఈ గ్రూపులో ఈనెల 2న రాత్రి కాపుగల్లు వీఆర్వో షేక్ సైదులు అశ్లీల వీడియోలు పోస్టు చేశారు. ఈ పోస్టులను చూసిన ఉద్యోగులు స్థానిక తహసీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించిన కలెక్టర్ సురేంద్రమోహన్ షేక్ సైదులను సస్పెండ్ చేశారు.

కిలిమంజారోపై మనోళ్లు

దక్షిణాఫ్రికాలోని అత్యంత ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాల పదోతరగతి విద్యార్థి నాయిని మల్లేశ్ అధిరోహించాడు. అక్కడ ఈనెల 14న గమ్యానికి చేరుకొని జాతీయ పతాకంతోపాటు కుమ్రంభీం, అంబేద్కర్, సీఎం కేసీఆర్ చిత్రపటాలను ప్రదర్శించాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం మాందాపూర్‌కు చెందిన బస్వరాజ్ ఈనెల 15న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకంతోపాటు సీఎం కేసీఆర్, చిత్రపటాన్ని ప్రదర్శించాడు.

- ఆసిఫాబాద్/మెదక్, నమస్తే తెలంగాణ



కిలిమంజారోపై కేసీఆర్ చిత్రపటాలను ప్రదర్శిస్తున్న మల్లేశ్, బస్వరాజ్

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

బషీరాబాద్: కారు–బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు–బషీరాబాద్ ఆర్‌అండ్‌బీ రోడ్డులో నారాయణపూర్ గేట్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మాసన్‌పల్లికి చెందిన నలుగురు యువకులు బైక్‌పై గ్రామం నుంచి తాండూరు వైపు వస్తున్నారు. నారాయణపూర్ గేటు వద్ద ఎదురుగా తాండూరు వైపు నుంచి వస్తున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో రఘు(18), జగ్గప్ప(20)లు అక్కడికక్కడే మృతి చెందగా, పాండు, రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.



అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర బీజేపీ కార్యనిర్వాహక కార్యదర్శి, యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి గ్రామానికి చెందిన కే రమేశ్ వివాహం గురువారం లక్కారంలో జరిగింది. ఈ పెండ్లికి ఆ రాష్ట్ర సీఎం పేమకండు, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. **- చౌటుప్పల్**



ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో గురువారం మానుకోట జిల్లాలో పర్యటించారు. ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి రాంచంద్రునాయక్‌తో కలిసి ఆయన కురవి మండలం సీరోలు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. **- మహబూబాబాద్, నమస్తే తెలంగాణ**

హెచ్‌సీఏ ఎలెవన్ సారథిగా రాయుడు

మొయినుద్దౌలా టోర్నీ



హైదరాబాద్: ప్రఖ్యాత మొయినుద్దౌలా క్రికెట్ టోర్నీలో అంబటి రాయుడు హెచ్‌సీఏ ఎలెవన్‌కు సారథిగా ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం హెచ్‌సీఏ ఎలెవన్ జట్టుతో పాటు హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎలెవన్ జట్టును ప్రకటించారు. ప్రెసిడెంట్ ఎలెవన్ జట్టుకు అమోల్ షిండే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రకటించింది. ఈనెల 22 నుంచి 31 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు.

జట్ల వివరాలు

హెచ్‌సీఏ ఎలెవన్: అంబటి రాయుడు (కెప్టెన్), సీవీ మిలింద్, అక్షత్ రెడ్డి, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, ఠాకూర్ తిలక్, సందీప్, ఆశిష్ రెడ్డి, ఆకాశ్ భండారీ, మెహదీ హసన్, ఎండీ సిరాజ్, రవికిరణ్, సుమంత్, ముదస్సర్, సాకేత్ సాయిరాం, భగత్ వర్మ.

హెచ్‌సీఏ ప్రెసిడెంట్ ఎలెవన్: అమోల్ షిండే(కెప్టెన్), యతిన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రాహుల్, చందన్, మీర్ జావీద్ అలీ, రోహిత్ రెడ్డి, నీరజ్ బిస్త్, ప్రణీత్ రెడ్డి, కార్తీక్, త్యాగరాజన్, సుదీప్ త్యాగి, హితేశ్ యాదవ్, ఒమర్ ఖాన్, రాధా క్రిష్ణ, వంశీవర్ధన్ రెడ్డి.

లక్ష్యసేన్‌దే 'బల్గేరియా' ఓపెన్

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ లక్ష్యసేన్ మరోసారి తన సత్తాచాటాడు. టోర్నీ.. టోర్నీకి తన ఆటకు మరింత మెరుగులు అద్దుకుంటున్న ఈ 16 ఏండ్ల కుర్రాడు అంతర్జాతీయ వేదికపై మళ్లీ తళుక్కుమన్నాడు. గురువారం సోఫియా వేదికగా జరిగిన బల్గేరియా ఓపెన్ అంతర్జాతీయ సిరీస్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17 తేడాతో రెండో సీడ్ జ్వోనీమిర్(క్రొయేషియా)పై అద్భుత విజయాన్నందుకున్నాడు. 57నిమిషాల పాటు సాగిన టైటిల్ పోరులో తొలి సెట్‌ను ప్రత్యర్థికి చేజార్చుకున్న లక్ష్యసేన్..ఆ తర్వాత పుంజుకుని వరుస సెట్లను కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో స్మాష్ లు, డ్రాప్‌షాట్లు, నెట్ గేమ్‌తో జ్వోనీమిర్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. అంతకు ముందు జరిగిన సెమీఫైనల్లో లక్ష్యసేన్ 21-19, 21-14తో దినుక కరుణరత్నపై అలవోక విజయాన్నందుకున్నాడు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరిన లక్ష్యసేన్..బల్గేరియా టోర్నీకి ముందు ఫ్రాన్స్ జాతీయ కోచ్, దిగ్గజ పీటర్ గెడ్ దగ్గర ప్రత్యేక శిక్షణ తీసుకోవడం కలిసొచ్చింది. బల్గేరియా టోర్నీలో లక్ష్యసేన్ విజయంపై కోచ్ విమల్‌కుమార్ స్పందించాడు. 'లక్ష్య చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. జూనియర్ అయినా.. టోర్నీలు గెలుస్తూ ఆకట్టుకుంటున్నాడు. తొలి రౌండ్‌లోనే టాప్‌సీడ్ స్యామ్ పార్సన్స్‌ను ఓడించి సత్తా ఏంటో చాటాడు. జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌తో పాటు సీనియర్ టోర్నీలోనూ రాణించడం అతని ఆత్మవిశ్వాసాన్ని పెంచింది' అని విమల్ అన్నాడు.



లక్ష్యసేన్

2012 వన్డే సిరీస్ ట్రోఫీతో భారత జట్టు (ఫైల్)



శ్రీలంకతో భారత్ ఇప్పటి వరకు 150 వన్డేలు ఆడింది. ఇందులో 83 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా గెలువగా, లంక 55సార్లు విజయాన్ని రుచి చూసింది. ఐసీసీ టోర్నీలు, అంతర్జాతీయ వేదికల్లో జరిగిన మ్యాచ్‌ల్లో భారత్‌దే స్పష్టమైన ఆధిక్యం. దీంతో లంకేయులపై టీమ్‌ఇండియా ఆటగాళ్లు వ్యక్తిగతంగా, జట్టు పరంగా ఎన్నో రికార్డులనూ నెలకొల్పారు. కానీ ద్వైపాక్షిక సిరీస్‌ల విషయానికొస్తే ఇరుజట్ల ఆధిపత్యం సమానంగా కనిపిస్తున్నది. 32 ఏండ్ల కిందట లంక గడ్డపై తొలి ద్వైపాక్షిక సిరీస్ ఆడిన భారత్ ఇప్పటి వరకు ఏడుసార్లు ఆ దేశంలో పర్యటించింది. ఆరంభంలో వరుసగా మూడు సిరీస్‌లు కోల్పోయిన టీమ్‌ఇండియా.. ధోనీ కెప్టెన్సీలో నాలుగేండ్లలో మూడు సిరీస్‌లు నెగ్గి ప్రతీకారం తీర్చుకుంది. మరి.. ఆదివారం నుంచి జరిగే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎవరు ఆధిపత్యం చూపెడుతారో చూడాలి..!

ఆధిపత్యం సమానం..!

లంక గడ్డపై మూడు సిరీస్‌లు గెలిచిన భారత్ ■ మరో మూడింటిలో లంక విజయం

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం:

టెస్టు సిరీస్‌కు పూర్తి భిన్నంగా ఉండే వన్డే ఫార్మాట్‌లో ఫలితం ఎలా ఉంటుందో ఊహించడం చాలా కష్టం. ఒకరిద్దరు బ్యాట్స్‌మెన్ బాగా ఆడితే మేటి ప్రత్యర్థిని సైతం కంగుతినిపించొచ్చు. ఇప్పుడు లంకేయులు కూడా సరిగ్గా దీనిపైనే దృష్టిపెట్టారు. సొంతగడ్డపై టెస్టు సిరీస్‌ను చేజార్చుకున్న లంక.. కనీసం వన్డే సిరీస్‌తోనైనా పరువు నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నది. 1985 నుంచి ఇప్పటి వరకు లంక గడ్డపై భారత్ 26 వన్డేలు ఆడగా, 13 మ్యాచ్‌ల్లో నెగ్గింది. పది మ్యాచ్‌ల్లో ఓడగా, మరో మూడింటిలో ఫలితం రాలేదు. అయితే ఇప్పుడు ఇరుజట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైన నేపథ్యంలో గతంలో జరిగిన ఏడు సిరీస్‌లను పరిశీలిద్దాం.

1985 శ్రీలంకలో... సిరీస్ 1-1తో డ్రా

లంక గడ్డపై ఆ దేశంతో భారత్ ఆడిన తొలి ద్వైపాక్షిక సిరీస్ ఇది. 1983లో కపిల్‌సేన వరల్డ్‌కప్ గెలువడంతో ప్రపంచ చాంపియన్లుగా మనం ఈ టోర్నీలోకి అడుగుపెట్టాం. మరోవైపు అప్పుడప్పుడే ప్రపంచ క్రికెట్ గురించి తెలుసుకుంటున్న పసికూనలు లంకేయులు. దులీప్ మెండిస్ సారథ్యంలో ఆడిన లంక.. ఎస్ఎస్‌సీలో జరిగిన తొలి మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసి 241/6 స్కోరు చేసింది. రాయ్ డయాస్ (80), అప్పుడు కుర్రాడిగా ఉన్న అర్జున రణతుంగ (67) మెరుగ్గా ఆడారు. తర్వాత భారత్ ఈ లక్ష్యాన్ని 45 ఓవర్లలో ఛేదించి తొలి విజయాన్ని అందుకుంది. వెంగ్‌సర్కార్ (89), రవిశాస్త్రి (67) కీలక ఇన్నింగ్స్ ఆడారు. రెండో వన్డేకు వర్షం అంతరాయం కలుగడంతో మ్యాచ్‌ను 28 ఓవర్లకు కుదించారు. లంక నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ ఓటమిపాలైంది. వెంగసర్కార్ 50 పరుగులు చేసినా.. ఆఖర్లో 14 పరుగులు చేయలేక ఓడింది. ఆఖరి మ్యాచ్ వర్షం పూర్తిగా రద్దు కావడంతో సిరీస్ 1-1తో డ్రా అయ్యింది.

1993.. 2-1తో లంక గెలుపు

మళ్లీ ఎనిమిదేండ్ల తర్వాత మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం లంక గడ్డపై అడుగుపెట్టిన అజరుద్దీన్ నేతృత్వంలోని టీమ్‌ఇండియాకు.. లంక ఊహించని షాకిచ్చింది. రణతుంగ సారథ్యంలోని లంక చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను ఎగురేసుకుపోయింది. తొలి మ్యాచ్‌లో అజర్ అర్ధసెంచరీతో భారత్ 212/8 స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో చంద్రిక హతురసింఘ (64), అరవింద డిసిల్వా (62) మెరుగ్గా ఆడి జట్టును దాదాపు విజయం అంచులకు తీసుకొచ్చారు. కానీ శ్రీనాథ్, ప్రభాకర్ చివరి రెండు ఓవర్లలో రెండు వికెట్లు తీసి ఒక్క పరుగుతో టీమ్‌ఇండియాను గెలిపించారు. రెండో వన్డేలో భారత బౌలర్ల ధాటికి లంక 204/7 స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో ప్రభాకర్ (82), అజర్ (62) మెరుపులు మెరిపించారు. కానీ విక్రమ్‌సింఘే 3 వికెట్లు తీసి 8 పరుగుల తేడాతో లంకను గెలిపించాడు. దీంతో సిరీస్ 1-1తో సమమైంది. మూడో వన్డేలో భారత్ 227/9 స్కోరు సాధించింది. అజరుద్దీన్ (85) అద్భుతంగా ఆడాడు. తర్వాత లంక మరో మూడు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

1997... ఈసారి 3-0తో



భారత్‌పై ఉన్న తమ ఆధిపత్యాన్ని మరోసారి కొనసాగిస్తూ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేశారు. తొలి వన్డేలో జయసూర్య (73), ఆటపట్టు (118), మహనామా (53) వీరోచిత బ్యాటింగ్‌తో లంక 302 పరుగుల భారీ స్కోరు చేసింది. తర్వాత సచిన్ (27), గంగూలీ (31) తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించి శుభారంభాన్నిచ్చారు. తర్వాత అజారుద్దీన్ (111), అజయ్ జడేజా (119) ఒక్కో పరుగు సమకూరుస్తూ ఐదో వికెట్‌కు 223 పరుగులు జత చేసి విజయంపై ఆశలు పెంచారు. కానీ లంక బౌలర్లు పట్టువిడవకుండా పోరాడుతూ చివరకు 2 పరుగుల స్వల్ప తేడాతో గెలిచారు. గంగూలీ (113) సెంచరీతో రెండో వన్డేలో భారత్ 238 పరుగులు సాధించింది. కానీ జయసూర్య (66), మహనామా (66), డిసిల్వా (52 నాటౌట్) కలిసికట్టుగా ఆడటంతో లంక 8.1 ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో 2-0 ముందంజ వేసింది. మూడో వన్డేలోటీమ్‌ఇండియా లంక ముందు 291 పరుగులను నిర్దేశించింది. రాబిన్ సింగ్ (100) సెంచరీ చేశాడు. ఆ తర్వాత కట్టుదిట్టమైన బౌలింగ్‌లో లంకను 132 పరుగులకే 6 వికెట్లు తీశారు. ఈ దశలో వర్షం రావడంతో మ్యాచ్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. డిసిల్వా (100) సెంచరీతో లంక 264 పరుగులు చేయగా, భారత్ 255కే పరిమితమై ఓడింది.

2006 .. సిరీస్ 0-0

ఓవైపు ఇరుజట్లలోని కీలక ఆటగాళ్లు అనారోగ్యం పాలుకావడం.. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు.. మొత్తానికి 2006లో జరుగాల్సిన మూడు మ్యాచ్‌ల సిరీస్ మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. తొలి వన్డేలో 3.4 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయగా, చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్క బంతి కూడా సాధ్యపడలేదు.

2008.. భారత్ 3-2తో గెలుపు

ధోనీ సారథ్యంలోని భారత్ జట్టు లంక గడ్డపై తొలి సిరీస్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో అజంత మెండిస్, మురళీధరన్ చెరో 3 వికెట్లు తీయడంతో భారత్ 146 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా లంక 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఇక రెండో వన్డేలో పుంజుకున్న ధోనీ సేన బౌలర్లు లంకను 142కు ఆలౌట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నారు. జహీర్ 4, ప్రవీణ్ 3 వికెట్లతో చెలరేగిపోయారు. అయితే లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియా 75 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన దశలో ధోనీ (39), బద్రీనాథ్ (27 నాటౌట్) కీలక భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు. మూడో వన్డేలో ముందుగా భారత్ 7 వికెట్లకు 239 పరుగులు చేసింది. ధోనీ (76), రైనా (53) రాణించారు. తర్వాత లంకను 204 పరుగులకు పడగొట్టి అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నారు. జయవర్ధనే (94) పోరాడినా ప్రయోజనం లేకపోయింది.



నాలుగో వన్డేలో కోహ్లీ (54), రైనా (76), ధోనీ (71) చెలరేగడంతో భారత్ 258 పరుగులు చేసింది. జయసూర్య (60) మినహా మిగతా వారు నిరాశపర్చడంతో లంక ఓటమిపాలుకాగా, భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆఖరి వన్డేలో ఓదార్పు విజయం సాధించిన లంక సిరీస్‌లో భారత్ ఆధిక్యాన్ని 3-2కు తగ్గించింది.

2009.. ఈసారి 4-1తో విజయం

ఏడాది విరామం తర్వాత మళ్లీ లంక గడ్డపై అడుగుపెట్టిన భారత్.. ఈసారి సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకుంది. జయసూర్య (107) సెంచరీ చేసినా.. తొలి వన్డేలో లంక నిర్దేశించిన 246 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 11 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఇక రెండో వన్డేలో 15 పరుగులతో గెలిచి 2-0 ఆధిక్యంలోకి వెళ్లిన టీమ్‌ఇండియా.. మూడో వన్డేలోనూ అదే జోరును చూపెట్టింది. సెహ్వాగ్ (116), యువరాజ్ (117) విరుచుకుపడటంతో భారత్ 363/5 స్కోరు సాధించింది. లంక ఇన్నింగ్స్‌లో సంగక్కర (82) మినహా మిగతా వారు నిరాశపర్చడంతో భారత్ 147 పరుగులతో నెగ్గింది. నాలుగో వన్డేలోనూ 300ల మార్క్‌ను అందుకున్న టీమ్‌ఇండియా 332/5 స్కోరు చేసింది. దీనిని ఏ దశలోనూ ఛేదించలేకపోయిన లంక 265 పరుగులకు కుప్పకూలింది. దీంతో భారత్ 4-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆఖరి వన్డేలో ఎట్టకేలకు నెగ్గిన లంక ఆధిక్యాన్ని 4-1కి తగ్గించింది.

2012.. మళ్లీ 4-1తో గెలుపు

భారత్‌ను ముచ్చటగా మూడోసారి నడిపించిన ధోనీ.. చరిత్రాత్మక సిరీస్ విజయాన్ని మళ్లీ సాధించాడు. తొలి వన్డేలో విరాట్ (106) శతకంతో శివాలెత్తితే... సెహ్వాగ్ (96) మిస్సయ్యాడు. ఫలితంగా టీమ్‌ఇండియా 315/6 స్కోరు చేయగా, లంక పోరాడిపోరాడి 21 పరుగుల తేడాతో ఓడింది. సంగక్కర (133) రాణించాడు. రెండో వన్డేలో 9 వికెట్ల తేడాతో నెగ్గిన లంక సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మూడో వన్డేలో లంక నిర్దేశించిన 286 పరుగుల లక్ష్యాన్ని రెండు బంతులు మిగిలి ఉండగానే భారత్ ఛేదించింది. గంభీర్ (102) సెంచరీతో కదంతొక్కాడు. నాలుగో వన్డేలో నెగ్గిన భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో పార్ట్ టైమ్ బౌలర్ మనోజ్ తివారీ రాణించడంతో లంక 255 పరుగులే చేసింది. దీన్ని భారత్ 42.2 ఓవర్లలో ఛేదించింది. కోహ్లీ (128) ఆకట్టుకున్నాడు. ఇక ఆఖరి వన్డేలో గంభీర్ (88) చెలరేగడంతో భారత్ 290/7 స్కోరు చేసింది. లంక బ్యాట్స్‌మెన్ నిలువరిస్తూ 20 పరుగుల తేడాతో గెలిచింది.

లంకలో ధోనీ ఫుల్ ప్రాక్టీస్

దంబుల్లా: లంకతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నేపథ్యంలో భారత్ జట్టు గురువారం ప్రాక్టీస్‌ను మొదలుపెట్టింది. ఆప్షనల్ ప్రాక్టీస్ కావడంతో వన్డే జట్టుకు ఎంపికైన ధోనీ, కేదార్, మనీష్, శార్దూల్, యజువేంద్ర చాహల్, బుమ్రా నెట్స్‌కు వచ్చారు. టెస్టుల్లో ఆడిన వారందరూ విశ్రాంతికే పరిమితమయ్యారు. అందరి కంటే ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ధోనీ.. ఇటు భారత్, అటు స్థానిక బౌలర్ల బంతులను ఎదుర్కొన్నాడు. నెల రోజుల నుంచి ప్రాక్టీస్ లేకపోవడంతో ఆరంభంలో కాస్త తడబడినా.. కొద్దిసేపటి తర్వాత పేసర్లు, స్పిన్నర్లలో తన మార్క్ షాట్లతో రెచ్చిపోయాడు. తన భవిష్యత్‌పై చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ధోనీ కూడా తనను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నాడు. మహీ తర్వాత మిగతా వారు బ్యాటింగ్‌కు పదునుపెట్టుకున్నారు.

రమణ్‌దీప్, చింగ్లేన్‌సన డబుల్

ఆస్ట్రియాపై భారత్ ఉత్కంఠ విజయం



ఆమ్‌స్టెల్వీన్(నెదర్లాండ్స్): భారత యువ హాకీ జట్టు అదరగొట్టింది. సీనియర్ల గైర్హాజరీలో అందివచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ యూరప్ పర్యటనను దిగ్విజయంగా ముగించింది. నెదర్లాండ్స్‌పై గెలుపు జోరును కొనసాగిస్తూ గురువారం ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 4-3 తేడా తో ఉత్కంఠ విజయం సాధించింది. రమణ్‌దీప్‌సింగ్(25ని, 32ని), చింగ్లేన్‌సన(37ని, 60ని) డబుల్ గోల్స్‌తో విజృంభించారు. మరోవైపు ఆస్ట్రియా తరపున ఒలీవర్ బిండర్(14ని), మైఖేల్ కార్పర్(53ని), ప్యాట్రిక్(55ని) గోల్స్ చేశారు. మొదటి క్వార్టర్ 14వ నిమిషంలో ఒలీవర్ గోల్‌తో ఆస్ట్రియా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో క్వార్టర్‌లో పుంజుకున్న భారత్ 25వ నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. అమిత్ రోహిదాస్ అందించిన పాస్‌ను రమణ్‌దీప్‌సింగ్ గోల్‌గా మలువడంతో స్కోరు 1-1తో సమమైంది. ఇక్కణ్నుంచి మరింత దూకుడు పెంచిన భారత్..5నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్(రమణ్‌దీప్, చింగ్లేన్‌సన) కొట్టడంతో ఒక్కసారిగా 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే కీలకమైన నాలుగో క్వార్టర్‌లో మైఖేల్, ప్యాట్రిక్ రెండు నిమిషాల తేడాతో గోల్స్ చేయడంతో స్కోరు 3-3తో సమమైంది. మ్యాచ్ ఇక డ్రాగా ముగుస్తుందనుకున్న తరుణంలో వైస్‌కెప్టెన్ చింగ్లేన్‌సన మెరుపు గోల్‌తో భారత్ ఉత్కంఠ విజయం నమోదు చేసుకుంది.

ఆసియా కప్‌పై తేల్చండి!

కేంద్రానికి లేఖ రాయనున్న బీసీసీఐ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్‌లో ఆసియా కప్ జరుగడంపై సందిగ్ధత నెలకొంది. ఈ టోర్నీలో పాకిస్థాన్ పాల్గొనాల్సి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తుందో లేదోనని బీసీసీఐ భావిస్తున్నది. దీంతో ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నది. ఈ మేరకు ఓ లేఖ రాయాలని నిర్ణయించింది. 'మూడు నెలల కిందట అండర్-19 ఆసియా కప్ కోసం ప్రభుత్వానికి లేఖ రాశాం. కానీ ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈవెంట్‌ను మలేషియాకు తరలించాం. ఇప్పుడు సీనియర్ ఆసియా కప్ కోసం ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వానికి లేఖ రాయాలి. భారత్, పాక్ లేకుండా ఆసియా కప్ జరుగదు. ఎందుకంటే అత్యంత ప్రేక్షకాదరణ ఉండే మ్యాచ్ ఇదే. ఇది లేకుంటే టోర్నీకి అర్థమే లేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఆసియా కప్ కూడా ఐసీసీ ఈవెంట్‌లాంటిదేనని, ఇతర జట్లు కూడా ఇందులో పాల్గొంటాయన్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో టోర్నీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన వచ్చిన తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఆసీస్‌తో భారత్ తొలి పోరు

అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: న్యూజిలాండ్ వేదికగా వచ్చే ఏడాది జరుగనున్న అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఐసీసీ గురువారం విడుదల చేసింది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకు మెగా టోర్నీ అభిమానులను కనువిందు చేయనుంది. యువభారత్ తమ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి మ్యాచ్‌లు ఆడనున్నాయి. గ్రూపు-ఎలో డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, కెన్యా ఉండగా, గ్రూపు-బిలో భారత్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూగినియా ఉన్నాయి. ఇక గ్రూపు- సి లో బంగ్లాదేశ్, కెనడా, ఇంగ్లండ్, నమీబియా పోటీలో ఉండగా, గ్రూపు-డిలో పాకిస్థాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్ ఉన్నాయి. క్రైస్ట్‌చర్చ్, క్వీన్స్‌టన్, తౌరంగ, వాంగరైయి వేదికలుగా మ్యాచ్‌లు జరుగుతాయి.

నాన్నకు ప్రేమతో..



తండ్రి హిమాన్షు పాండ్యాకు కారును బహుమతిగా ఇచ్చిన క్రికెటర్ హార్దిక్ పాండ్యా

ఆనంద్‌కు ఎనిమిదో స్థానం

సెయింట్ లూయిస్: సెయింట్ లూయిస్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. సెర్గి కర్జాకిన్(రష్యా)తో జరిగిన ఆఖరి రౌండ్ పోరులో ఆనంద్ ఓటమిపాలయ్యాడు. దీంతో ఒక గెలుపు, ఐదు డ్రాలు, రెండు ఓటములతో మొత్తం ఏడు పాయింట్లు దక్కించుకున్న ఆనంద్..గ్యారీ కాస్పరోవ్(రష్యా), డేవిడ్ నవార(చెక్ రిపబ్లిక్)తో కలిసి ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. అర్మేనియాకు చెందిన లెవాన్ ఆరోనియన్ 12 పాయింట్లతో టోర్నీ టాపర్‌గా నిలిచాడు. కాగా 24వ అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక..కిరిల్ స్టుపాక్(బెలారస్)తో గురువారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకుంది.

జెయింట్స్ జైత్రయాత్రకు బ్రేక్

బెంగాల్-గుజరాత్ మ్యాచ్ డ్రా

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ జట్టు జైత్రయాత్రకు బ్రేక్ పడింది. గురువారం బెంగాల్ వారియర్స్ జట్టుతో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌ను 26-26 స్కోరుతో జెయింట్స్ జట్టు డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు 20 రైడింగ్, 3 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించగా.. బెంగాల్ వారియర్స్ జట్టు 17 రైడింగ్, 5 ట్యాకిల్, 2 ఆలౌట్, 2 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించింది. జెయింట్స్ రైడర్లు సచిన్ 8, సుకేశ్ 6 పాయింట్లతో మెరువగా.. బెంగాల్ జట్టులో దీపక్ నర్వాల్ 9, మణీందర్ సింగ్ 4, జాంగ్ కున్ లీ 3 పాయింట్లు తీసుకువచ్చారు. చివరి రైడ్‌లో పాయింట్ తెచ్చుకున్న బెంగాల్ జట్టు పరాజయాన్ని తప్పించుకుంది.

ఢిల్లీ రెండో గెలుపు

ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో ఢిల్లీ రెండో విజయం అందుకుంది. గురువారం జరిగిన ఇంటర్ జోన్ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 30-29 పాయింట్లతో ఉత్కంఠ విజయం సాధించింది. జట్టులోని ఇరాన్ ప్లేయర్లు మెరాజ్ షేక్, అబోల్ ఫాజల్ ఇద్దరూ 20 పాయింట్లు సాధించడం విశేషం. దీంతో ఢిల్లీ దబాంగ్ జట్టు ఈ సీజన్‌లో రెండో విజయంతో మెరిసింది. తమిళ్ తలైవాస్ జట్టు రైడర్ అజయ్ ఠాకూర్ 14 రైడింగ్ పాయింట్లతో చెలరేగినా జట్టు పరాజయాన్ని నిలువరించలేక పోయాడు. మెరాజ్ షేక్ చివరి రైడింగ్‌లో వరుసగా పాయింట్లు తేవడంతో ఒక పాయింట్ ఆధిక్యంతో ఢిల్లీ జట్టు విజయాన్నందుకుంది.



హిందూ, యూదు మహిళల పెండ్లి

- బ్రిటన్‌లో తొలి మతాంతర స్వలింగ వివాహం



లండన్: స్వలింగ వివాహలంటేనే భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు విరుద్ధం. అలాంటిది ఓ హిందూ మహిళ యూదు మతానికి చెందిన మరో మహిళను హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నది. స్వలింగ సంపర్కుల మధ్య బ్రిటన్‌లో జరిగిన తొలి మతాంతర వివాహం ఇదేనని అక్కడి మీడియా పేర్కొన్నది. కళావతి మిస్త్రీ, మిరియమ్ జెఫెర్సన్‌లకు అమెరికాలోని టెక్సాస్‌లో ఓ ట్రెయినింగ్ కోర్సు సందర్భంగా పరిచయం ఏర్పడింది. 20 ఏండ్లుగా వారు తమ సంబంధాలను కొనసాగిస్తున్నారు. గతవారం వీరిరువురు వివాహంతో ఒక్కటయ్యారు. వివాహ వేడుకలో ఇరువురు వధువులు సంప్రదాయ వస్త్రాలు, పూలదండలు ధరించారు. హిందూ వధువులు వివాహం సందర్భంగా మెడలో ధరించే మంగళసూత్రాలను సైతం కట్టుకున్నారు. గే మహిళగా తన లైంగిక స్థితిని చాలా ఏండ్లు ఎవరికీ తెలియకుండా ఉంచానని మిస్త్రీ తెలిపినట్లు 'ది ఇండిపెండెంట్' వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని సాన్ ఆంటోనియోలో వివాహం చేసుకున్న వారు అనంతరం అమెరికా వెళ్లిపోయారు.

సైన్యం కోసం ఆరు అపాచీ హెలికాప్టర్లు!

న్యూఢిల్లీ, ఆగస్టు 17: సైనిక అవసరాల కోసం తొలిసారి కేంద్ర ప్రభుత్వం ఆరు ఏహెచ్ – 64 అపాచీ హెలికాప్టర్లను కొనుగోలు చేయనున్నది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షతన జరిగిన కేంద్ర డిఫెన్స్ ఆక్విజిషన్ కౌన్సిల్ గురువారం నిర్ణయం తీసుకున్నది. ఈ హెలికాప్టర్ల కొనుగోలుకు రూ.4,168 కోట్లు వ్యయం కానున్నట్లు రక్షణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఏహెచ్ – 64 అపాచీ హెలికాప్టర్లు ప్రపంచంలోనే అత్యంత ఆధునిక టెక్నాలజీతో రూపొందినవి. యుద్ధరంగంలో బహుళ పాత్రలను పోషించగల సామర్థ్యం వాటికి ఉంది.



వరదలతో నాలుగు రాష్ట్రాల్లో 91 మంది మృతి

- దక్షిణ బీహార్, ఒడిషాలకు వర్ష సూచన

పాట్నా/ గువాహటి/ లక్నో/ భువనేశ్వర్, ఆగస్టు 17: బీహార్, అసోం, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పోటెత్తిన వరదలతో గురువారం ఒక్కరోజే 91మంది మృతి చెందారు. బీహార్‌లో గత 24 గంటల్లో 47 మంది మరణించగా ఆ రాష్ట్రంలో ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య 119కి చేరుకున్నది. 15 జిల్లాల పరిధిలో 93 లక్షల మంది ఇబ్బందుల పాలయ్యారు. తూర్పు మధ్య రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్‌లపై నీళ్లు నిలువడంతో 39 రైళ్లు రద్దు చేశారు. 504 సహాయ శిబిరాల్లో 2.14 లక్షల మంది తల దాచుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ఆరు ఉత్తర జిల్లాల్లో వరదలు తగ్గుముఖం పట్టినా గత 24 గంటల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 15 మంది నీట మునిగి, మరో ఇద్దరు పాము కాటుకు గురై మరణించారు. బెంగాల్‌లోని ఉత్తర ప్రాంతం, అసోం రాష్ట్రాల పరిధిలో వరుసగా ఐదో రోజు కూడా రైలు సర్వీసులు రద్దు చేశారు. అసోంలోని 24 జిల్లాల పరిధిలో 2584 గ్రామాలు వరద నీటిలోనే మగ్గుతున్నాయి. తాజాగా పది మంది మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 133కి చేరుకున్నది. ఇప్పటికీ 21 జిల్లాల పరిధిలో 602 సహాయ శిబిరాల్లో 1,01, 035 మంది తలదాచుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మూడురోజుల్లో 17మంది మృతి చెందారు. ఒడిశాలో వచ్చే 24 గంటల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.



పశ్చిమ బెంగాల్‌లోని బాలోర్‌ఘాట్‌లో వరదనీటిలోనే సహాయశిబిరం నుంచి భోజనం తీసుకెళ్తున్న గ్రామస్థుడు

గని కార్మికుల భద్రత ముఖ్యం

- ప్రమాదాల నివారణకు ఉత్తమ విధానాలు అవసరం
- కార్మికుల కుటుంబాల ఆరోగ్యంపైనా యాజమాన్యం దృష్టి పెట్టాలి
- జాతీయ భద్రతా అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి



గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో జాతీయ భద్రతా అవార్డులను ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్. చిత్రంలో కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ కూడా ఉన్నారు.

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: దేశ స్థూల ఉత్పత్తిలో వివిధ రకాల సహజ వనరుల వెలికితీత దాదాపు 2.6% మేర ఉన్నదని, అయితే అదే సమయంలో కార్మికుల భద్రత, కుటుంబాల సంక్షేమం చాలా ముఖ్యమైనదని, దీనిపై గనుల యాజమాన్యాలు దృష్టి సారించి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. గని కార్మికుల భద్రత కోసం అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఉత్తమ విధానాలను మనం కూడా అనుసరించడంతో పాటు ప్రతి గని యాజమాన్యం స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో గని ప్రమాదాలు, కార్మికుల మరణాలు బాగా తగ్గుముఖం పట్టాయని, అయితే పూర్తిగా నివారించడంపై దృష్టి పెట్టాలని కోరారు. కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో గురువారం జరిగిన 'జాతీయ భద్రతా అవార్డు'ల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గనుల్లో పనిచేసే కార్మికుల ప్రాణరక్షణ, పని స్థలాల్లో వారి భద్రత, దీర్ఘకాలంలో ఆ కార్మికుల కుటుంబాల ఆరోగ్యం అత్యంత ప్రధానమైన అంశాలని అన్నారు. ఉత్పత్తిలో మెరుగుదల, ఉత్పాదకత పెరుగడం, జీడీపీలో వాటా పెరుగడం, లాభాలు ఆర్జించడం.. ఇవన్నీ ఉన్నా కార్మికుల ప్రాణరక్షణే అంతిమంగా కొలమానం కావాలని కోరారు. ప్రతి రోజూ సుమారు పది లక్షల మంది కార్మికులు బొగ్గు, ఖనిజాలు తదితర ప్రకృతి వనరులను గనుల్లోంచి వెలికితీసే పనుల్లో నిమగ్నమవుతున్నారని, దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి వెన్నుదన్నుగా ఉన్నారని, అలాంటి కార్మికుల ప్రాణాలను కాపాడటం యావత్తు జాతి బాధ్యత అని నొక్కిచెప్పారు. కార్మికులు క్షయ వ్యాధి, సిలికోసిస్ లాంటి పలు రకాల శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని, గనుల పరిసర ప్రాంతాల్లోని సామాన్య ప్రజానీకం కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి ఆరోగ్య రక్షణపై గనుల యాజమాన్యాలు దృష్టి సారించాలని కోరారు. గనుల్లో కార్మికులకు ఎదురయ్యే ప్రమాదాలను నివారించడానికి మైనింగ్‌తో పాటు ఇంజినీరింగ్ రంగాల్లో ఉన్నత విద్యాసంస్థలైన ధన్‌బాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్, వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు భద్రతా ప్రమాణాలు (సేఫ్టీ ప్రోటోకాల్స్), అవగాహన తదితరాలపై దృష్టి పెట్టి సిలబస్‌లోనే నిర్దిష్ట అంశంగా చేర్చాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు 'గ్రీన్ బిల్డింగ్స్', 'గ్రీన్ హౌజెస్'... తరహాలోనే గనుల విషయంలోనూ కాలుష్యాన్ని నివారించే దిశగా 'గ్రీన్' పద్ధతులను ప్రవేశపెట్టాలని కోరారు. జాతీయ సేఫ్టీ అవార్డుల్లో భాగంగా 2013, 2014 సంవత్సరాలకు బొగ్గు, ఖనిజం, చమురు తదితర గనులకు మొతం 71 అవార్డులను కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ పరిధిలోని గనుల డైరెక్టర్ జనరల్ కార్యాలయం ప్రకటించగా, వాటిని రాష్ట్రపతి అందజేశారు. కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ ప్రసంగిస్తూ కార్మికుల భద్రత, వారి సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, యాజమాన్యాల ద్వారా అమలు చేయిస్తున్న విధానాలను, కుటుంబాలకు సామాజిక భద్రతా పథకం కింద అందజేస్తున్న సౌకర్యాలు, విద్యావకాశాలను కల్పించడం.. ఇలా అనేక అంశాలను ప్రస్తావించారు.

తాజ్‌ను ధ్వంసం చేయాలని భావిస్తున్నారా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: ప్రపంచ ప్రఖ్యాతి పొందిన తాజ్‌మహాల్ కట్టడాన్ని ధ్వంసం చేస్తారా? అని కేంద్రాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. ఉత్తరప్రదేశ్‌లోని మథుర నుంచి ఢిల్లీకి 80 కిలోమీటర్ల పొడవున అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం 450 చెట్లను తొలిగించేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను గురువారం జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తా సారథ్యంలోని బెంచ్ విచారణకు స్వీకరించింది. 'ఇది (తాజ్‌మహాల్) ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కట్టడం. మీరు (ప్రభుత్వం) దాన్ని ధ్వంసం చేయాలని కోరుకుంటున్నారా? ఇటీవలి తాజ్ చిత్రాలు చూశారా? అని కేంద్రాన్ని ప్రశ్నించిన న్యాయస్థానం.ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

ఆర్థిక అవతకవకలు.. విధుల్లో నిర్లక్ష్యం

- గోరఖ్‌పూర్ విషాదంపై విచారణ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ : గోరఖ్‌పూర్ వైద్య కళాశాలలో చిన్నారుల మృతికి ఆక్సిజన్ సరఫరాలో అంతరాయంతో పాటు బిల్లుల చెల్లింపులో జాప్యం, అవకతవకలూ కారణమని విచారణ కమిటీ నివేదించింది. అనెస్థీషియా డాక్టర్ సతీశ్‌కుమార్‌ను ప్రధాన దోషిగా నివేదిక పేర్కొన్నది.

మున్సిపల్ ఎన్నికల్లో తృణమూల్ క్లీన్‌స్వీప్

- ఆరు వార్డులతో రెండోస్థానంలో బీజేపీ



కోల్‌కతాలో విజయోత్సవ సంబురాల్లో తృణమూల్ కార్యకర్తలు

కోల్‌కతా, ఆగస్టు 17: పశ్చిమ బెంగాల్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) క్లీన్‌స్వీప్ చేసింది. ఐదు మున్సిపాలిటీలు, ఒక నోటిఫైడ్ అథారిటీతోపాటు ఒక మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఫలితాలను గురువారం ప్రకటించగా మొత్తం ఏడింటినీ సీఎం మమతాబెనర్జీ నాయకత్వంలోని టీఎంసీ పార్టీ గెలుచుకుంది. మొత్తం 148 వార్డులకుగాను టీఎంసీ 140 స్థానాలు సాధించగా.. బీజేపీకి 6, వామపక్ష కూటమికి చెందిన ఫార్వర్డ్ బ్లాక్ ఒకటి, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు ఖాతా తెరువలేదు. ఎన్నికలు నిర్వహించిన ఆదివారం రోజు దుర్గాపూర్ సహా పలుచోట్ల ఆందోళనలు చోటుచేసుకున్నాయి. టీఎంసీ హింసను ప్రోత్సహిస్తున్నదని, రిగ్గింగ్‌కు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నదని బీజేపీ, సీపీఎం పార్టీలు ఆరోపించాయి. ఎన్నికలను రద్దు చేయాలని అవి డిమాండ్ చేశాయి. గురువారం ఫలితాల్లో మాత్రం సీఎం మమతాబెనర్జీ విజయపరంపరను కొనసాగించారు. చాలాస్థానాల్లో రెండోస్థానంలో నిలవడంతో బెంగాల్‌లో టీఎంసీకి ప్రధాన పోటీదారుగా బీజేపీ ఆవిర్భవించింది. ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకం మరోమారు స్పష్టమయ్యిందని టీఎంసీ సెక్రటరీ జనరల్ పార్థచటర్జీ అన్నారు. వామపక్షాలు తమ ఓట్లను బీజేపీకి మళ్లించినప్పటికీ ఓటర్లలో టీఎంసీపై విశ్వాసం చెక్కుచెదరలేదని సీనియర్ నాయకుడు గౌతమ్‌దేవ్ అన్నారు. అధికార పార్టీ అప్రజాస్వామికంగా వ్యవహరించి విజయం సాధించిందని, వారు భయానక వాతావరణం సృష్టించినప్పటికీ రెండో స్థానం సాధించామని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ అన్నారు. ఈ ఫలితాలు ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఉన్నాయని కాంగ్రెస్, వామపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు.



ప్రధాని మోదీతో బొడ్డపాటి ఐశ్వర్య కరచాలనం

ఆరుగురు మహిళల సాహస సాగర యాత్ర

- బృందంలో హైదరాబాద్‌కు చెందిన ఐశ్వర్య
- సెప్టెంబరు నుంచి ఏప్రిల్ వరకు ప్రపంచాన్ని చుట్టనున్న మహిళా బృందం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆరుగురు మహిళలు ఐఎన్ఎస్‌వీ–తరిణి నౌకలో ప్రపంచాన్ని చుట్టిరానున్నారు. 'నావికా సాగర్ పరిక్రమ' పేరుతో గోవా నుంచి బయలుదేరే ఈ ఆరుగురు మహిళా నావికా అధికారుల బృందం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలన్నీ సముద్రమార్గంలోనే చుట్టి తిరిగి గోవాకు చేరుకుంటుంది. ప్రపంచాన్ని చుట్టివచ్చే తొలి మహిళా బృందంగా ఈ యాత్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది. భారత నావికాదళ మహిళా శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పడానికి ఈ యాత్ర ఉపయోగపడనుంది. భారత నౌకాదళంలోకి చేరడానికి యువత ఆసక్తి చూపేలా, 'నారీ శక్తి'కి భారత ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని యావత్తు ప్రపంచానికి తెలియజేసేలా ఈ యాత్రకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 5వ తేదీన గోవా నుంచి ప్రారంభమయ్యే 'నావికా సాగర పరిక్రమ' యాత్ర 164 రోజుల పాటు సాగి తిరిగి వచ్చే ఏడాది ఏప్రిల్ 4వ తేదీన మళ్లీ గోవాకు చేరుకుంటుంది. ఐదు దశల్లో సాగే ఈ యాత్రలో తొలుత ఆస్ట్రేలియా, ఆ తర్వాత న్యూజిలాండ్, ఫాక్‌లాండ్స్ (దక్షిణ అమెరికా), దక్షిణ ఆఫ్రికాల మీదుగా సాగుతుంది. లెఫ్టినెంట్ కమాండర్ వర్తికా జోషి (రిషికేష్, ఉత్తరాఖండ్) నేతృత్వంలో సాగే ఈ యాత్రలో హైదరాబాద్‌కు చెందిన లెఫ్టినెంట్ బొడ్డపాటి ఐశ్వర్య, విశాఖపట్నంకు చెందిన లెఫ్టినెంట్ కమాండర్ స్వాతి కూడా ఉన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులుకు చెందిన లెఫ్టినెంట్ కమాండర్ ప్రతిభా జమ్వాల్, మణిపూర్‌కు చెందిన విజయాదేవి, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు చెందిన పాయల్ గుప్తా ఉన్నారు. ఈ ఆరుగురు మహిళలు గురువారం ప్రధాని నరేంద్రమోదీని కలిసి సాగర యాత్ర గురించి వివరించారు. ప్రధానంగా భారత నావికాదళం 'నారీశక్తి' గొప్పదనం గురించి చాటిచెప్పడంతో పాటు పర్యావరణం–వాతావరణ మార్పులు, మేక్ ఇన్ ఇండియా, సముద్రం–అలలు–వాతావరణ వివరాల పరిశీలన, సముద్ర కాలుష్యం, సముద్రయానంపై ఆయా దేశాల్లోని యువతకు ఉన్న ఆసక్తి తదితరాలపై ఈ బృందం అధ్యయనం చేస్తుంది.

రాజీవ్ హత్యలో బాంబు తయారీ కుట్రపై మళ్లీ దర్యాప్తు

- కేంద్రానికి సుప్రీం సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 17: సరిగ్గా 26 ఏండ్ల క్రితం జరిగిన మాజీప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకు వాడిన బాంబు తయారీకి జరిగిన కుట్రపై తాజాగా దర్యాప్తు చేపట్టాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. బాంబు తయారీ కుట్రపై కేసు దర్యాప్తు పురోగతిని వివరించాలని కేంద్రప్రభుత్వంతోపాటు సీబీఐని కోరింది. ఈ కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఏజీ పెరారివలన్ దాఖలుచేసిన పిటిషన్‌లో దర్యాప్తు సరైన దిశలో సాగలేదని పేర్కొన్నారు. 'పునర్విచారణ ఫలితం ఏమిటి? దీనిపై తదుపరి విచారణ ఎలా ఉంటుంది? దీన్ని కేంద్రం పరిశీలించాలని మేము కోరుతున్నాం' అని జస్టిస్ రంజన్ గొగోయి సారథ్యంలోని బెంచ్ గురువారం పేర్కొన్నది. కేసు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. పెరారివలయన్ తరపు న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదిస్తూ నాడు రాజీవ్‌ను హత్య చేసేందుకు వాడిన బాంబు తయారీకి జరిగిన కుట్రపై సరైన రీతిలో విచారణ జరుగలేదని చెప్పారు. బెల్ట్ బాంబుకు రెండు బ్యాటరీలు సరఫరా చేసినందుకు ఈ కేసులో పెరారివలయన్‌కు శిక్ష పడింది.

ఠాణాల్లో జన్మాష్టమి తప్పేంకాదు: యోగి ఆదిత్యనాథ్

లక్నో, ఆగస్టు 17: ముస్లింలు రోడ్లపై నమాజ్ చేస్తున్నప్పుడు పోలీస్ స్టేషన్లలోనూ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడంలో తప్పేమీ లేదని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. శ్రీకృష్ణుడు మధురలోని జైలులో జన్మించినందున జన్మాష్టమి నాడు జైళ్లు, పోలీస్ స్టేషన్లలో గతవారం యూపీ ప్రభుత్వం ఆదేశించింది. పోలీస్‌స్టేషన్లలో జన్మాష్టమి వేడుకలను నిలువరించే అధికారం తనకు లేదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. 'ఒకవేళ నేను రోడ్లమీద జరిగే ఈద్ ప్రార్థనలను నేను నిలువరించకపోతే, పోలీస్‌స్టేషన్లలో జన్మాష్టమి సంబురాలను ఆపేందుకు నాకు హక్కు లేదు' అని చెప్పారు. బుధవారం రాత్రి లక్నో, నొయిడాల్లో జన్మాష్టమి వేడుకలు నిర్వహించడంపై మీడియా ప్రశ్నలకు సమాధానంగా ఆదిత్యనాథ్ పై విధంగా సమాధానమిచ్చారు.

ఆక్స్‌ఫర్డ్‌లో ప్రవేశం పొందిన మలాలా


లండన్, ఆగస్టు 17: ఐక్యరాజ్యసమితి శాంతిదూత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ లండన్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకోనున్నారు. విశ్వవిద్యాలయంలో తనకు సీటు కేటాయిస్తూ ఆక్స్‌ఫర్డ్ నుంచి అందిన సందేశాన్ని ఆమె గురువారం ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'ఆక్స్‌ఫర్డ్ వెళ్లడానికి చాలా ఆత్రుతగా ఉన్నాను' అంటూ మలాలా ట్వీట్ చేశారు.

కాంగోలో కొండచరియలు విరిగిపడి 40 మంది దుర్మరణం

బునియా: డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో కొండచరియలు విరిగిపడి 40 మంది మరణించారు. ఈ దుర్ఘటన ఇటూరి రాష్ట్రంలోని తోరా అనే గ్రామంలో బుధవారం జరిగింది. ఆల్బర్ట్ అనే సరస్సు సమీపంలో ఉన్న ఈ గ్రామంలో ఎక్కువగా మత్స్యకారులు నివసిస్తున్నారని, కొన్నిరోజులుగా భారీ వర్షాలు పడటంతో గ్రామంపై కొండచరియలు విరిగి పడ్డాయని రాష్ట్ర డిప్యూటీ గవర్నర్ వెల్లడించారు.

మంచు కరిగింది.. జీవం పెరిగింది

- భూమిపై అడుగుపెట్టిన తొలితరం జీవులను గుర్తించిన శాస్త్రవేత్తలు



మెల్‌బోర్న్, ఆగస్టు 18: భూమిపైకి వచ్చిన మొట్టమొదటి జీవులను శాస్త్రవేత్తలు గుర్తించారు. భూమిపై జంతుజాలం విస్తృతంగా అభివృద్ధి చెందడానికి గల కారణాలను విశ్లేషించారు. 65 కోట్ల ఏండ్ల కిందట మంచు కరిగి సముద్రాల్లోకి చేరుతున్నప్పుడు 'ఆల్గే'లు (శైవలాలు) మొట్టమొదటిసారి భూమిమీదికి వచ్చాయని, తర్వాత అవి పరిణామం చెంది వివిధ రకాల జంతుజాతులుగా మారాయని ఆస్ట్రేలియాకు చెందిన 'ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ' పరిశోధకుల బృందం తేల్చింది. వారు సెంట్రల్ ఆస్ట్రేలియాలోని పురాతన అవక్షేపణ శిలలను పరిశీలించి ఈ మేరకు నిర్ధారించారు. 65 కోట్ల ఏండ్ల కిందట శైవలాలు మొట్టమొదటిసారి భూమిపైకి చేరాయని గుర్తించారు. అంతకుముందు దాదాపు 5 కోట్ల ఏండ్లపాటు భూమిపై మంచుయుగం కొనసాగింది. భూమి మొత్తం మంచుగడ్డ రూపంలో ఉన్నది. ఉష్ణోగ్రతలు పెరుగడంతో మంచుకరిగి సముద్రాల్లోకి నీరు చేరడం ప్రారంభమైంది. ఆ సమయంలో మంచు అడుగునఉన్న పర్వత శ్రేణులు, భూమిపై పొర కరిగి పోషకాలు భారీ స్థాయిలో సముద్రాల్లోకి చేరాయి. ఉష్ణోగ్రతల్లోనూ వ్యత్యాసాలు వచ్చాయి. కొత్త కొత్త జీవావరణ వ్యవస్థలు ఉద్భవించాయి. శైవలాలు ఈ మార్పులను సద్వినియోగం చేసుకుంటూ భూమిపైకి చేరి ఇతర జీవజాతులుగా పరిణామం చెందాయి. ఫలితంగా ప్రస్తుతం మనం చూస్తున్న అన్ని రకాల జంతు జాతులు ఉద్భవించాయి.

పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు

- అస్తమా, సీవోపీడీలతో 2015లో 30 లక్షల మంది మృతి
- ఇండియాతోపాటు మరో మూడు దేశాల్లో వ్యాధి తీవ్రత ఎక్కువ



న్యూఢిల్లీ, ఆగస్టు 17: ప్రపంచవ్యాప్తంగా 2015లో అస్తమా, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు(సీవోపీడీ)తో 36 లక్షల మందికిపైగా మృతి చెందారు. వారిలో అస్తమాతో మరణించిన వారు 4 లక్షల మంది. ఇండియాతోపాటు పపువా, న్యూగినియా, లెసోతో, నేపాల్ దేశాల్లో సీవోపీడీ ఎక్కువగా ప్రబలింది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ సంస్థ చేసిన ఈ అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఆ వివరాలను లాన్సెట్ రెస్పిరేటరీ జర్నల్ ప్రచురించింది. 2015 ఏడాదికి సంబంధించిన లెక్కల ప్రకారం.. ఆఫ్ఘనిస్థాన్, సెంట్రల్ ఆఫ్రికా, ఫిజీ, కిరిబటి, పపువా, న్యూగినియా, లెసోతో, స్వాజిలాండ్ దేశాల్లో అస్తమా ఎక్కువగా ఉంది. ఇండియాలో ప్రతి లక్ష మందికి 2774 మంది సీవోపీడీతో, 4021 మంది అస్తమాతో బాధపడుతున్నారు. ప్రధానంగా వాయుకాలుష్యంతోపసాటు, పొగతాగడం వంటి కారణాల వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా 1990 నుంచి 2015 వరకు లెక్కిస్తే ఈ రెండు వ్యాధుల వ్యాప్తి, మరణాల రేటు తగ్గినా, చనిపోయిన వారి సంఖ్య మాత్రం ఎక్కువగానే ఉంది.